వెలుగుల వెనుక
కథలు
రూ॥160/- పేజీలు:160




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 236 | ఆదివారం | 26-07-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ప్రధాన్ రాజీనామా ఆమోదం

ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధానమంత్రి సూచన మేరకు రాష్ట్రపతి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజాపంపిణీ శాఖ మంత్రిగా ఉన్నారు.



## ప్రజాస్వామ్య విజయం

సోనమ్ వాంగ్‌చుక్

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను 'ప్రజాస్వామ్య విజయం'గా కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు. ఈ ఫలితానికి దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళన, పౌరుల భాగస్వామ్యమే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన పోస్టు చేశారు. వాంగ్‌చుక్ ఈ పరిణామాన్ని 'ప్రజాస్వామ్య విజయం, ప్రత్యక్ష ప్రజాస్వామ్యం... నేరుగా వీధుల నుంచే వచ్చిన విజయం'గా వర్ణించారు. దీనిని 'శాంతి, సహనం,

తరువాయి 8లో



## భారత యువశక్తి ఒత్తిడికి తలొంచిన కేంద్ర సర్కార్



# ధర్మేంద్ర రాజీనామా

# ఆందోళన విరమిస్తున్నాం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి ప్రకటన
- మిగతా రెండు డిమాండ్లు కూడా కేంద్రం అంగీకరించిందని వెల్లడి
- కేంద్ర ప్రభుత్వంతో ముగిసిన చర్చలు
- జంతర్ మంతర్ వద్ద మిన్నంటిన హర్షధ్వానాలు

భారత్ యువశక్తి ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం తలవంచింది. ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థి ఆందోళనకు ఉక్కిరిబిక్కిరై వారి ప్రధాన డిమాండ్ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి జవాబుదారీగా విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం రాజీనామా చేయించారు. మిగతా రెండు కోర్కెలు – నీట్ ఆందోళన సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థులపై పెట్టిన కేసుల ఎత్తివేత, ప్రశ్నాపత్రం లీకేజి పర్యవసానంగా ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లింపును ఇంతకుముందు చర్చల్లోనే కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించినందున – ప్రధాన్ రాజీనామా కోర్కె కూడా నెరవేరటంతో జంతర్‌మంతర్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు (కాక్రోచ్‌లు – బొద్దింకలు) కేరింతలు కొట్టారు. కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నాయకులు అభిజీత్ దీప్కే తదితరులు తమ తొలివిజయానికి ఉప్పొంగిపోతూ, 'కాక్రోచ్‌లు గెలిచాయి, ప్రజాస్వామ్యం గెలిచింది' అంటూ, ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల విజయానికి రాహుల్ గాంధీ తదితర నేతలు జేజేలు పలికారు. ఆ తదుపరి మధ్యాహ్నం కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేందర్ సింగ్ – సిజెపి అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ మధ్య జరిగిన చర్చల్లో మిగతా రెండు డిమాండ్‌లకు ప్రభుత్వం అంగీకరించింది. ఇదిలా వుండగా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్దిసేపటికే, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే (శివసేన)లకు ఢిల్లీ రావలసిందిగా బిజెపి నాయకత్వం వర్తమానం పంపటంతో కాబోయే విద్యామంత్రి ఫడ్నవీస్ అనే పుకార్లు బయలుదేరాయి. విద్యార్థి ఉద్యమ విరమణతో సెంట్రల్ ఢిల్లీలో వేగంగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. పోలీసులు ఆటంకాలు తొలగించారు. వారం రోజులుగా మూసివేసిన 15–16 మెట్రో స్టేషన్‌లు తిరిగి తెరిచారు. బస్సులు రోడ్డెక్కాయి. జంతర్‌మంతర్‌లో జూన్ 6 నుంచి నవతరం ఆన్‌లైన్ పార్టీ 'కాక్రోచ్ జనతాపార్టీ' (సిజెపి) పిలుపుపై, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ బాధ్యులపై చర్యలు, పరీక్షల సంస్కరణలు కోరుతూ చేస్తున్న నిరసన – నిరాహార దీక్షలు క్రమంగా బలం పుంజుకుని, ఈనెల 20న పార్లమెంటుకు మార్చ్ పై పోలీసు పైశాచిక దాడులతో తీవ్రతరమైంది. ఉద్యమం అనేక నగరాలకు విస్తరించింది. రెండోవైపున, వారికి సంఘీభావంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి పార్లమెంటులోపల, బయట చేసిన ఆందోళన ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టటం తెలిసిందే.



**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. నీట్ వ్యవహారంపై తన రాజీనామాను కోరుతూ నిరసనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రధాన్ తలొగ్గక తప్పలేదు. ఇది తనకు వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని, జంతర్ మంతర్, దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దేశ వ్యతిరేక శక్తులు తమకు అనుకూలంగా మలచుకోకుండా నివారించడమే తన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో రాజీనామా లేఖను పోస్టు చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో మొదటి రోజు నుండే తాను బాధ్యత వహించానని ప్రధాన్ తెలిపారు. గత 10 రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలను చూసి కలత చెందిన ఆయన, తన రాజీనామా లేఖను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపారు. నీట్ పేపర్ లీక్ విషయంలో మొదటి రోజు నుండే తాను

తరువాయి 8లో

పరీక్షా విధానంలో అక్రమాలు, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) నాయకత్వంలో వేలాది మంది విద్యార్థులు విజయం సాధించారు. వారు చేట్టిన నిరసనలకు ఫలితం దక్కింది. విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వంటి ఇతర రెండు డిమాండ్లకు కూడా ప్రభుత్వం అంగీకరించింది. దీంతో జంతర్ మంతర్ వద్ద సిజెపి చేపట్టిన 36 రోజుల నిరసనను విరమిస్తున్నట్లు శనివారం ఆ పార్టీ ప్రకటించింది. పరీక్షా విధానంలో అక్రమాలు, నీట్ పేపర్ లీక్ వ్యవహారాలపై ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద జూన్ 20న ప్రారంభమై వేలాది మంది విద్యార్థులను ఏకం చేసిన ఈ అపూర్వమైన సిజెపి నిరసనల ముగింపును, కేంద్ర మంత్రులు జె.పి. నడ్డా, జితేంద్ర సింగ్, సిజెపి ప్రతినిధులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. '36 రోజుల నిరసన తర్వాత ప్రభుత్వం మా డిమాండ్లన్నింటినీ

తరువాయి 8లో



పేపర్ లీకేజీ కేసులపై

## రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి

'రేపు' లోక్‌సభలో కేంద్రం బిల్లు

**న్యూఢిల్లీ :** రెండేళ్ల క్రితం తీసుకొచ్చిన పేపర్ లీకేజీ నిరోధక చట్టాన్ని సవరించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.నిందితుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రతీ రాష్ట్రంలోనూ ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు, 2026, ప్రకారం పేపర్ లీకులపై దర్యాప్తును రెండు నెలల్లో పూర్తిచేయవచ్చు. బిల్లును ప్రవేశపెట్టడానికి ముందు, లోక్‌సభ సభ్యులకు పంపిణీ చేయబడిన బిల్లు ప్రకారం, పేపర్ లీక్‌లు లేదా అక్రమ పద్ధతులలో పాల్గొన్న వ్యక్తులకు కనీసం 5 సంవత్సరాల నుంచి గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. సంఘటిత నేరాలకు ఈ బిల్లు కనీసం ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10కోట్ల వరకు జరిమానా

తరువాయి 8లో

## తప్పు చేస్తే ప్రజల ముందు తలొంచాల్సిందే




- ప్రధాన్ రాజీనామా పెద్ద ముందడుగు
- ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైంది
- కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ఖర్గే

**న్యూఢిల్లీ :** ఏ ప్రభుత్వమైన తప్పు చేస్తే ప్రజల ముందు తలవంచాల్సిందేనని కాంగ్రెస్ పేర్కొంది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. కాగా, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే విద్యార్థులు, యువతను అభినందించారు. అలాగే, ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందన్నారు. ధైర్యంతో ముందుకు రావాలని ఇతర వర్గాలకు పిలుపునిచ్చారు. 'భయపడకండి. భారతదేశంపై దాడి చేస్తూ, మన రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ, మన వ్యవస్థలన్నింటినీ తమ గుప్పిట్లోకి తీసుకుంటున్న ఈ పాలనను మనం అంతం చేద్దాం' అని ప్రధాన్ రాజీనామా తర్వాత ఎక్స్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో

తరువాయి 8లో


## బిజెపి అహంకారం ఓడింది



- దేశ విద్యార్థి–యువత ఉద్యమానికి చరిత్రాత్మక విజయం
- ప్రజాస్వామ్య విద్యావ్యవస్థకోసం పోరాటం ముగిసిపోలేదు
- ప్రజాస్వామ్యశక్తులతో కలిసి ఉమ్మడి పోరాటం కొనసాగిస్తాం
- సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఉద్ఘాటన

**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశంలో విద్యార్థులు, యువజనులు చేసిన ఉద్యమానికి చరిత్రాత్మక విజయమని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం జేజేలు పలికింది. ఈ మేరకు పార్టీ శనివారం ఒక ప్రకటన చేస్తూ, దేశంలో విద్యార్థి ఉద్యమం బిజెపి అహంకారాన్ని ఓడించిందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రభుత్వ వైఫల్యాలకు తగిన జవాబు చెప్పేలా చేసిందని ప్రశంసించింది. కేంద్రమంత్రి రాజీనామా ఒక ముఖ్యమైన విజయమైనప్పటికీ న్యాయబద్ధమైన,ప్రజాస్వామ్యయుతమైన విద్యావ్యవస్థకోసం చేసే పోరాటం ఇంకా ముగిసిపోలేదని స్పష్టం చేసింది. అత్యున్నతమైన నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యావ్యస్థను సాధించేందుకు దేశంలోని విద్యార్థులు,యువకులు,ఉపాధ్యాయులు సహా సమాజంలో ఉన్న అన్ని ప్రజాస్వామ్యశక్తులతో సర్వులనూ సమ్మిళితం చేసుకుని ఉమ్మడి పోరాటం చేస్తామని పార్టీ తన సంకల్పాన్ని, చిత్తశుద్ధిని

తరువాయి 8లో



## విద్యార్థుల ఉద్యమ విజయం

27న తలపెట్టిన కార్యక్రమం మార్పు

- జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు
- లోక్‌భవన్ ముట్టడి, కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనలు రద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

03




- నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా నెక్లెస్ రోడ్‌లో కాంగ్రెస్, వామపక్షాల నేతలు కొవ్వొత్తుల ర్యాలీ
- ఎమ్మెల్యే, ఎంపి పోటీ వయసును 21 ఏళ్లకు తగ్గించే తీర్మానం చేస్తాం : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



## జెన్ జీ పోరాటానికి తలొగ్గిన కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

"నీట్ పరీక్షల వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమమే కేంద్ర ప్రభుత్వం తలవంచడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసింది. 56 అంగుళాల ఛాతీ యువత ముందు వంగిపోయింది. ఈ విజయం ఏ రాజకీయ పార్టీది కాదు. జెన్ జీ యువతది' అయితే రాజీనామాతో పోరాటం ముగిసిపోలేదు. విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ, మృతుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగాలి. దేశవ్యాప్తంగా 22 రోజులుగా విద్యార్థులు, యువకులు, ఇండియా కూటమి, కాంగ్రెస్, వామపక్షాలు చేపట్టిన పోరాటం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనం. యువతకు రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా ఎమ్మెల్యే, ఎంపిగా పోటీ చేసే కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ శాసన సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. ఇందు కోసం ఆగస్టు మొదటి వారంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చెప్పారు. నీట్ ప్రశ్నపత్రాల లీక్ ఘటనతో పాటు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన అమానుష లాఠీఛార్జిని నిరసిస్తూ, విద్యార్థుల ఉద్యమానికి

తరువాయి 12లో

## యువత ఉద్యమ ఫలితం


సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమానికి ఫలితం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లావెంకట్‌రెడ్డి అన్నారు. ఈ రాజీనామా 'ప్రజాస్వామ్య విజయం' అని, విద్యార్థుల పోరాటానికి మద్దతుగా నిలిచిన అన్ని రాజకీయ పార్టీలకు అభినందనలు తెలిపారు. గత 22 రోజులుగా విద్యార్థులు, యువకులు, కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి, వామపక్షాలు కలిసి నీట్ పరీక్షల నిర్వహణలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టడం గమనార్హమన్నారు. నీట్ పరీక్షల

తరువాయి 12లో

## బిహార్‌లో నిరసనాగ్ని

- హింసాత్మకంగా మారిన బంద్
- పోలీసుల చర్యలకు వ్యతిరేకంగా వామపక్ష విద్యార్థి సంఘాల నిరసన ప్రదర్శనలు
- పలు జిల్లాల్లో పోలీసులకు, విద్యార్థులకు మధ్య ఘర్షణ



**పాట్నా:** 'నీట్' పేపర్ లీక్‌పై బిహార్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనాగ్ని రగులుతోంది. నిరసనలు కొనసాగిస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా పిలుపునిచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు మద్దతుగా బిహార్‌లోని పలు జిల్లాలలో శనివారం వామపక్ష విద్యార్థి సంఘాల సభ్యులు ప్రదర్శనలు నిర్వహించారు. కాగా, పోలీసులతో వారు ఘర్షణ పడ్డారని అధికారులు తెలిపారు. పట్నా, సరన్, సివాన్, ఔరంగాబాద్, భాగల్పూర్‌లలో బంద్ హింసాత్మకంగా మారిందని, సమస్తిపూర్, నవాడా, సలందా జిల్లాల్లో స్వల్ప నిరసనలు చోటుచేసుకున్నాయని పోలీసులు తెలియజేశారు. బంద్ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా భారీయెత్తున పోలీసులను మోహరింపజేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. పట్నాలోని డాక్ బంగ్లా చౌరహా వద్ద నిరసనకారులు పోలీస్ సిబ్బందిపై రాళ్లు, ఇటుకలు రువ్వడంతో, అనంతరం పోలీసులు పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. 'నిరసనకారులు మాపై రాళ్లు రువ్వారు. వారు బారికేడ్లను పగుల గొట్టేందుకు కూడా ప్రయత్నించారు. మేం పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నాం. పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. గొడవకు పాల్పడిన వారిని గుర్తించి, వారిపై మేం తగిన చర్యలు తీసుకుంటాం' అని పట్నా ఎస్ఎస్‌పి కార్తికేయ కె.శర్మ విలేకరులకు తెలిపారు. గుంపు మరింత పెరగకుండా నివారించేందుకు, వారిని చెదరగొట్టేందుకు పోలీసులు స్వల్ప బలప్రయోగం చేయాల్సి వచ్చిందని ఒక అధికారి చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు సిబ్బంది సెలవులు అన్నింటినీ రద్దు చేసినట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు. ముందస్తు జాగ్రత్తచర్యగాపాట్నాలోని పాలిగంజ్ ప్రాంతంతో సహా పలు ప్రాంతాలలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్

తరువాయి 12లో




## హెచ్1బిపై ట్రంప్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

- లక్షడాలర్ల ఫీజు హామీపై అప్పీల్ తిరస్కరణ

**వాషింగ్టన్ :** ఎలాగైనా హెచ్1బి వీసాల నుండి లక్ష డాలర్లు వసూలు చేయాలని పట్టుదలతో ఉన్న ట్రంప్‌కు అమెరికా న్యాయస్థానంలో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కొన్ని ప్రత్యేక రంగాలలో అపార నైపుణ్యంగల కార్మికులను విదేశాల నుండి తెచ్చుకోవడానికి కంపెనీలకు ఉన్న అనుమతికి సంబంధించిన వీసాలపై ముక్కుపిండి భారీగా లక్ష డాలర్లు వీసా దరఖాస్తు రుసుము వసూలు చేయాలని ట్రంప్ నిర్దేశిత ఉత్తర్వును దిగువ కోర్టు కొట్టివేసిన తర్వాత కూడా ఆయన పాలనాయంత్రాంగం స్టే మంజూరు చేయాలని పునఃసమీక్ష పేరుపై కోర్టును ఆశ్రయించింది. కానీ బోస్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఫస్ట్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌లోని ముగ్గురు న్యాయమూర్తులు ఈ రివ్యూ పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా శనివారం తిరస్కరించారు. ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వుకు దేశ అత్యున్నత చట్టసభ కాంగ్రెస్ ఉభయ సభల ఆమోదం లేదని పేర్కొంది. ట్రంప్ ఇప్పటికే

తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
ఆదివారం
26-07-2026
www.prajapaksham.in

ఎడిట్ పేజీ
PEOPLE'S VIEWS





## విచిత్ర సముద్ర జీవి..



అత్యంత విచిత్రమైన సముద్ర జీవిగా 'రెడ్‌లిప్డ్ బ్యాట్‌ఫిష్' ను పేర్కొనవచ్చు. ఇది ప్రధానంగా గాలాపగోస్ దీవులు, అలాగే పెరూ తీర ప్రాంత సముద్ర జలాల్లో కనిపించే అరుదైన చేప. ప్రపంచంలోని అత్యంత వింతగా కనిపించే సముద్ర జీవుల్లో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ చేపను ప్రత్యేకంగా నిలబెట్టేది దాని ప్రకాశవంతమైన ఎర్రటి పెదవులు. మనుషులు లిప్‌స్టిక్ వేసుకున్నట్లుగా కనిపించే ఈ పెదవులు పూర్తిగా సహజసిద్ధమైనవి. ఈ ఎర్రటి రంగు ఎందుకు ఏర్పడిందనే విషయంపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. రెడ్ లిప్డ్ బ్యాట్‌ఫిష్ ఇతర చేపల్లా వేగంగా ఈదదు. చిన్న వయస్సులో కొంత ఈదగలిగినా, పెద్దైన తర్వాత ఎక్కువ సమయం సముద్రపు అడుగున గడుపుతుంది. తన ఛాతీ, పొత్తికడుపు రెక్కలను కాళ్ల మాదిరిగా ఉపయోగిస్తూ ఇసుక, రాతి నేలపై నెమ్మదిగా నడుస్తుంది. అందుకే దీనిని చూసినవారికి ఇది చేప కంటే సముద్రపు నేలపై నడిచే వింత జీవిలా అనిపిస్తుంది. దీని తలపై 'ఇలిసియం' అనే ప్రత్యేక నిర్మాణం ఉంటుంది. అవసరమైనప్పుడు దానిని బయటకు తీసి చిన్న ఎరలా కదిలిస్తూ పురుగులు, రొయ్యలు, చిన్న చేపలు, పీతలను దగ్గరకు రప్పిస్తుంది. అవి చేరువకు రాగానే ఒక్కసారిగా వాటిని పట్టుకుని ఆహారంగా తీసుకుంటుంది. ఈ తెలివైన వేట పద్ధతి దీనిని ఇతర చేపల నుంచి భిన్నంగా నిలబెడుతుంది. సాధారణంగా 20 నుంచి 40 మీటర్ల లోతులో నివసించే ఈ చేప శరీర రంగు, ఆకారం సముద్రపు అడుగుభాగంలో కలిసిపోయేలా ఉండటంతో శత్రువుల కంటపడకుండా దాక్కోగలదు. అవసరమైతే కొద్దిదూరం ఈదగలిగినప్పటికీ, దీని ప్రధాన జీవన విధానం సముద్రపు అడుగున నడవడమే. ప్రకృతిలోని అద్భుతమైన పరిణామ క్రమానికి రెడ్‌లిప్డ్ బ్యాట్‌ఫిష్ ఒక అరుదైన ఉదాహరణ.

## భూమిపై ఎనిమిదో ఖండం!



భూమి మనకు తెలిసిన ఏడు ఖండాలకే పరిమితం కాకుండా, సముద్ర జలాల అడుగున దాదాపు పూర్తిగా దాగి ఉన్న మరో విశాల భూభాగం కూడా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దానినే 'జీలాండియా' అని పిలుస్తున్నారు. ఆస్ట్రేలియాకు తూర్పున, న్యూజిలాండ్ చుట్టుపక్కల విస్తరించి ఉన్న ఈ భూభాగం సుమారు 49లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. అయితే ఇందులో దాదాపు 94 శాతం భాగం సముద్ర జలాల అడుగున ఉండటంతో, సముద్ర మట్టానికి పైన కనిపించేది ప్రధానంగా న్యూజిలాండ్, న్యూ కాలెడోనియా, మరికొన్ని చిన్న దీవులు మాత్రమే. 2017లో భూగర్భ శాస్త్రవేత్తలు ప్రచురించిన ఒక ప్రముఖ పరిశోధనలో, జీలాండియాను ప్రత్యేక ఖండంగా పరిగణించేందుకు అవసరమైన అన్ని ప్రధాన భౌగోళిక లక్షణాలు దీనికి ఉన్నాయని వివరించారు. సముద్రపు అడుగుతో పోలిస్తే ఎత్తైన భూభాగం, ప్రత్యేక భౌగోళిక నిర్మాణం, మందమైన ఖండ భూపటలం (కాంటినెంటల్ క్రస్ట్), స్పష్టమైన భౌగోళిక సరిహద్దులు వంటి ప్రమాణాలన్నింటినీ జీలాండియా నెరవేరుస్తుందని వారు పేర్కొన్నారు. అయితే, జీలాండియాను ప్రపంచంలోని అన్ని శాస్త్రీయ సంస్థలు లేదా అంతర్జాతీయ భౌగోళిక సంస్థలు అధికారికంగా భూమిపై ఎనిమిదవ ఖండంగా ప్రకటించలేదు. అయినప్పటికీ, భూగర్భ శాస్త్రవేత్తల్లో గణనీయమైన వర్గం దీనిని స్వతంత్ర ఖండంగా పరిగణిస్తోంది. చాలామంది భూగర్భ శాస్త్రవేత్తలు జీలాండియాను ప్రత్యేక ఖండంగా గుర్తిస్తున్నారు అని చెప్పడం మరింత శాస్త్రీయంగా సరైనది. ఏదిఏమైనా, జీలాండియా ఆవిష్కరణ భూమి భౌగోళిక చరిత్రపై మన అవగాహనను మరింత విస్తరించింది.

## వింత జీవి ఉన్నట్టా? లేనట్టా?



ఆర్కిటిక్ ప్రాంతాల్లో, 18వ శతాబ్దానికి చెందిన జర్మన్ ప్రకృతి శాస్త్రవేత్త జార్జ్ విల్‌హెల్మ్ స్టెల్లర్ చేసిన పరిశోధనలతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు. రష్యా అన్వేషకుడు విటస్ బేరింగ్ యాత్రలో పాల్గొన్న ఆయన అనేక కొత్త జంతు, వృక్ష జాతులను శాస్త్రీయ ప్రపంచానికి పరిచయం చేశాడు. స్టెల్లర్ పరిశీలనలు అత్యంత విశ్వసనీయమైనవిగా గుర్తింపు పొందాయి. అందుకే స్టెల్లర్ సముద్ర ఆవు, స్టెల్లర్ సముద్ర సింహం, స్టెల్లర్ ఈడర్ వంటి అనేక జీవజాతులకు ఆయన పేరు పెట్టారు. అయితే ఆయన రచనల్లో 'డానిష్ సీ ఏప్' అనే విచిత్రమైన సముద్ర జీవి గురించిన వర్ణన కూడా కనిపిస్తుంది. కోతి లాంటి తల, వింత ప్రవర్తన కలిగిన ఈ జీవిని స్టెల్లర్ ఎంతో వివరంగా వర్ణించడంతో, అది నిజంగానే ఉండి ఉండవచ్చని ఒకప్పుడు కొందరు శాస్త్రవేత్తలు భావించారు. కానీ తరువాతి పరిశోధనల్లో ఈ వర్ణన వెనుక మరో ఆసక్తికరమైన కోణం వెలుగులోకి వచ్చింది. స్టెల్లర్ ప్రయాణించిన నౌక కెప్టెన్ డానిష్ వంశానికి చెందినవారిది. అతనితో స్టెల్లర్‌కు తరచూ విభేదాలు ఉండేవి. అందువల్ల ఆ కెప్టెన్ వ్యక్తిత్వాన్ని నేరుగా విమర్శించకుండా,ఒక కల్పిత సముద్ర జీవి రూపంలో వ్యంగ్యంగా చిత్రించి ఉండవచ్చని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. అయితే దీనిపై పూర్తి ఏకాభిప్రాయం లేదు. స్టెల్లర్ స్వయంగా అది వ్యంగ్య రచనే అని ఎక్కడా పేర్కొనలేదు. కొందరు పరిశోధకులు ఆయన నిజంగానే ఏదో తెలియని సముద్ర జీవిని చూసి ఉండవచ్చని కూడా భావిస్తున్నారు. అందువల్ల 'డానిష్ సీ ఏప్' కథ ఇప్పటికీ చరిత్ర, శాస్త్రం, సాహిత్యం కలిసిన ఒక ఆసక్తికరమైన మిస్టరీగానే మిగిలిపోయింది.

## అమెరికా నీటి భద్రతకు ముప్పు!



అమెరికా వ్యవసాయానికి, తాగునీటి భద్రతకు కీలక ఆధారంగా నిలిచిన 'ఒగల్లా లా అక్విఫర్' వేగంగా క్షీణిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. దక్షిణ డకోటా నుంచి టెక్సాస్ వరకు విస్తరించిన ఈ భూగర్భ జలాశయం నెబ్రాస్కా, కాన్సాస్, కొలరాడో, ఒక్లహోమా, న్యూ మెక్సికో, వ్యోమింగ్ రాష్ట్రాల భాగాలను కలుపుకొని సుమారు 1.74 లక్షల చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. దేశ వ్యవసాయ ఉత్పత్తిలో సుమారు 20 శాతం, ముఖ్యంగా మొక్కజొన్న, గోధుమలు, పత్తి, పశువుల మేత పంటల సాగు దీనిపైనే ఆధారపడి ఉంది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా భూగర్భ జలాలను అధికంగా పంపింగ్ చేయడం, సాగుభూముల విస్తరణ, వరుస కరువులు, ఆధునిక నీటిపారుదల పద్ధతుల విస్తరణ వంటి కారణాలతో ఈ జలాశయంపై తీవ్రమైన ఒత్తిడి పెరిగింది. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జల మట్టం 150 అడుగులకు పైగా పడిపోయింది. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, వర్షపు నీరు భూమిలోకి చొచ్చుకుపోయి అక్విఫర్‌ను పునరుద్ధరించడానికి వందల నుంచి వేల సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చు. దే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో అమెరికాలోని అనేక వ్యవసాయ ప్రాంతాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. దీంతో రైతులు అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో పెరిగే పంటలను ఎంచుకోవాల్సి రావచ్చు. కొన్ని ప్రాంతాల్లో సాగుభూముల విస్తీర్ణం కూడా తగ్గే అవకాశం ఉంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అమెరికాలోని పలు రాష్ట్రాలు డ్రిప్, సెంటర్ పివట్ వంటి నీటి పొదుపు సాంకేతికతలను ప్రోత్సహించడం, భూగర్భ జల వినియోగంపై నియంత్రణలు విధించడం, తక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును ప్రోత్సహించడం వంటి చర్యలు చేపడుతున్నాయి. అయినప్పటికీ సమస్య తీవ్రత దృష్ట్యా ఇవి మాత్రమే సరిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. **– బిఎస్ఎస్ మైత్రేయి**

# ప్రభుత్వం మెడలు వంచిన 'కాక్రోచ్‌ల' ఆందోళన

పట్టువిడవని నవతరం (జన్–జడ్) విద్యార్థుల ప్రజాస్వామ్యయుత ఆందోళన కేంద్ర సర్కార్ మెడలు వంచింది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజికి జవాబుదారీగా విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను తిరస్కరిస్తూ వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ విధిలేని పరిస్థితిలో శనివారం మధ్యాహ్నం ఆయన చేత రాజీనామా చేయించారు. ఇది యువశక్తికి విజయంగా, ప్రజాస్వామ్య విజయంగా జంతర్‌మంతర్‌లో కేరింతలు కొట్టిన కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకోగా, 'కాక్రోచ్‌లు గెలిచాయి, ప్రజాస్వామ్యం గెలిచింది' అని ప్రకటించిన సిజెపి ఆన్‌లైన్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, అంబేద్కర్ చిత్రపటాన్ని, రాజ్యాంగాన్ని చేబూని, ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. తమకు రాజకీయాలు అవసరం లేదన్నారు. ప్రధాన్ రాజీనామాకు ముందు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై రాజీలేదని, ఆయన రాజీనామా చేస్తేనే ఈ రోజు (శనివారం మధ్యాహ్నం) చర్చలకు వస్తామని, లేనిపక్షంలో ప్రధాన్ బదులు ప్రధానమంత్రి రాజీనామా కోరాల్సి ఉంటుందని సిజెపి 'ఎక్స్'లో పోస్టు పెట్టినట్లు ఉదయాన్నే టీవీలు స్క్రోలింగ్ మోసుకొచ్చాయి. విద్యార్థులను సంతృప్తి పరిచేందుకై ప్రధాన్‌ను విద్యాశాఖ నుంచి వేరేశాఖకు మార్చవచ్చన్న ప్రచారానికి జవాబుగా వారు ఆ ట్వీట్ చేశారు. కాక్రోచ్‌ల మహిళాబృందం, కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని కలిసి తమ డిమాండ్‌లకు ఆయన మద్దతు కోరారు. విద్యార్థులు ప్రధాన్ రాజీనామా కోరుతున్నారని, వారి కోర్కెలను తాము బలపరుస్తున్నామని రాహుల్ గాంధి ప్రకటించారు. మోదీ ప్రభుత్వం ఒకవైపు సిజెపి ప్రతినిధులతో చర్చలు జరుపుతూనే, మరోవైపున వారి ఆందోళనపై బురద జల్లేందుకు సంఘ వ్యతిరేకులు, దేశద్రోహులు, విదేశీ శక్తులు ఉద్యమంలో చేరారనే ప్రచారం చేస్తూనే వచ్చింది. పోలీసులు కూడా అదే ప్రచారం చేస్తూ పాత నేరస్థులను గుర్తించేందుకు అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించారు. ఎన్‌ఎటిలో ప్రక్షాళన చర్యలతోపాటు లీకేజీలకు పాల్పడేవారికి కఠిన శిక్షలకోసం చట్టసవరణను కేంద్రమంత్రివర్గం శుక్రవారమే ఆమోదించి ఆ నిర్ణయాలకు ప్రచారం ఇచ్చింది. వాంగ్‌చుక్ చేత 26 రోజుల నిరాహారదీక్షను మంత్రులు శుక్రవారం విరమింపజేశారు. అయితే ఈ ప్రయత్నాలేవీ సిజెపి నాయకత్వాన్ని బుజ్జగించలేకపోయాయి. ప్రధాన్ రాజీనామా డిమాండ్‌ను వారు సడలించలేదు. రోజులు గడిచేకొలది విద్యార్థి ఉద్యమం వివిధ రాష్ట్రాల్లోని పట్టణాలకు విస్తరిస్తున్నది. సోమవారం పార్లమెంటు సమావేశాలు పునఃప్రారంభం కానున్నాయి. కాబట్టి, ఇంకా రచ్చ నష్టదాయకమని భావించిన ప్రభుత్వ ముఖ్యులు బహుశా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశంపై ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించారు. పోలీసులు జంతర్‌మంతర్ దగ్గర అవరోధాలు తొలగించారు. సెంట్రల్ ఢిల్లీలో కొన్ని రోజులుగా మూసివేసిన 16 మెట్రోస్టేషన్‌లు తిరిగి తెరిచారు. మధ్యాహ్నం 3గంటల తర్వాత కేంద్రమంత్రులు జె.పి.నడ్డా, జితేంద్రసింగ్ – సిజెపి అధికార ప్రతినిధులు సౌరవ్‌దాస్, అశుతోష్ మధ్య చర్చలు పునఃప్రారంభమైనాయి. కాక్రోచ్‌ల మిగతా రెండు కోర్కెలకు – విద్యార్థులపై పెట్టిన కేసుల ఎత్తివేత, నీట్ లీకేజి తర్వాత ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా – ప్రభుత్వం అంగీకరించింది.

ఇది తిరుగులేదనుకునే నరేంద్రమోదీకి మూడో ఎదురుదెబ్బ. తొలిటరంలో భూసేకరణ పరిహారాలు తగ్గించటానికి ఆయన తెచ్చిన ఆర్డినెన్స్‌లను రైతాంగం వ్యతిరేకించటంతో ఉపసంహరించుకున్నారు. రెండవటరంలో కార్పొరేట్ వ్యవసాయానికి అనుకూలంగా మోదీ తెచ్చిన మూడు నల్లచట్టాలను – ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు సంవత్సరంపాటు బైఠాయింపు ఆందోళన జరిపి, ఎముకలు కొరికే చలిలో 100 మందికిపైగా చనిపోయాక ప్రధాని మోదీ (యుపి అసెంబ్లీ ఎన్నికలకు ముందు) దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. మూడవ టరంలో విద్యార్థుల ఆగ్రహానికి గురైనారు.

ఏ దేశ యువత భవిష్యత్‌కైనా సమాజ అవసరాలకు తగిన విద్యావ్యవస్థ అత్యంతావశ్యకం. అయితే శాస్త్రం కన్నా సనాతన ధర్మంలో విశ్వాసం కలిగి ఉన్న బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు సనాతన ధర్మ ఛాయల్లో విద్యార్థుల ఆలోచనను ప్రభావితం చేయటం పనిగా పెట్టుకుంది. పాఠ్యపుస్తకాల్లో అది చేస్తున్న మార్పులు చేర్పులు ఇందుకు నిదర్శనం. ఉన్నతవిద్యను కేంద్రీకరణ చేస్తున్నది. రెండోవైపున నిరుద్యోగం తాండవిస్తున్నది. ఏటా 2కోట్ల ఉద్యోగాల వాగ్దానంతో 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ఆ మాట మరిచిపోయారు. విద్య ప్రైవేటీకరణ పెరుగుతుండటంతో అది సామాన్యులకు ప్రతిభ ఉన్నా ఆర్థికంగా మోయలేని భారమైంది. అన్ని పైచదువులకూ పోటీ పరీక్షలు ప్రవేశపెట్టటంతో కోచింగ్ సెంటర్‌లు విద్యార్థుల కుటుంబాలను పిండుకుంటున్నాయి. మాఫియాలుగా ఏర్పడి ప్రశ్నాపత్రాలతో చీకటి వ్యాపారం చేస్తున్నాయి. ఆ దొంగ వ్యాపారం కొనసాగింపే నీట్–యుజి, 2026 ప్రశ్నాపత్రం లీకేజి. 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వ బాధ్యుల్లో చలనం లేదు. ఎక్కడో అమెరికాలో చదువుకుంటున్న అభిజీత్ దీప్కే అనే విద్యార్థి చలించాడు. అప్పుడే నిరుద్యోగులగూర్చి ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన 'కాక్రోచ్‌లు' అన్నట్లు చెప్పబడుతున్న వ్యాఖ్యను వ్యంగ్యంగా తీసుకుని ఆన్‌లైన్‌లో ఆ పేరుతో పార్టీ ప్రకటించాడు. మూడు–నాలుగు రోజుల్లోనే ఐదారు లక్షలమంది ఫాలోవర్లు చేరటంతో బెదిరిపోయిన మన ఘనత వహించిన మోదీ ప్రభుత్వం సామాజిక మాధ్యమం నుంచి ఆ సైట్‌ను నిషేధింపజేసింది. దీప్కే ఆ తర్వాత స్వదేశం వచ్చాడు. హిందూత్వ దురహంకారులు అతని పర్యటనలను అడ్డుకున్నారు. వారి భయపెట్టే ప్రయత్నాలు ఫలించలేదు. అతడు నెల రోజుల్లోనే జంతర్‌మంతర్ చేరాడు. సోషల్ మీడియా ద్వారా ఉద్యమం నిర్మించాడు. ఇది మన దేశంలో కొత్త. దాని పరిణామాలు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో చూశాం. ఇంతటి సువిశాల దేశంలో, పాలకపార్టీ బలంగా వేళ్లూని ఉండగా ఆ తరహాలో ప్రభుత్వ మార్పు సాధ్యం కాదని కాక్రోచ్‌లకూ తెలుసు. అందుకే నీట్ ప్రశ్నాపత్రం లీక్‌తో అసంతృప్తితో ఉడికిపోతున్న విద్యార్థులను తమ ఉద్యమానికి లక్ష్యంగా ఎంచుకున్నారు. విజయం సాధించారు.

అయితే ఇది అంతం కాదు – ఆరంభం మాత్రమే. దేశ భవిష్యత్‌లో యువత నిజంగా పాత్ర వహించాలంటే ప్రతిపక్షాలతోపాటు సామాజిక ఉద్యమాలు డేగ కన్నుతో పనిచేయాలి. అటువంటి ఐక్యత ఫలితాలు సాధిస్తుందని కాక్రోచ్‌ల అయత్నకృత ఆందోళన నిరూపించింది. ●

# కృత్రిమ మేధ యుగం, మానవీయ శాస్త్రాల భవిష్యత్తు

కృత్రిమ మేధ కేవలం ఒక సాంకేతిక ఆవిష్కరణగా మిగలకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్నత విద్యా వ్యవస్థల నిర్మాణాన్నే ప్రశ్నార్థకం చేస్తోంది. ఏ దేశం చూసినా ఒకే సందేహం, రేపటి ఉద్యోగ మార్కెట్‌కు ఈనాటి డిగ్రీలు సరిపోతాయా అని. అయితే ఈ సందేహానికి జవాబు వెతికే పద్ధతి దేశాన్ని బట్టి పూర్తిగా భిన్నంగా ఉంది. కొన్ని దేశాలు కోర్సులను తొలగించే కఠిన మార్గం ఎంచుకుంటే, మరికొన్ని ఉన్న కోర్సులకే ఏఐను జోడించే సున్నిత మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. ఈ రెండు మార్గాల మధ్య మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాల భవిష్యత్తు ఏమిటన్నది అసలైన చర్చనీయాంశం.

2021 నుంచి 2025 మధ్య చైనా తన అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో పన్నెండు వేల రెండు వందలకు పైగా కోర్సులను రద్దు చేసి, పది వేల రెండు వందలకు పైగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టింది. ఇది దేశవ్యాప్తంగా మొత్తం డిగ్రీ కోర్సుల్లో ముప్పై శాతానికి పైగా ప్రభావితం చేసింది. కృత్రిమ మేధ, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, క్వాంటమ్ అనువర్తనాలు, ఎంబాడీడ్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో కొత్త కోర్సులు వచ్చాయి. రద్దుల్లో ఎక్కువ భాగం భాషలు, కళలు, మానవీయ శాస్త్రాలకే పరిమితం కావడం గమనార్హం. చైనా విద్యా మంత్రిత్వ శాఖ 2023లోనే ఇరవై శాతం విశ్వవిద్యాలయ మేజర్లను 2025 నాటికి పునర్వ్యవస్థీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది, ఇది సెమీకండక్టర్లు, కృత్రిమ మేధలో అమెరికా తో పోటీని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన వ్యూహాత్మక నిర్ణయం. చైనాలో మానవీయ శాస్త్రాల గ్రాడ్యుయేట్ల ప్రారంభ వేతనాలు సాంకేతిక గ్రాడ్యుయేట్ల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయని మైకోస్ సంస్థ నివేదిక చెబుతోంది, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల నెలవారీ వేతనం విజువల్ డిజైన్ గ్రాడ్యుయేట్ల కంటే దాదాపు ముప్పై శాతం ఎక్కువగా ఉంది.

అమెరికాలో కృత్రిమ మేధ ప్రభావం వేరే రూపంలో కనిపిస్తోంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మానవీయ, కళా విభాగాల విద్యార్థుల నిష్పత్తి గత దశాబ్దంలో పదిహేనున్నర శాతం నుంచి పన్నెండున్నర శాతానికి పడిపోయింది. ఒఇసిడి గణాంకాల ప్రకారం, సభ్య దేశాల్లో ఎనభై శాతం దేశాల్లో గత దశాబ్దంలో మానవీయ శాస్త్రాల నమోదు గణనీయంగా తగ్గింది. బ్రిటన్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది, రస్సెల్ గ్రూప్‌కు చెందిన నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం నలభైకి పైగా కోర్సు ల్లో కొత్త ప్రవేశాలను నిలిపివేసింది, లీసెస్టర్ విశ్వవిద్యాలయం ఫిల్మ్ స్టడీస్, మోడర్న్ లాంగ్వేజెస్ విభాగాలనే పూర్తిగా మూసివేసింది. గత ఏడాది కాలంలో బ్రిటన్‌వ్యాప్తంగా నాలుగు వేలకు పైగా కోర్సులు రద్దయ్యాయి, వీటిలో ఎక్కువ భాగం సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలకు చెందినవే. అయితే ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, డెలాయిట్ సంస్థ 2026 నివేదిక ప్రకారం, కృత్రిమ మేధ వల్ల కొన్ని ఉద్యోగాలు కనుమరుగవుతుండటంతో, ముఖ్యంగా అమెరికాలో మానవీయ శాస్త్రాలపై ఆసక్తి మళ్లీ పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు, ఎందుకంటే యంత్రాలు చేయలేని విమర్శనాత్మక ఆలోచన, నైతిక తర్కం వంటి నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది.

సింగపూర్ డిగ్రీ నిర్మాణాన్ని పూర్తిగా మార్చకుండా, స్కిల్స్‌ఫ్యూచర్ పథకం ద్వారా జీవితకాల నైపుణ్యాభివృద్ధిపై పెట్టుబడి పెడుతోంది. 2026 మేలో ప్రకటించిన కొత్త విధానం ప్రకారం, 2027 నాటికి అన్ని విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్‌లలో చేరే ప్రతి విద్యార్థికి ప్రాథమిక ఏఐ నైపుణ్యాలు నేర్పించే మాడ్యూళ్లు తప్పనిసరి అవుతాయి, అయితే ఇవి ఆయా విద్యార్థుల ప్రధాన సబ్జెక్టుతో పాటుగానే బోధించబడతాయి తప్ప దానికి బదులుగా కాదు. దక్షిణ కొరియా కృత్రిమ మేధ నైపుణ్యాభివృద్ధిని జాతీయ మనుగడ వ్యూహంగా ప్రకటించి, 2027 నాటికి తమ కోర్సుల్లో ముప్పై శాతాన్ని ఏఐతో అనుసంధానించే విశ్వవిద్యాలయాలకు అదనపు పరిశోధన నిధులు ఇస్తూ, చేయని సంస్థలకు నిధులు తగ్గించే ప్రోత్సాహక విధానాన్ని అనుసరిస్తోంది, బలవంతపు కోర్సు రద్దులు కాదు. జపాన్ వైఖరి మరింత ఆసక్తికరం, సొసైటీ 5.0 విధానం కింద ఆర్థిక శాస్త్రం చదివేవారు కోడింగ్ నేర్చుకోవడం, సాహిత్యం చదివేవారు డేటాను అర్థం చేసుకోవడం అనే హైబ్రిడ్ గ్రాడ్యుయేట్ నమూనాను ప్రోత్సహిస్తున్నారు తప్ప, మానవీయ శాస్త్రాలను తొలగించడం లేదు. జపాన్ విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా డిజిటల్ హ్యూమానిటీస్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెట్టి, సాహిత్యం, చరిత్ర, సామాజిక శాస్త్రాల విద్యార్థులకే ఏఐ పరికరాలను తమ పరిశోధనలో ఉపయోగించే నైపుణ్యాన్ని అందిస్తున్నారు. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు చైనా నమూనాను నిశితంగా పరిశీలిస్తూ కోర్సు సమీక్షల తొలిదశలో ఉన్నాయి, కానీ చైనా తరహా కఠిన తొలగింపులు మాత్రం ఎక్కడా అమలు చేయలేదు.

ఈ ప్రపంచ నేపథ్యంలో భారత్ ఎంచుకున్న మార్గం, ఇప్పటికే ఉన్న కోర్సుల చుట్టూ ఏఐ నైపుణ్యాన్ని జోడించడం. కేంద్ర బడ్జెట్ 2026–27లో విద్యా రంగానికి లక్షా ముప్పై తొమ్మిది వేల కోట్ల రూపాయలు కేటాయించి, అందులో యాభై ఐదు వేల ఏడు వందల కోట్లకు పైగా




ఉన్నత విద్యకు కేటాయించడం, మూడో తరగతి నుంచే ఏఐ, కంప్యూటేషనల్ థింకింగ్‌ను తప్పనిసరి సబ్జెక్టుగా చేర్చాలన్న నిర్ణయం ఈ దిశలో ముందడుగే. అయితే మెర్సర్ మెటల్ సంస్థ ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్ ప్రకారం దేశవ్యాప్తంగా నలభై రెండున్నర శాతం గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారు. ఇందు లో తెలంగాణ మొత్తం ఉపాధి యోగ్యత దాదాపు నలభై ఏడున్నర శాతంగా నమోదైంది, నాన్ టెక్నికల్ విభాగంలో ఇది యాభై ఒక్క శాతం దాటినా, సాంకేతిక ఉద్యోగాల ఉపాధి యోగ్యతలో దక్షిణాది రాష్ట్రాలేవీ మొదటి పది స్థానాల్లో లేకపోవడం గమనార్హం. టీజీ ఈఏపీసెట్ 2025లో కంప్యూటర్ సైన్స్, ఐటీ అనుబంధ కోర్సులకు తొంభై ఒక్క శాతం సీట్ల భర్తీ నమోదు కావడం, పన్నెండు వేలకు పైగా ఏఐ అండ్ ఎంఎల్ సీట్లు, ఇరవై ఆరువేలకు పైగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉండటం విద్యార్థుల మొగ్గు ఎటువైపో చూపిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీ కోసం ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని, దేశంలోనే తొలి అంకిత ఏఐ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని నెలకొల్పే దిశగా అడుగులు వేస్తోంది. ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల కోసం కోడ్‌మిత్ర వేదిక ద్వారా ఏఐ అక్షరాస్యత కార్యక్రమాన్ని ఇరవై లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విస్తరించడం, పది జిల్లా కేంద్రాల్లో ఏఐ, నైపుణ్యాధారిత మైనారిటీ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయం పునాది స్థాయి నుంచే సంస్కరణ మొదలుపెట్టాలన్న అవగాహనను చూపిస్తున్నాయి. అయితే ఇవి ఇంకా ప్రయోగాత్మక ప్రాజెక్టులుగానే ఉన్నాయి తప్ప, రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో ఏకీకృత ప్రమాణంగా మారలేదు.

కృత్రిమ మేధ యుగంలో సాంకేతిక నైపుణ్యమే సర్వస్వం అనుకోవడం పొరపాటు అని అంతర్జాతీయ గణాంకాలే చెబుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2025లో విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ నివేదిక ప్రకారం, పది మంది యజమానుల్లో ఏడుగురు అనలిటికల్ థింకింగ్‌ను అత్యంత అవసరమైన నైపుణ్యంగా పేర్కొన్నారు, ఇది వరుసగా మూడో నివేదికలోనూ మొదటి స్థానంలో నిలిచింది. క్రియేటివ్ థింకింగ్ నాలుగో స్థానంలో, రెసిలియన్స్, లీడర్‌షిప్, సోషల్ ఇన్‌ఫ్లుయెన్స్ వంటి మానవ కేంద్రిత నైపుణ్యాలు తొలి ఐదింటిలో చోటు దక్కించుకున్నాయి. అంటే ఏఐ, డేటా నైపుణ్యాలతో పాటు, మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు నేర్పించే విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సామాజిక అవగాహన కూడా భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు అంతే అవసరమని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆదాయ గణాంకాలు కూడా ఈ వాదనకు మద్దతుగా నిలుస్తున్నా యి. జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయ సెంటర్ ఆన్ ఎడ్యుకేషన్ అండ్ ద వర్క్‌ఫోర్స్ అధ్యయనం ప్రకారం, పంతొమ్మిది మానవీయ, కళా విభాగాల్లో పద్నాలుగు విభాగాలు, స్టెమ్ గ్రాడ్యుయేట్ల ఆదాయంలో దిగువ పాతిక శాతం కంటే ఎక్కువ సంపాదిస్తున్నాయి. ప్రారంభ వేతనాల్లో స్టెమ్ గ్రాడ్యుయేట్లు ముందుండగా, కెరీర్ మధ్యలో ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం వంటి సామాజిక శాస్త్ర విభాగాలు జీవశాస్త్రం వంటి కొన్ని స్టెమ్ విభాగాలతో సమానంగా లేదా అంతకుమించి ఆదాయాన్ని అందిస్తున్నాయని ఈ అధ్యయనం చూపిస్తుంది. బ్రిటన్‌లోని రస్సెల్ గ్రూప్ గణాంకాల ప్రకారం కూడా అత్యధిక ప్రమాణాలున్న సంస్థల్లో మానవీయ శాస్త్రాల గ్రాడ్యుయేట్లలో తొంభై ఒక్క శాతం మంది మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. అంటే మానవీయ శాస్త్రాలను తక్షణ ప్రయోజనం లేని కోర్సులుగా తీసిపారేయడం కంటే, వాటిని ఏఐ నైపుణ్యాల తో జోడించి బలోపేతం చేయడమే దీర్ఘకాలిక ప్రయోజనకరం.

ఈ ప్రపంచ అనుభవాల నుంచి భారత్, తెలంగాణ నేర్చుకోవాల్సింది స్పష్టంగా కనిపిస్తోంది. చైనా వేగం, అమెరికా, బ్రిటన్‌లలో ఆర్థిక ఒత్తిడితో వస్తున్న బలవంతపు కోతలు రెండూ ఆదర్శప్రాయం కావు. కృత్రిమ మేధ నైపుణ్యాన్ని ప్రతి డిగ్రీలో భాగం చేయడం అవసరమే తప్ప, దాని పేరుతో మానవీయ శాస్త్రాలను, సామాజిక శాస్త్రాలను నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదు. జాతీయ విద్యా విధానం 2020కి ఇప్పుడు అవసరమైంది కేంద్రీకృత ఏఐ అనుబంధమే తప్ప, కోర్సుల ఏకపక్ష తొలగింపు కాదు. ఇంజినీరింగ్ సిలబస్‌లు సిస్టమ్స్ థింకింగ్ చుట్టూ పునర్నిర్మించుకోవాల్సినంతే, హ్యూమానిటీస్ కోర్సులు డిజిటల్ హ్యూమానిటీస్‌గా, కల్చరల్ అనలిటిక్స్‌గా పరిణామం చెందాల్సిన అవసరం ఉంది. సింగపూర్, జపాన్ చూపిన సమతుల్య మార్గం, దక్షిణ కొరియా చూపిన ప్రోత్సాహక విధానం, తెలంగాణ ప్రారంభించిన పునాది స్థాయి కార్యక్రమాలను ఒక జాతీయ ప్రమాణంగా విస్తరించడం ఇప్పుడు కావాల్సింది. ప్రతి డిగ్రీ పట్టభద్రుడు ఏఐ నైపుణ్యంతో పాటు, విమర్శనాత్మక ఆలోచన, మానవీయ దృక్పథంతో బయటకు వచ్చే విద్యా వ్యవస్థను నిర్మించుకోవడమే వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి నిజమైన బాట.

**మంచాల కిరణ్ కుమార్**

# ప్రజలు మేల్కొంటేనే ప్రజాస్వామ్యం మేల్కొంటుంది

'యథా రాజా తథా ప్రజా' అని పురాణాలు చెబుతాయి. కానీ ప్రజాస్వామ్యంలో 'యథా ప్రజా తథా రాజా'అనేదే నిజమైన సత్యం.

నీట్ (NEET) పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా వ్యక్తమైన ఆందోళనలు కేవలం ఒక పరీక్షకు సంబంధించిన అసంతృప్తి కాదు. అది భారత యువతలో పెరుగుతున్న ఆవేదనకు, విద్యావ్యవస్థపై తగ్గుతున్న నమ్మకానికి, పాలనలో పారదర్శకత కోరుతున్న ప్రజాస్వామ్య స్వరానికి ప్రతిబింబం.

లక్షలాదిమంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదువుతారు. వారి భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చినప్పుడు, ప్రభుత్వం వెంటనే స్పందించి, ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. కానీ విద్యార్థులు, తల్లిదండ్రులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేసి, అనేక వారాలు గడిచిన తర్వాత మాత్రమే బాధ్యత వహించిన వ్యక్తుల రాజీనామాలు జరిగితే, ప్రజల్లో సహజంగానే కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి.

రాజీనామా అనేది వ్యక్తిగత చర్య మాత్రమే కాదు; అది పాలనా బాధ్యతకు సంకేతం కూడా కావాలి. అయితే ప్రజల ఒత్తిడి అత్యున్నత స్థాయికి చేరుకున్న తర్వాత మాత్రమే అలాంటి చర్యలు కనిపిస్తే, 'ప్రజల స్వరం వినిపించాలంటే ఇంతకాలం వేచి చూడాలా?' అనే సందేహం కలగడం సహజం.

**ప్రజాస్వామ్యంలో పారదర్శకత ఎందుకు అత్యవసరం?**

ప్రజాస్వామ్యానికి మూలాధారం విశ్వాసం. ఎన్నికల్లో ఓటువేసిన ప్రజలు తమ తరఫున నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని నాయకులకు అప్పగిస్తారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టేది పారదర్శకత, జవాబుదారీతనం, వేగవంతమైన స్పందన. రామాయణంలో శ్రీరాముడు ప్రజల అభిప్రాయాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావించాడు. వ్యక్తిగతంగా కఠినమైన నిర్ణయాలైనా, రాజధర్మం కోసం తీసుకున్నాడనే భావన భారతీయ ఆలోచనలో తరచూ ప్రస్తావించబడుతుంది. పాలకునికి ప్రజాభిప్రాయం ఎంత ముఖ్యమో ఈ కథనం గుర్తు చేస్తుంది.

**యువత ఎందుకు రోడ్డెక్కుతోంది?**

ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. పోటీ పరీక్షలు పెరుగుతున్నాయి. ఒక సీటు కోసం వేల మంది పోటీ పడుతున్నారు. అలాంటి పరిస్థితిలో పరీక్షలపై నమ్మకం దెబ్బతింటే, అది కేవలం ఒక పరీక్ష సమస్య కాదు; దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశం. ఈ రోజు యువత సమాచార యుగంలో జీవిస్తోంది. నిజాన్ని తెలుసుకునే సాధనాలు వారి చేతుల్లో ఉన్నాయి. అందువల్ల ప్రశ్నించడం, జవాబులు కోరడం ప్రజాస్వామ్య విరోధం కాదు; ప్రజాస్వామ్య బలం.

**ప్రజలలో చైతన్యం ఎందుకు అవసరం?**

ఓటు వేయడం ప్రజాస్వామ్యానికి ప్రారంభం మాత్రమే; ముగింపు కాదు. ఎన్నికల తర్వాత కూడా ప్రజలు ప్రశ్నించాలి, ప్రభుత్వ పనితీరును గమనించాలి, విధానాలను విశ్లేషించాలి, చట్టబద్ధమైన మార్గాల్లో తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచాలి. మంచి పాలన కూడా ప్రజల చైతన్యం, నాయకుల బాధ్యత కలిసి పనిచేసినప్పుడే సాధ్యమవుతుంది.

**రాజకీయ నాయకులు మారాల్సిన సమయం**

ఈ కాలంలో నాయకత్వం అంటే కేవలం ఎన్నికల్లో గెలవడం కాదు. తప్పు జరిగితే వెంటనే అంగీకరించడం, విచారణను పారదర్శకంగా నిర్వహించడం, ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం నిజమైన నాయకత్వ లక్షణాలు. కృత్రిమ మేధస్సు (Artificial Intelligence), డిజిటల్ యుగం, సోషల్ మీడియా కాలంలో ఏ సమాచారమూ ఎక్కువ కాలం దాచిపెట్టడం సాధ్యంకాదు. అందువల్ల ఆలస్యంగా స్పందించడం కంటే, వెంటనే పారదర్శకంగా వ్యవహరించ డం ప్రభుత్వాల విశ్వసనీయతను పెంచుతుంది.

**ప్రజల బాధ్యత కూడా అంతే గొప్పది**

ప్రజలు నాయకులను వ్యక్తులుగా కాక, విధానాల ఆధారంగా అంచనా వేయాలి. కులం, మతం, ప్రాంతం, భావోద్వేగాల కంటే నిజాయితీ, సామర్థ్య ం, జవాబుదారీతనం, ప్రజాహితం వంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాస్వామ్యంలో చివరి తీర్పు ప్రజలదే. భారతదేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. యువత భవిష్యత్తు విద్యా వ్యవస్థ చేతుల్లో ఉంది. విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వానికీ అత్యున్నత బాధ్యత.

'ప్రజలు నిద్రిస్తే అధికారం అహంకారమవుతుంది; ప్రజలు మేల్కొంటే అధికారం బాధ్యతగా మారుతుంది.'

**కమల హాసన్ తుమ్మ,** 9505618252

# జలమే జీవం.. నీటిని ఆదా చేద్దాం

- వర్షపు నీటి సంరక్షణ సామాజిక బాధ్యత
- హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ :** జలమే జీవమని, నీటిని ఆదా చేద్దామని రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. భూగర్భజలాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో ఏర్పాటు చేసిన వర్షపు నీటి రీచార్జి ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాసంస్థలు విద్యాబోధనకే పరిమితం కాకుండా సమాజంలో సానుకూల మార్పునకు దోహదపడాలని చెప్పారు. కాకతీయులు, నిజాం పాలనలో నిర్మించిన చెరువులు, కుంటలు వర్షపు నీటి సంరక్షణకు, భూగర్భజలాల పునరుద్ధరణకు వారు ఇచ్చిన ప్రాధాన్యమేమిటో చాటి చెబుతున్నాయన్నారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, విస్తృత కాంక్రీటీకరణ కారణంగా హైదరాబాద్‌లో సహజ భూగర్భజలాల రీచార్జి తగ్గిపోయిందన్నారు. అందుకే శాస్త్రీయ విధానంలో వర్షపు నీటి సంరక్షణ అత్యంత అవసరమని తెలిపారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, హిమాయత్‌సాగర్ తదితర నీటి వనరుల నుంచి నగరానికి త్రాగునీరు సరఫరా అవుతున్నప్పటికి స్థానికంగా వర్షపు నీటిని భూగర్భంలోకి చేర్చే చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, విద్యా, వాణిజ్య సంస్థలు సమర్థవంతమైన వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాటిని సక్రమంగా నిర్వహించాలని, అప్పుడే నీటి ఎద్దడి తగ్గుతుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, వేగవంతమైన పట్టణీకరణ నేపథ్యంలో నీటి సంరక్షణ అత్యవసరమైందన్నారు. సహజవనరులు, భూగర్భజలాల రీచార్జి తక్కువగా ఉండే నగరాల్లో వర్షపు నీటి సంరక్షణకు మరింత ప్రాధాన్యం ఉందని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాటిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సింగూరు, మంజీరా, కృష్ణా, గోదావరి జలాశయాల నుంచి వందల కిలోమీటర్ల దూరం నుంచి నీటిని ఎత్తి పోస్తూ హైదరాబాద్‌కు త్రాగునీరు అందిస్తున్నామన్నారు. ఈపరిస్థితుల్లో భూగర్భజలాలను బలోపేతం చేయడం అత్యవసరమని చెప్పారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ సాధారణం కంటే తక్కువ వర్షపాతం, మారుతున్న పరిస్తితుల నేపథ్యంలో విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు తదితర ప్రాంతాల్లో శాస్త్రీయ పద్ధతిలో వర్షపు నీటి సంరక్షణ చేపట్టాలన్నారు. దీనికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ శ్రీరామ్ చక్రవర్తి, జిహెచ్ఎంసి కన్వీనర్ ఆర్‌వి కర్ణన్. కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కరుణసాగర్, ఇతర అధికారులు, ప్రొఫెసర్లు, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగానికి ఢోకా లేదు

- గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు!
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం పడిపోయిందంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని, అలాంటి అసత్యాలను నమ్మాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నగరంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందగా, ప్లాట్ల విక్రయాల్లో ఏకంగా 40 శాతం వరకు వృద్ధి నమోదైందన్నారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ అద్భుతంగా వృద్ధి చెందిందని, రిజిస్ట్రేషన్ శాఖలో నానాటికీ పెరుగుతున్న డాక్యుమెంట్ల సంఖ్యే దీనికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై కావాలని బురద జల్లేందుకు చేస్తున్న ప్రచారాలను పక్కనబెట్టాలని ప్రజలను ఆయన కోరారు.

**అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్ర బిందువు 'హైదరాబాద్'**

'2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి కారణంగానే ఐటి, ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి నిర్మాణాలు జరిగి హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలసి దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించారని, నగరం పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా మారిందన్నారు.

**రూ. 7 వేల కోట్లతో 'మూసీ' ప్రాజెక్ట్ టెండర్లు**


హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోందని మంత్రి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. మూసీ సుందరికరణకు రూ.7 వేల కోట్ల అంచనాతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ తొలివిడత (28 కిలోమీటర్లు) పనులకు వారం పది రోజుల్లో టెండర్లు ఆహ్వానిస్తామని చెప్పారు. మెట్రో విస్తరణ పాతబస్తీని కలుపుతూ రూ.24 వేల కోట్ల వ్యయంతో 76 కిలోమీటర్ల మేర రెండవ విడత మెట్రో విస్తరణ చేపట్టనున్నామన్నారు. ఆర్ఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్‌ను అనుసంధానించేలా రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు కూడా సిద్ధమవుతున్నాయన్నారు.

**భూభారతి చట్టం, పేదల ఇళ్లకు ప్రాధాన్యం**

భూములకు భద్రత కల్పించేందుకు 'భూభారతి' చట్టాన్ని తీసుకొచ్చామని, అందులోని చిన్నపాటి సాఫ్ట్‌వేర్ సమస్యలను 15–20 రోజుల్లో పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే ఒకవైపు రియల్ రంగానికి ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబోతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ స్థల సేకరణతో పాటు రియల్ ఎస్టేట్ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ అనుమతుల సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపి రఘురామ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉద్యమ విజయం


- 27న తలపెట్టిన కార్యక్రమం మార్పు
- జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు
- లోక్‌భవన్ ముట్టడి, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనలు రద్దు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్/ హనుమకొండ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఉద్యమ విజయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యార్థుల పోరాటం ద్వారా ప్రజాస్వామ్యం విజయం సాధించిందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీతో నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నీట్ పరీక్షను రద్దు చేసి, ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకు అప్పగించాలని, విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేస్తున్న నేపథ్యంలో ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన లోక్ భవన్ ముట్టడి, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలను రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. అదేరోజు సాయంత్రం నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల, పట్టణ కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నీట్ పేపర్ లీకేజ్ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజుల నుండి దేశంలో విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాటాల ఉధృతం చేయడం వల్ల నేడు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి ఉద్యమాలకు తలొగ్గి రాజీనామా చేశారని, ఇది విద్యార్థుల పోరాట ఫలితమేనని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వంలో ఇప్పటికి మూడుసార్లు పేపర్ లీకేజ్ కావడం వల్ల లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని, వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, ప్రభుత్వం లీకేజీలు జరిగితే నామమాత్రం చర్యలు తీసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే లీకేజీలు, అవకతవకలు అరికట్టవచ్చని అన్నారు.

# ధర్మేంద్ర రాజీనామా ప్రజాస్వామ్యానికి గెలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా ప్రజాస్వామ్య విజయమని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. విద్యార్థుల ఉద్యమానికి తలొగ్గిన ప్రభుత్వం మంత్రిని రాజీనామా చేయించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఉద్యమం నడిపిన యువతకు, విద్యార్థులకు పల్లా వెంకటరెడ్డి అభినందనలు తెలిపారు. ఇదే ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులు, యువతకు ఆయన పిలుపునిచ్చారు.

**నీట్ ఉద్యమం విద్యార్థుల విజయమే: జాన్‌వెస్లీ**

నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు, యువత సాగించిన ఉద్యమం చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. విద్యార్థుల ఉద్యమం తీవ్రతతోనే కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించాల్సి వచ్చిందని, ఇది విద్యార్థి ఉద్యమ విజయమని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం యువత ఇదే స్ఫూర్తితో పోరాటాలు కొనసాగించాలని కోరారు.

**రాజీనామా విద్యార్థుల విజయమే: మహేష్ కుమార్ గౌడ్**

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి లోకం సాధించిన నైతిక విజయమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపియేతర రాజకీయ పక్షాలు చేపట్టిన పోరాటం ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పోరాటానికి ఎవరైనా తలొగ్గాల్సిందేనని, నియంతృత్వ పోకడలకు స్థానం లేదని ఈ రాజీనామా స్పష్టం చేసిందని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని ప్రపంచం గమనించిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగకుండా సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

**గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సంబరాలు**

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో శనివారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకుని, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ అంశంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, విద్యార్థులు, యువత చేపట్టిన పోరాటం ఫలించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా గుణపాఠం నేర్చుకుని విద్యా విధానంలో అవసరమైన మార్పులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు యడవల్లి వెంకటస్వామితో పాటు విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యమాల ఫలితమే రాజీనామా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి ఉద్యమ విజయమని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. నీట్ పేపర్ లీకేజ్ ఘటనపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఎఐఎస్ఎఫ్‌తోపాటు వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే ఎట్టకేలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్నారు. బిజెపి ప్రభుత్వ హయాంలో పలుమార్లు ప్రశ్నాపత్రాల లీకేజీలు జరగడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, విద్య కేంద్రీకరణను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం భవిష్యత్తులో కూడా విద్యార్థులను ఐక్యం చేసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు కొనసాగిస్తామని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు.

# ధర్మేంద్రపై క్రిమినల్ కేసు నమోదు

- ఎఐవైఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్‌లో సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి వై జంక్షన్ వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శవయాత్ర ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థులు ఆందోళనలో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రచార రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. ఒక దేశానికి ప్రధాని అంటే దేశ ప్రజల సమస్యలకు బాధ్యత వహించాల్సిన వ్యక్తి. విద్యార్థుల భవిష్యత్తు, నీట్ పేపర్ లీకులు, నిరుద్యోగుల ఆవేదన వంటి అత్యంత తీవ్రమైన అంశాలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో ఆయన రాజకీయ ప్రచార వీడియోల మాదిరిగా వ్యవహరించడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.బాలకృష్ణ, సల్మాన్ బేగ్, మధు, వెంకటేశ్, మధుకర్, అలీ, రాహుల్, కిరణ్, ప్రదీప్, రమేశ్, సాయి, భరత్, ధీరజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజీనామా.. విద్యార్థుల విజయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయమని పలువురు మంత్రులు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు, విద్యార్థుల హక్కులను రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, యువజన సంఘాలకు, ప్రజాస్వామ్య శక్తులందరికీ అభినందనలు తెలియజేశారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి మరింత బలంగా పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భం అని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు, విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించిందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కును హరిస్తే ప్రజలు మరింత ఐక్యంగా పోరాడతారని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని కోరారు. ఈ రాజీనామా దేశ ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేంద్ర బిజెపి ప్రభుత్వం గద్దె దిగడానికి తొలి మెట్టు అని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్, ప్రభుత్వ విప్‌లు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బల్మూర్ వెంకట్, డిసిసి అధ్యక్షులు శివసేనా రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వాఖ్యానించారు. విద్యార్థుల ఉద్యమం, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా రాహుల్ గాంధీ నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానం అని హెచ్చరించారు. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని పూర్తిగా మార్చుకోవాలని సూచించారు.

**అబద్ధాలకు, అహంభావానికి చెంపదెబ్బ... సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ**

కాక్రోచ్ రూపంలో యువత ఉద్యమం విజృంభించిందని సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ అన్నారు. ఈ ఉద్యమాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ప్రధానమంత్రి ప్రయత్నిస్తే, ప్రధాన న్యాయమూర్తి బొద్దింకల పేరుతో వెటకారం చేసిన ఫలితంగా ఉద్యమం వికసించిందన్నారు. చివరికి విద్యాశాఖమంత్రి రాజీనామా చేయడంతో వాతావరణం తాత్కాలికంగా చల్లబడ్డా బిజెపి ప్రభుత్వానికి ఇది ఒక గుణపాఠంలాంటిదన్నారు. అబద్ధాలకు, అహంభావానికి ఈ ఉద్యమం సరైన గుణపాఠం చెప్పిందన్నారు. అటు సిజెఐ ఇటు ప్రధాని మోదీ సమాజం ముందు ముద్దాయిలేనన్నారు.

**యల్లంపేట్ మున్సిపాలిటీ కార్యాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా**
mcyellampet2025@gmail.com

క్ర.సం.1, **NIT No.** E1/07/2026-27, **వివరణ:** MCY (3)లో కొంత పనిని చేపట్టడమైనది, **అంచనా విలువ:** రూ.87.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25.07.2026 మ.3.00గం.లకు, బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 03.08.2026 మ.3.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం అనగా https://tender.telangana.gov.in లో చూడవచ్చు లేదా యల్లంపేట్ మున్సిపాలిటీ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

సం/- కమిషనర్, యల్లంపేట్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 6755-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేది & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 09/DB/EE-II/ Alwal Circle/ MMC/2026-27, Dt: 24.07.2026 | ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, అల్వాల్ సర్కిల్ (02) పరిధిలోని ఆలయంలో బోనాల పండుగ కోసం స్టోన్ చిప్స్ మరియు క్రషర్ స్టోన్ డస్ట్‌ని సరఫరా చేయడం. | రూ. 13.50 లక్షలు | 27.07.2026 02:00 PM | 30.07.2026 02:00 PM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి.

DIPR R.O. No. : 6712-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మాదాపూర్ సర్కిల్-50**

Lr.No: 12/EE/CIR-50/KPZ/CMC/2026-27 Date: 25.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది /ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 12/EE/CIR-50/KPZ/ CMC/2026-27, Date: 25.07.2026 | సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50లో పండుగ పనులు | రూ. 3.20 లక్షలు | 27.07.2026 01:00 PM 03.08.2026 11:30 AM | శ్రీమతి సిహెచ్.శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, మాదాపూర్ సర్కిల్-50, సెల్: 9701414306 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, సిఎంసి.

DIPR R.O. No. : 6750-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ (రూ.లక్షలలో) | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ & సమయం / బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| NIT No. 43/ EE-I/MKJZ/ MMC/2026-27 | డిస్క్‌టాప్ మరియు ప్రింటర్ల సేకరణ | 1408920.00 | 25.07.2026 ఉ.11:30గం.లకు, 01.08.2026 & ఉ.11:30గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 6773-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

# 'ఇవి ఉద్యమ చెప్పులు'

- జంతర్‌మంతర్‌లో విద్యార్థుల పోరాటానికి దేశవ్యాప్తంగా మానవత్వం అండ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఇవి సాధారణ చెప్పులు కావు. ప్రతి చెప్పు వెనుక ఒక విద్యార్థి కన్నీరు, ఒక గాయం, ఒక కల ఉంది' అని చెప్పులను 'ఉద్యమ జ్ఞాపకాల ప్రదర్శన'గా ఢిల్లీలో ఏర్పాటు చేశారు. ఈ చెప్పులను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని నీట్ పేపర్ లీక్‌పై బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని గత నెల రోజుల నుంచి పోరాటం చేస్తున్న ఆందోళనకారులు ప్రకటించారు.

**లాఠీఛార్జిలో విడిచిపెట్టిన చెప్పులతో వినూత్న నిరసన**

స్విగ్గీ, జొమాటో ద్వారా దేశం నలుమూలల నుంచి ఆహార సహాయం, ఉద్యమానికి మద్దతుగా సాధారణ ప్రజలు స్పందించడం ఉద్యమ తీవ్రతను చాటిచెబుతుంది. ఉద్యమాలు నినాదాలతో మాత్రమే కాదు. మనుషుల మనసుల్లో మిగిలిపోయే జ్ఞాపకాలతో చరిత్రలో నిలిచిపోతాయి. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల ఉద్యమంలో అలాంటి హృదయాన్ని కదిలించే దృశ్యా లే కనిపించాయి. పోలీసుల లాఠిచార్జిలో విద్యార్థులు విడిచిపెట్టిన చెప్పులు ఉద్యమానికి గుర్తుగా మారగా, వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న సాధారణ ప్రజలు స్విగ్గీ, జొమాటో వంటి సేవల ద్వారా పంపించిన ఆహార పొట్లాలు దేశవ్యాప్తంగా మానవత్వానికి ప్రతీకగా నిలిచాయి. పోలీసుల దాడిలో చెల్లాచెదురైన వందలాది మంది చెప్పులను ఉద్యమకారులు సేకరించి జంతర్‌మంతర్ వద్ద ప్రత్యేకంగా ప్రదర్శించారు. విద్యార్థులు బీహార్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్ సహా దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి ఢిల్లీకి వచ్చారని, లాఠిచార్జిలో పరుగులు తీస్తూ చెప్పులు అక్కడే వదిలివెళ్లాల్సి వచ్చిందని ఉద్యమకారులు తెలిపారు. అనేక మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కొందరికి తీవ్ర గాయాలయ్యాయని వివరించారు.

**ఆకలితో ఉండకూడదంటూ దేశం స్పందించింది**

జంతర్‌మంతర్ వద్ద నిరసన కొనసాగుతున్న విషయం తెలిసిన తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలు విద్యార్థులకు ఆహారాన్ని పంపించడం ప్రారంభించారు. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌తో పాటు విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు కూడా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌ల ద్వారా భోజనాన్ని పంపించారు. డెలివరీ సిబ్బంది వరుసగా ఆహార పొట్లాలు తీసుకువస్తుండగా, ఒక దశలో 'ఇప్పటికే సరిపోయింది' అని చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యమానికి ప్రజల నుంచి వచ్చిన మద్దతు కేవలం మాటల్లో కాదని, చేతల్లోనూ కనిపించిందని నేతలు వ్యాఖ్యానించారు.

## ఎల్‌నినోతో సూక్ష్మ, సాగునీటి వ్యవస్థలు ఏర్పాటు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలుస్తూ డ్రిప్, స్ప్రింక్లర్ లాంటి సూక్ష్మ, సాగునీటి వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు సూచించారు. శనివారం సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు మైక్రో ఇరిగేషన్ కీలకమన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును త్వరగా పూర్తి చేయాలని, నాణ్యమైన పరికరాలు అందించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని కంపెనీలను ఆదేశించారు.పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో కంపెనీలకు రూ.400 కోట్లు చెల్లించామని మంత్రి తెలిపారు. బిల్లుల కారణంగా పనులు ఆలస్యం చేయకుండా రైతుల ప్రయోజనాల దృష్ట్యా లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే ఇతర జాతీయ, అంతర్జాతీయ మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తెలంగాణలో పనిచేయడానికి ఆసక్తి చూపితే, వాటిని కూడా ఎంప్యానెల్ చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**సమయపాలనపై ఉద్యోగులపై టిజిఓయిల్‌ఫెడ్ కఠిన చర్యలు**

ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన, క్రమశిక్షణకు పెద్దపీట వేస్తూ తెలంగాణ సహకార నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య (టిజిఓయిల్‌ఫెడ్)ఆలస్యంగా విధులకు హాజరైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంది. వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ నెల 24న టిజిఓయిల్‌ఫెడ్ ప్రధాన కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఉదయం 10:30 గంటల వరకు పలువురు అధికారులు, ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. సేవా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు.

దీంతో ఎండి వెంటనే చర్యలు చేపట్టి ఆలస్యంగా హాజరైన ఆరుగురు రెగ్యులర్ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో ఇద్దరి సేవలను రద్దు చేయగా, మరో ఇద్దరిని బదిలీ చేశారు. అదనంగా ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఈ సందర్భంగా టిజిఓయిల్‌ఫెడ్ ఎండి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థల్లో సమయపాలన, బాధ్యతాయుతమైన విధి నిర్వహణ, ప్రజలకు నాణ్యమైన సేవలందించడం ముఖ్యమని అన్నారు. నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ, ఉద్యోగులంతా నిర్ణీత సమయానికి విధులకు హాజరై సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు.

దేవాదాయ – ధర్మాదాయ శాఖ
**శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము**
శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073. ఫోన్ నెం. 9494252843, 040-23748247.

**ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన**

టెండర్ నోటీసు నెం.1/TEN/SVST/SNC/2026 తేది: 26.07.2026

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఒక సంవత్సరం కాలపరిమితికి క్రమ.సం.1 కి తేది: 01.11.2026 నుండి 31.10.2027 మరియు క్రమ.సం. 2 నుండి 10 వరకు అనగా తేది: 11.09.2026 నుండి 10.09.2027 వరకు దేవాలయములో ఈ దిగువ తెలియపరచినవాటి నిమిత్తం లైసెన్స్ హక్కుల కొరకై టెండర్ దారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము ద్వార టెండర్లు కోరనైనది.

| క్ర. సం. | ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలము వివరములు | ధరావత్తు (E.M.D.) | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|
| 1 | దేవస్థానమునకు ప్రొవిజన్స్ (కిరణా సామాగ్రి) సరఫరా చేయు హక్కు | రూ.25,000/- | రూ.5,000/- |
| 2 | కొబ్బరి కాయలు మరియు పూజ సామాగ్రి అమ్ముకునే హక్కు | రూ.50,000/- | రూ. 1000/- |
| 3 | పూలు మరియు పూల మాలలు అమ్ముకొనే హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 4 | ఆర్జిత సేవ టిక్కెట్ల పుస్తకములు, కరపత్రాలు మొ॥లగునవి ముద్రించి సప్లయి చేయు లైసెన్సు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 5 | కళ్యాణమండపము నందు హౌస్ కీపింగ్ చేసుకొనే హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 6 | దేవస్థానమునకు విద్యుత్ అలంకరణ చేయు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 7 | దేవస్థానమునకు పర్వదినముల యందు పూల అలంకరణ | రూ.10,000/- | రూ.2000/- |
| 8 | దేవస్థానము రోజు వారి పూల దండలు సప్లయి చేయు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 9 | సెక్యూరిటీ సర్వీసెస్ లైసెన్సు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |
| 10 | క్యూ లైన్ మరియు తడికెల పందిర్లు ఏర్పాటు చేయు హక్కు | రూ.10,000/- | రూ. 1000/- |

గమనిక:
1. క్ర.సం. 1 (కిరణా సామాగ్రి సరఫరా) కేవలం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మాత్రమే అంగీకరించ బడును.
2. ఆసక్తి గల వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పూర్తి వివరముల కొరకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
3. తేదీ: 28.07.2026 నుండి 04.08.2026 సా.4:00 గంటల వరకు టెండర్ షెడ్యూల్ జారీ చేయబడును.
4. తేదీ: 07.08.2026 రోజు ఉ.11.00 గం.ల వరకు కొటేషన్స్ (సీల్డ్ టెండర్స్) స్వీకరించబడును.
5. తేది: 07.08.2026 రోజున టెక్నికల్ బిడ్ ఉ.11.30 ని.లకు ప్రైస్ బిడ్ 12.30 ని.లకు తెరువబడును.
6. ప్రైస్ బిడ్ విప్పిన తరువాత టెండరు దారుల సమక్షములో క్ర.సం. 2 నుండి 10 వరకు సీల్డ్ కొటేషన్స్ తెరువబడును, తదుపరి క్ర.సం. 2 నుండి 10 వరకు బహిరంగ వేలము నిర్వహించబడును.
7. సీల్డ్ టెండర్‌లో పాల్గొన్న వారిని మాత్రమే బహిరంగ వేలములో అనుమతించబడును.

నోట్: ఏ కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని కార్యనిర్వహణాధికారి గారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకై దేవస్థాన కార్యాలయము నందు కాని ఫోన్: 9494252843, 040-23748247 ద్వారా కాని సంప్రదించగలరు.

శ్రీ స్వామివారి సేవలో
యం.శ్రీనివాస శర్మ
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 6780-PP/CL/ADVT/2026-27, Date: 25-07-2026

## మానవత్వం పూతోట మద్దిలేటి పాట: మంత్రి జూపల్లి



ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి: కల్వకోల్ మద్దిలేటి రాసిన 'మనమంచు పల్లె' పుస్తకంలో పల్లెల జీవితాలను, ప్రకృతి అందాలు ఉన్నాయని మానవత్వం పూతోట మద్దిలేటి పాట అని పర్యాటకశాఖ, ఎక్సైజ్ పురావస్తు శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు వనమంచుపల్లె పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలకు పాటలే సాధనంగా ఉపయోగపడ్డాయని అలాంటి పాటల సాహిత్యంతో ఈ సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలను, మాదకద్రవ్యాల వాడకం, మత్తు పానీయాలు వాడకం, దొంగతనాలు, లూటీలు, దోపిడీలు చేసే అటువంటి సంస్కృతిని పల్లెల నుంచి పారదోలడానికి కవులు రచయితలు ప్రయత్నించాలని మహిళలపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలను దాడులను తమ రచనలతో అరికట్టాలన్నారు. కవులకు రచయితలకు మా ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. అనంతరం రచయిత కల్వకోల్ మద్దిలేటిని జూపల్లి అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్వకోలు ఉపసర్పంచ్ గువ్వలి చిన్నకుర్మయ్య, మాజీ ఎంపిటిసి యం.లక్ష్మి నారాయణ, వి.పరుశురామరాజు పంచాయితీ రాజు సూపరింటెండెంట్ మార్కెట్ కమిటీ చైర్మన్ పస్పుల నరసింహా, ఉల్లంగొండ శివశంకర్, కొండూరు గ్రామ సర్పంచు కేతూరు ధర్మ తేజ, నూనె క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్ల ప్రజలకు మెరుగైన అగ్నిమాపక సేవలు

ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి



ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల పట్టణ ప్రజలకు అత్యవసర అగ్నిమాపక సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించాలనే లక్ష్యంతో జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ దాబా సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఫైర్ స్టేషన్ భవన నిర్మాణానికి నేడు జడ్చర్ల శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. శనివారం నాడు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో ఫైర్ సర్వీసుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పెరుగుతున్న పట్టణ అవసరాలను అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో ఫైర్ స్టేషన్ నిర్మాణం చేపట్టడం వల్ల అగ్నిప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో సత్వర స్పందనకు అవకాశం కలుగుతుందని అన్నారు. జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని సమయానికి పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తాండూరులో నేడు ఎఐటియుసి జిల్లా మహాసభలు



ప్రజాపక్షం/పెద్దకొత్తపలి: నేడు తాడూరులో జరిగే ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేద్దామని నాగర్‌కర్నూల్ జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ అన్నారు. పెంట్లవెల్లి, కొల్లాపూర్, కేంద్రాలలో హమాలీ కార్మికులు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మారేడి శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, ఎఐ టియుసి 3వ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా 50 సంవత్సరాల నిండిన ప్రతి కార్మికుడికి నెలకు 5000 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని, కార్మికుల కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ వైద్యం కార్పొరేట్ విద్య అందించాలని, ఇందిరమ్మ ఇండ్లు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా మాజీ అధ్యక్షుడు తప్పెట కిరణ్ కుమార్, హమాలీ కార్మికులు రాజు, హుస్సేన్, శేఖర్, సురేష్, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక



ప్రజాపక్షం/కల్వకుర్తి: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ మోటర్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కల్వకుర్తి పట్టణ కమిటీని శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో గల ఎఐటియుసి కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి జిల్లా నాయకులు పూలిజాల పరుశురాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎఐటియుసి కార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందని అన్నా రు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రతి ఆగో కార్మికునికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండు చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ మోటర్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) కల్వకుర్తి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దేశం సైదులు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె.అమీర్, ఉపాధ్యక్షులుగా వాకిటి రాజేష్, కోశాధికారిగా జి.మహేష్, ఉపాధ్యక్షులుగా కటికర్ల సాయి బాబు, ఎడ్ల జనార్ధన్, పరుశురాం గౌడ్, సహాయ కార్యదర్శులుగా ఖదీర్, నాగరాజు, శేఖర్ , కమిటీ సభ్యులుగా యాదగిరి, మల్లేష్, లక్ష్మి , కాంత్ రెడ్డి, సుదర్శ, సాయికుమార్, కొండల్, శివ, అంజిలను ఎన్నుకున్నారు.

## పుస్తకాల విక్రయంపై విచారణ జరపాలి

ప్రజాపక్షం/నారాయణపేట్: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులకు అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ నాయకులు అదనపు కలెక్టర్ శ్రీనును కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై ఎమ్ఈఓ, డిఈఓ, అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పందన లభించలేదని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై అనవసరమైన పుస్తకాల భారం మోపకుండా చర్యలు తీసుకోవాలని సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకుడు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# 'జలసిరి' కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలి

ప్రతి ఇంటా ఇంకుడు గుంత
జలసిరి గ్రామంగా మారాలి
వన మహోత్సవంలో భారీగా మొక్కలు నాటాలి
మంత్రి సీతక్క



ప్రజాపక్షం/గద్వాల్ రూరల్: జలసిరి, విబి–జి రామ్ జి, వన మహోత్సవం వంటి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంలా అమలు చేసి గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి మంత్రి సీతక్క సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, ఉన్నతాధికారులతో కలిసి జలసిరి, విబి–జి రామ్ జి , వన మహోత్సవం, 15వ ఫైనాన్స్ కమిషన్, గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై అడిషనల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి జలసిరి కార్యక్రమం ప్రాధాన్యత, నీటి సంరక్షణ అవసరం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు, ప్రతీ ఊరికి ఊట కుంటలు, నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆగస్టు 15 లోపు జిల్లాలో ఒక లక్ష ఇంకుడు గుంతలను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిపై ఎలాంటి ప్రభావం పడకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. 12 కోట్ల పనిదినాల లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సుమారు 60 మంది కూలీలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతీ గ్రామంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ కమిటీగా ఏర్పడి కూలీల సంఖ్య పెంచాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటాలన్నారు. నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు , విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల పనులను వేగవంతం పూర్తి చేయాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగారావు మాట్లాడుతూ జలసిరి, విబి–జి రామ్ జి, వన మహోత్సవం కార్యక్రమాల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, ప్రతీ గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని ముషాయిదా బేగం, డీపీఓ శ్రీకాంత్, పంచాయితీ రాజ్, ఈఈ ప్రభాకర్, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లోక కల్యాణం కోసమే యజ్ఞ, యాగాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/కల్వకుర్తి: కల్వకుర్తి లోక కల్యాణం కోసమే యజ్ఞ, యాగాలు అని రాష్ట్ర సాంస్కృతిక శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో గల బిఎస్ఎన్ఎల్ మైదానంలో నిర్వహిస్తున్న 91వ విశ్వశాంతి మహాయాగంలో భాగంగా శనివారం హోమం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాగశాల ప్రదక్షిణ నిర్వహించారు. యాగశాలలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మహా శివునికి అభిషేకం, హారతి ఇచ్చారు. అనంతరం శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆశీస్సులు అందుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు విలేకరులతో మాట్లాడారు. యజ్ఞం, యాగాల లక్ష్యం లోక కల్యాణం కోసమే అన్నారు. మన సంప్రదాయంలో సర్వే జన సుఖినోభవంతు అంటూ దీవిస్తారని ఇలాంటి గొప్ప విషయం అందరూ సమానం అందరూ బాగుండాలని కోరుకోవడం మన సంప్రదాయంలో భాగమన్నారు. నేటి శాస్త్ర సాంకేతిక తో పాటు పూర్వీకులు మనకు ఇచ్చిన ధర్మం, శాంతి, సేవా భావం గొప్ప వరం యజ్ఞ యాగాలు అన్నారు. ఈ యాగ లక్ష్యం నెరవేరడానికి ప్రజలంతా ఆలోచన విధానాన్ని మార్చుకున్నప్పుడే సాధ్యమన్నారు. లోక కల్యాణం కోసం మనుషులు మారినప్పుడే మంచి ఫలితాలు సాధ్యం అవుతాయని చెప్పారు. యాగాల ఫలితం ప్రపంచ మానవాళికి అందాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజ హితం, మానవాళి శ్రేయస్సు, వర్షాలు సమృద్ధిగా కురవాలని చేస్తున్న యాగం అందరికి మేలు చేయాలన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ పిల్లలకు సాంప్రదాయాలను అలవాటు చేయాలని, ఇలాంటి దైవ కార్యక్రమంలో వారిని భాగస్వాములు చేసి మన దేశ గొప్పతనం చిన్నతనం నుండే వారికి అలవాటు చేయాలని కోరారు. ఏకాదశి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వేకువజామునుండే యాగశాలకు తరలివచ్చారు. సుదర్శన సహిత శ్రీ లక్ష్మి నారాయణ హోమాలను రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. సాయంత్రం శ్రీ భూనీలా సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, కాయితీ విజయకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్, బిజెపి నాయకులతో పాటు జూలూరు రమేష్ బాబు, యాగ కమిటీ నిర్వాహకులు భక్తులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత

ఎస్ఐ రమేష్



ప్రజాపక్షం/ఉట్కూర్: ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉట్కూర్ ఎస్ఐ రమేష్ సూచించారు. మండలంలోని పెద్దపోర్ల గ్రామంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంతో పాటు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ వాల్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఎటిఎం పిన్, సీవీవీ నెంబర్లు యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి వెల్లడించవద్దని సూచించారు. పోలీసులు ప్రజలకు మరింత చేరువ కావడానికి గ్రామాల్లో పోలీస్ వాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను త్వరగా పొందేందుకు ఈ పోలీస్ వాల్ ఎంతో ఉపయోగపడుతుందని, ఇందులో అత్యవసర సంప్రదింపు నెంబర్లు, పోలీసు సేవలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం అందుబాటులో ఉంటుందని వివరించారు. అదే విధంగా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్లో 1930 సైబర్ హెల్ప్‌లైనుకు ఫిర్యాదు చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సిజెపి పోరాటానికి దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం

యువతతో పెట్టుకుంటే ప్రభుత్వాలకు పతనం తప్పదు
బిసి కులాల ఐక్యవేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్



ప్రజాపక్షం/కొత్తకోట: విద్యార్థుల ఉద్యమం, యువత ఐక్యత ముందు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఇందుకు నిదర్శనమని బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ పేర్కొన్నారు. గతంలో రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా రైతులు చేసిన ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లే, విద్యార్థుల ఉద్యమం కూడా ప్రభుత్వాన్ని స్పందించేలా చేసిందన్నారు. ప్రజాస్వామ్యంలో యువత స్వరం ఎంతో శక్తివంతమైందని, యువతతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి ఉద్యమకారుడు అభిజీత్ దీప్కే చేసిన త్యాగాన్ని కొనియాడారు. విదేశాల్లో తన విద్య, కెరీర్‌ను పక్కనబెట్టి భారత రాజ్యాంగ పరిరక్షణ, విద్యార్థుల హక్కుల కోసం ఉద్యమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే నభి, ముంత మంజుల, రామకృష్ణ యాదవ్, కొత్తకోట పట్టణ కౌన్సిలర్లు జంగిర్, కురుమూర్తి యాదవ్, సంధ్య , జి.శ్రీను, ట్రాక్టర్ తిరుపతయ్య, రామచంద్రయ్య, నసీర్, షకీల్, విజయ్ ముదిరాజ్, నాగరాజు యాదవ్, నరేష్ గౌడ్, ఎల్ఐసీ తిరుపతయ్య, ఉమర్, రాము, జనార్దన్ గౌడ్, శేఖర్, సంతోష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఎలతో ప్రత్యేక సమావేశం



ప్రజాపక్షం/అలంపూర్: జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బిఎల్ఎలతో సమావేశాలు మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఏర్పాటు చేశారు. మానవపాడు మండలం అమరవాయి గ్రామంలో మండల అధ్యక్షుడు జగన్ మో హన్ నాయుడు, శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రామకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ హాజరయి బిఎల్ఎ లకు దిశా నిర్దేశం చేశారు. ఓటును మ్యాపింగ్ చేయడం చనిపోయిన వారి ఓట్లను తొలగించడం రెండు చోట్ల ఓటు ఉన్న వారికి కాంగ్రెస్ అనుకూలమైన చోట ఓటు ఉంచేలా ఓటర్లు ని ప్రోత్సాహించే విధానం లాంటి విషయాలపై చర్చ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జి సిద్దేశ్వర్, అలంపూర్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీకాంత్, కో ఆర్డినేటర్ షేక్షావలి ఆచారి, మానవపాడు మండల అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, డిసిసి సెక్రెటరి మహమ్మద్ సిరాజ్, వడ్డేపల్లి కాంగ్రెస్ నాయకులు దేవేంద్ర నాగరాజు, జగన్ గౌడ్, నాగ శిరోమణి తో పాటు బిఎల్ఏలు హజరయ్యారు.

## రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం అభినందనీయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు




ప్రజాపక్షం/నారాయణపేట్: నారాయణపేట్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. సెప్టెంబర్‌లో జరిగే 3వ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి అని టీములు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 20న జరిగిన జతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా మొత్తం 5300 కేసులు డిస్పోజల్ చేసి నారాయణపేట్ జిల్లా రాష్ట్రంలో 18వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసి, న్యాయమూర్తులను, పోలీస్ అధికారులని అభినందించారు. తదుపరి సెప్టెంబర్ 12వ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, ఎన్ఐ యాక్ట్, ఈపీ కేసులు, సైబర్ క్రైమ్స్, ఎన్ బి డబ్ల్యూ కేసులను డిస్పోజల్ చేయాలని, ముఖ్యంగా జైలులో ఉన్న ఖైదీల కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. తదుపరి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను యధావిధిగా కొనసాగించాలని సూచించారు. తదుపరి భరోసా, సఖి సెంటర్ సిబ్బందితో మాట్లాడుతూ ఫోక్సో కేసుల మండెటోరీ రిపోర్ట్స్, ఐడెంటిటీ ప్రొటెక్షన్, ఫాస్ట్ ట్రయల్స్ గురించి ఆరాదించారు. ఈ సమావేశంలో డి ఎల్.ఎస్.ఏ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సాయి మనోజ్, జూనియర్ సివిల్ జడ్జి సుస్మిత,అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, అవినాష్, డీఎస్పీ లింగయ్య, డిఈఈ రాములు, పోలీస్ సిబ్బంది. సిడబ్ల్యూసి మెంబెర్ రాధా,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సహకరించాలి




ప్రజాపక్షం/గట్టు: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా మహిళా, శిశుసంక్షేమ అధికారిణి సునంద సూచించారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో శనివారం బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా, శిశుసంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవా సంస్థ అధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, లైంగిక వేధింపులను అరికట్టాలని సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కి కాల్ చేసి వారి సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం న్యాయ సలహాదారులు శ్రీనివాసులు, లక్ష్మణ్ ఆయా చట్టాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగరాజు, ఎంపీడీవో చిన్నయ్య, ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత గడువులోపు నిర్మాణ పనులు పూర్తి

కలెక్టర్ ప్రియాంక



ప్రజాపక్షం/నారాయణపేట్ : నారాయణపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో రూ.200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. అగ్రిమెంట్ ప్రకారం 2027 జూన్ నాటికి ఇంట్రిగ్రేడెడ్ స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెట్ స్కూల్‌ను నిర్మింప చేయిస్తోందని, అందులో భాగంగానే నారాయణపేట్ నియోజకవర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంట్రిగేటెడ్ స్కూల్ ను ఇక్కడి లింగంపల్లి గ్రామ సమీపములో నిర్మించడం జరుగుతోందని తెలిపారు. స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆమె అధికారులను ఆదేశించారు. స్కూల్ నిర్మాణంలో 4 అకాడమిక్ బ్లాక్‌లు, ఒక సీనియర్ డార్మిటరీ, ఒక జూనియర్ డార్మిట్, ఒక వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, రెండు సింగిల్ క్వార్టర్లు, 6 డబుల్, సంప్ లు, తల్లిదండ్రుల లాంచ్ ఉంటాయని టీజీ ఈ డబ్ల్యూ ఐ డీ సీ డీ.ఈ.ఈ వెంకట్ రెడ్డి మ్యాప్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఎస్‌సిలకు 15శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు

కలెక్టర్‌కు బిజెపి ఎస్‌సి మోర్చా వినతి



ప్రజాపక్షం/వనపర్తి టౌన్: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే అన్ని ఎన్నికల్లో ఎస్‌సి అభ్యర్థులకు 15% రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బిజెపి ఎస్‌సి మోర్చా జిలా అధ్యక్షుడు గంధం ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయమై తగిన సిఫార్సు చేయాలని వారు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్‌సి మోర్చా నాయకులు మాట్లాడుతూ 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేసిందని, ప్రస్తుతం కూడా అదే పాత విధానాన్ని కొనసాగించాలని చూడటం వల్ల ఎస్‌సి సమాజానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం స్ఫూర్తికి అనుగుణంగా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో అమలవుతున్న విధానాన్ని అనుసరించి ఎస్‌సీలకు 15శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి మోర్చా రాష్ట్ర నాయకులు కొమ్ము సామేలు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బాబు రావు, సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఐదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బాలపీరు, నాలుగోవార్డు అభ్యర్థి గగనం శివ తో పాటు పలువురు ఎస్‌సి మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి

ప్రజాపక్షం/పానుగల్: వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి షర్మిలా దేవి అన్నారు. పానుగల్ మండలం కేతేపల్లిలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేశ్, గ్రామ పంచాయితీ కార్యదర్శి పరుశురాముడు, జిపిఓ ఉమాపతి, విఆర్ఏ యువరాజు, వార్డు సభ్యులు , రైతులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై కలెక్టర్ తనిఖీ

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మం దలం గౌరారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రీ ప్రైమరీ తరగతుల విద్యా ప్రమాణాలు, గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులు తీసుకుంటున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. మొదటగా గౌరారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను సందర్శించిన కలెక్టర్, చిన్నారులతో అప్యాయంగా మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు. తరగతులకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య, బోధన విధానం, అందుబాటులో ఉన్న విద్యా సామాగ్రిపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్య పిల్లల భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది అని, చిన్నారుల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా ఆటల ద్వారా బోధన, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తెలకపల్లి మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న ఓటర్ల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## బిసిల పట్ల బిజెపిది నిర్లక్ష్య వైఖరి

ధనుంజయనాయుడు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న వెనుక బాటు తరగతులైన బిసిల పట్ల బిజేపికి ఎందుకు అంత కక్షసాధింపు దోరణి అని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళి పాళ ధనుంజయనాయుడు అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో బిసి హక్కుల సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడిడి సమానత్వం సామాజిక న్యాయం సమాన అవకాశాలు కల్పించారని ఉన్నత ఆశలతో రూపొందించ బడిందని కాని వాస్తవానికి జరుగుతున్నది వేరుగా ఉన్నదని, 56శాతం ఉన్న బిసిలకు కేవలం 17శాతం మాత్రమే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించారని ఎన్నికల సందర్భంలో అటు జాతీయ స్థాయిలో ఇటు రాష్ట్ర స్థాయిలో బిసిలకు కొన్ని తాయిలాలు ప్రకటిస్తారని తీరా ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టాక వారు, వీరు కూడా బిసిలను గత 79 సంవత్సరాలుగా మోసం చేస్తూనే వస్తున్నారని, కాని ఇటీవల కాలంలో బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ దేశవ్యాప్తంగా బలంగా వినిపిస్తోందని బిసి కులాల వారు ఉత్పత్తుల కులాల వారిగా దేశ వ్యాప్తంగా విస్తరించి ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ యాదవ్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, రైతు సంఘం నాయకులు జక్కుల రమేష్, జక్కుల రమణ పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు



**ప్రజాపక్షం/తుంగతుర్తి** : ఎఐటియుసి జిల్లా మూడో మహాసభలు ఆగష్టు 1వ తేదిన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శనివారం తుంగ తుర్తి మండల కేంద్రంలో ఏఐటియుసి నియోజక వర్గ మూడవ మహాసభ పద్మశాలి భవనంలో బొంకూరు శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 106 సంవత్స రాల చరిత్ర కలిగి భారతదేశంలోని ఏకైక పెద్ద కార్మిక సంఘంగా అవతరించిన ఏఐటియుసి జిల్లా మూడో మహాసభలను సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మహాసభల్లో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన చర్చించి భవిష్యత్తు పోరాట కార్యక్రమం రూపొందించుకోవడం కోసం దోహదపడతాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాల అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన సమరశీల పోరాటాలకు సన్నద్ధం చేయడం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి గుగులోత్ రాజారాం, గౌరవ అధ్యక్షులు కోట రామస్వామి, సిపిఐ మండల కార్యదర్శి పాల్వాయి పున్నయ్య, ఏఐటియుసి నాయకులు గూడా నర్సయ్య, బొంకూరి ఆవులయ్య, మల్లెపాక లక్ష్మయ్య, నజీర్ పాల్గొన్నారు.

## న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/రామన్నపేట** : మండల పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు కార్యక్రమాన్ని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా అన్ని రంగాలలో ముందు ఉండాలన్నారు.విద్యా వ్యవస్థ వల్లనే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటుంది. విద్యార్థులకి ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అందరికీ పలు రకాల చట్టాలపై అవగాహన పొందాలని, విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాలు,ఫోక్సో చట్టం, లేబర్ చట్టాలు,మాదక ద్రవ్యాలు, అన్ని రకాలుగా ఎలాంటి సమస్య వచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఎంఏ మజీద్,యాదాస్ యాదయ్య, కునూరు శ్రీనివాస్, పాల్వంచ జగతయ్య ఏజిపి సుక్క శ్రవణ్ నూతి రమేష్,లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ,పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట** : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, 100 శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని స్పష్టం చేశారు. ఉదయం ఇన్‌టైంలో పంచ్ చేయకపోయినా, సాయంత్రం ముందే వెళ్లిపోయినా అడ్మినిస్ట్రేటివ్ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఓపి విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు క్లినికల్ అవర్స్‌లో విధిగా ఉండాలని సూచించారు. జూనియర్ డాక్టర్లపైనే భారం వేయకుండా సీనియర్లు నేరుగా రోగులను పరీక్షించాలని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్ర చికిత్సల కోసం లాపరోస్కోపిక్ సెట్స్, అడ్వాన్స్డ్ లాపరోస్కోపీ టవర్స్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్లు జనార్ధన్, అనిత, ఉపేందర్, యశ్వంత్, గీత, సంధ్య, వినయ్ పాల్గొన్నారు.

విద్యార్థుల పక్షాన నిలిచిన రాహుల్‌గాంధీపై దాడి

# అప్రజాస్వామిక చర్య

పేపర్ లీకేజీలపై కేంద్రం నైతిక బాధ్యత వహించాలి

నల్లగొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రూ.65 కోట్లతో మర్రిగూడ మోడల్ ఫ్లైఓవర్ ప్రారంభం



**ప్రజాపక్షం/నల్లగొండ:** పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీ చార్జి చేయడం అమానుషమని రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.విద్యార్థులకు అండగా నిలిచిన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపై దాడికి పాల్పడటం, వారిని అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశ యువతనే తన కుటుంబంగా భావించి విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్న రాహుల్‌గాంధీని గాయపరచడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు.నల్లగొండ పట్టణాన్ని తెలంగాణలోనే ఆదర్శవంతమైన మోడల్ కార్పొరేషన్‌గా,సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సహకారంతో నల్లగొండ అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.నల్లగొండ పట్టణంలోని మర్రిగూడ చౌరస్తా వద్ద రూ.65 కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ ఫ్లైఓవర్‌ను శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుంచి నార్కట్‌పల్లిఅద్దంకి రహదారికి వాహనాలు నేరుగా ప్రయాణించేలా ఫ్లైఓవర్‌ను నిర్మించినట్లు తెలిపారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ ఫ్లైఓవర్ ఎంతో దోహదపడుతుందని అన్నారు.రూ.750 కోట్లతో చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు పనులు ఇప్పటికే 50 శాతం పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు.రైల్వే ట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయిన వెంటనే మిగిలిన పనులను వేగవంతం చేసి వచ్చే మార్చి నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.అమృత్ పథకం కింద రూ.300 కోట్లతో వాటర్ ట్యాంకులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు.అదనంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో రూ.300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమెర్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొద్దుపల్లి లక్ష్మీ శ్రీనివాస్,మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి,వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,కార్పొరేటర్లు గుమ్మల జానకి మోహన్ రెడ్డి,పెరిక స్వాతి వినాయక్‌రాజ్,బొజ్జ శంకర్, ఆలకుంట్ల నాగరాజు పాల్గొన్నారు.

# గంజాయి స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు

8 మంది అరెస్ట్ 10 లక్షల విలువగల మత్తు పదార్థాలు స్వాధీనం..



**ప్రజాపక్షం/నల్లగొండ** : ఒడిశా నుంచి గంజాయి, హాష్ ఆయిల్ స్మగ్లింగ్ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రూ.10 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి వెల్లడించారు. శనివారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు చేపట్టిన దాడుల్లో ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారని మరో నలుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. ఇందులో ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకుని జువెనైల్ న్యాయ ప్రక్రియ ప్రకారం చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వారి వద్ద నుండి రూ.10 లక్షల విలువైన 5.6 కిలోల గంజాయి, 100 ఎంఎల్ వీడ్ (హాష్) ఆయిల్,5 బైక్‌లు,4 సెల్‌ఫోన్లు,ఒక డమ్మీ తుపాకీ, ఒక బటన్ చాకును స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గంజాయి కొనుగోలు కోసం ఖమ్మం, నకిరేకల్, నల్లగొండ ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించినట్లు విచారణలో తేలిందని బైక్ దొంగతనాల ద్వారా వచ్చిన డబ్బుతో ఒడిశా నుంచి గంజాయి, హాష్ ఆయిల్ కొనుగోలు చేసి నల్లగొండ కు తీసుకొచ్చి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి కళాశాల విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్లు వెల్లడైందని వివరించారు. అరెస్ట్ అయిన వారిలో కస్పరాజు నాగరాజు,గంటెకంపు మధు కిరణ్, చెన్నపాక సుశాంక్ డెడ్లీ, పెంద్ర వాసు చింటు,సయ్యద్ షోయబ్ షోబి,గంధం శివమణి,చెరుకు దీపక్ పల్లి,నకిరేకంటి ధరణి కుమార్ బబ్లు, ఉన్నారని మనుకర్, ఉదయ్ జున్ను లు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించిన వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సురభి సంపత్, ముత్తయ్య, సిబ్బంది శ్రీనివాస్, శేఖర్, రబ్బాని, సాగర్ల శంకర్, ఆంజనేయులు, అంజద్, కిరణ్, అంజయ్య, మహేష్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

# గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

3.045 కిలోల గంజాయి స్వాధీనం : నలుగురు అరెస్టు బైక్,మొబైల్ స్వాధీనం



**ప్రజాపక్షం/నకిరేకల్** : మాదకద్రవ్యాల అక్రమ రవాణా,వినియోగంపై నల్లగొండ జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.ఈక్రమంలో నకిరేకల్ పోలీసులు చేపట్టిన మెరుపు దాడిలో 3.045 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా,అతడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.1,52,250 విలువైన గంజాయితో పాటు ఒక మోటార్‌సైకిల్, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ వివరాలను శనివారం నకిరేకల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ హరిబాబు వెల్లడించారు.ఆయనతెలిపిన వివరాల ప్రకారం జూలై 24న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ పి.వీరబాబు సిబ్బందితో కలిసి ఎస్‌హెచ్65 తాటికల్ ఫ్లైఓవర్ సమీపంలోని సర్వీస్ రోడ్డులో దాడి నిర్వహించారు. ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 42(2) ప్రకారం చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ తనిఖీలు చేపట్టగా,చెట్ల పొదల్లో గంజాయి సంచిని మధ్యలో ఉంచుకుని గంజాయి సేవించేందుకు సిద్ధమవుతున్న నలుగురు యువకులను పోలీసులు చుట్టుముట్టారు.ప్రాథమిక విచారణలో నిందితులు ఒడిశా సరిహద్దు సమీపంలోని భద్రాచలం అటవీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి నకిరేకల్ ప్రాంతానికి తీసుకొచ్చినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన నిందితులు బట్ట శివ (23),శాలిగౌరారం మండలం, కన్నెబోయిన కల్యాణ్ (25),నకిరేకల్ ,యన్నమల్ల సాయిరాం అలియాస్ సాయి (25),నకిరేకల్ ,లక్కపాక సంతోష్ (25),నకిరేకల్ పట్టణంకు చెందినవారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు గండికోట వంశీ పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నకిరేకల్ ఎస్ఐలు వీరబాబు,కృష్ణమాచారి సిబ్బంది పాల్గొన్నారు.

# చైన్ స్నాచింగ్ మిస్టరీ ఛేదన

కిలాడీ దొంగ అరెస్ట్, 9 తులాల బంగారం స్వాధీనం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో చోటుచేసుకున్న సంచలనాత్మక చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ దృశ్యాల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 9 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నల్లగొండ అదనపు ఎస్పీ జే.రమేష్ తెలిపారు. ఈ కేసు వివరాలను శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల 12న పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎస్వీఆర్‌పీవీఆర్ గార్డెన్స్ వెనుక భాగంలో ఒక రిటైర్డ్ మహిళ వద్దకు వచ్చిన నిందితుడు అడ్రస్ అడుగుతున్నట్లు నటిస్తూ, కరివేపాకు కావాలని మాటల్లో పెట్టాడు. ఆమె కరివేపాకు కోస్తుండగా హఠాత్తుగా ఇంట్లోకి ప్రవేశించి మెడలోని 9 తులాల బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కుని యాక్టివా స్కూటీపై పరారయ్యాడు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ, డీఎస్పీ పర్యవేక్షణలో మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగభూషణం నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టాయి. దర్యాప్తులో భాగంగా నిందితుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన షేక్ నాగుల్ మీరా అలియాస్ బిల్లా (27)గా పోలీసులు గుర్తించారు. హనుమాన్‌పేట్ ఫ్లైఓవర్ సమీపంలో మరొక స్నాచింగ్‌కు రెక్కి నిర్వహిస్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన మిర్యాలగూడ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పీఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బందిని అడిషనల్ ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రవి, సీఐ నాగభూషణం, ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వట్టె అరెస్టుకు రంగం సిద్ధం?

ముమ్మరంగా పోలీసుల గాలింపు

పోలీసుల అదుపులో కుమారుడు గణేష్!



**ప్రజాపక్షం/సూర్యాపేట** ఫ సూర్యాపేట మండలంలోని బాలెంల గ్రామ సమీపంలో ఉన్న వజ్రా రైస్ కార్పొరేషన్, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లుల యజమాని, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీధర్ రెడ్డి వట్టె జానయ్య యాదవ్‌తోపాటు వ్యాపార భాగస్వాములుగా ఉన్న అతడి సతీమణి రేణుక, కుమారుడు గణేష్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ సూర్యాపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న వారు అందుబాటులో లేకపోవడంతో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అతని కుమారుడు గణేష్‌ను అదుపులోకి తీసుకోగా జానయ్య, అతని సతీమణి రేణుక మాత్రం తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లుడ్ రైస్ (సిఎంఆర్) కోసం ఈ మిల్లులకు పౌరసరఫరాల శాఖ అధికారులు అప్పగించగా అవి పక్కదారి పట్టించినట్లుగా ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేసిన విషయం అందరికి తెలిసిందే. ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో వజ్రా రైస్ కార్పోరేషన్‌లో 11,073.054 మెట్రిక్ టన్నులు, వజ్రా వికాస్ మార్ట్ రైస్ మిల్లులో 18,114.834 మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించారు. ఈ కొరత విలువ రూ.69 కోట్లుగా అంచనా వేశారు. ఇదిలా ఉంటే ఖమ్మం జిల్లా ముదిగొండలోని సత్యసాయి రైస్ కార్పోరేషన్‌కు ఈ మిల్లుల్లో మిల్లింగ్ చేసిన ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకొని సీజ్ చేశారు. క్రిమినల్ కేసు నమోదైన తరువాత వట్టె జానయ్య యాదవ్‌తోపాటు, ఆయన సతీమణి రేణుక, కుమారుడు గణేష్ అందుబాటులో లేకపోవడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గత రెండు రోజులుగా చేపట్టిన గాలింపుల్లో కుమారుడు గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. జానయ్య యాదవ్, అతని సతీమణి రేణుక ఆచూకి కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు.

## కబ్జాకు గురైన చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ ఎఇ

చెరువు భూములు కబ్జా చేసింది వాస్తవమేనని గుర్తింపు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/సూర్యాపేట** : చివ్వెంల మండలంలోని గుంజలూరు గ్రామంలో పెద్దచెరువు, దొడ్డికుంట చెరువు భూములు కబ్జాకు గురయ్యాయంటూ శుక్రవారం 'ప్రజాపక్షం' దినపత్రికలో ''గుంజలూరులో చెరువు భూములు గుటకాయ 'స్వాహా'! '' రూ.12కోట్ల విలువైన 30 ఎకరాలకు పైగా భూమి కబ్జా... నిద్రావస్థలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అంటూ ప్రచురితమైన వార్తా కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. చెరువు భూములు కబ్జా చేసింది వాస్తవమేనని గుర్తించారు. శనివారం ఇరిగేషన్ ఏఇ సరితారాణి గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులుతో కలిసి చెరువులను పరిశీలించారు. చెరువులకు ఉన్న హద్దురాళ్ళను తొలగించి కబ్జా చేయడాన్ని చూసి ఆమె అవాక్కయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము చెరువు చుట్టూ గతంలో దాదాపు రూ.15లక్షలు ఖర్చు చేసి హద్దురాళ్ళను ఏర్పాటు చేయడం జరిగిందని అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ఆక్రణదారులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు చెరువు భూములను ఆక్రమించిన వారి పేర్లను అధికారి దృష్టికి తీసుకెళ్ళి లిఖితపూర్వకంగా వారి పేర్లను అందజేశారు. దీనిపై సమగ్ర సర్వే చేస్తే ఎంత భూమి కబ్జాకు గురి అయ్యిందన్న విషయంతోపాటు మరికొంత మంది కబ్జాదారుల పేర్లు బయటికి వచ్చే అవకాశం ఉంది.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయం

వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ** : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల పోరాట విజయానికి నిదర్శనమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ అన్నారు.శనివారం నల్లగొండ పట్టణంలో ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,పీడీఎస్‌యూ వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేసిన తప్పులను అంగీకరించకుండా,ప్రశ్నాపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా ఉద్యమించిన విద్యార్థులను దేశద్రోహులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిందని విమర్శించారు.అయితే విద్యార్థులు, వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరంతర పోరాటాలతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని అన్నారు.కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమానికి లభించిన విజయమని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 కోట్ల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ,పీడీఎస్‌యూ నాయకులు ఖమ్మంపాటి శంకర్,ఇందూరు సాగర్ విద్యార్థి సంఘాల నాయకులు పవన్,గాదెపాక సూర్యతేజ,శ్రీకాంత్,మహేష్ పాల్గొన్నారు.

## విద్యార్థుల పోరాట ఫలితమే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా

విద్యా వ్యవస్థలో సంస్కరణలు తప్పనిసరి: న్యాయవాదుల సంఘం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపట్టిన పోరాట ఫలితంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల నైతిక విజయమని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఎ)రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లేపల్లి ఆదిరెడ్డి అన్నారు.శనివారం నల్లగొండ బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.దేశ యువత ప్రాణాలు పణంగా పెట్టి చేసిన పోరాటానికి కేంద్ర మంత్రి దిగివచ్చి రాజీనామా చేయడంతో ప్రభుత్వ తప్పిదం బహిర్గతమైందన్నారు. దేశవ్యాప్తంగా యువత సాగించిన ఉద్యమాలు,ప్రజా ఆందోళనల నేపథ్యంలో ఏర్పడిన పరిణామాలు కేంద్ర ప్రభుత్వానికి ఒక గట్టి హెచ్చరిక అని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కట్టా అనంతరెడ్డి,న్యాయవాదులు నజీరుద్దీన్,గిరి లింగయ్య గౌడ్,పెరుమాళ్ళ శేఖర్,అన్నపూసల

## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** విద్యార్థి దశ నుంచే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వనస్థలిపురంలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటి ఒలింపియాడ్ స్కూల్‌లో విద్యార్థి సంఘం సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు పాఠశాల క్రమంలోనే క్రమశిక్షణతో కలిగిన నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని, ప్రజాస్వామ్యం పట్ల, భారతదేశంలోని ఎన్నికల విధానంపై అవగాహన కలిపించుకోవాలని ఆయన సూచించారు. చిన్నారుల్లో మానసిక వికాసంతో పాటు శారీరక వికాసం కోసం ఆట స్థలాలను మా పాఠశాలలో ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షకులతో వివిధ క్రీడలు నేర్పిస్తునట్లు ఆయన గుర్తు చేశారు. విజేతలకు బ్యాడ్జీలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల సీ.ఏ.ఓ శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్స్ లక్ష్మి, విద్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్రతి ఓటర్ తమ ఓటును సర్ ప్రక్రియలో నమోదు చేసుకోవాలని శంకర్ పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 1,9,10వ వార్డులలో సింగాపురం బూత్ నెంబర్ 54,55, 56 లలో జరుగుతున్న సర్ ప్రక్రియను శనివారం ఉదయం శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాతా ప్రవీణ్ కుమార్ వార్డు సభ్యులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రక్రియలో ఓటు నమోదు కార్యక్రమం సక్రమంగా జరిగేలా బూత్ మెంబర్లు చూసుకోవాలని తెలిపారు.ప్రతి ఓటర్ తమ ఓటు సర్ ప్రక్రియలో నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ చేకూర్త గోపాల్ రెడ్డి,వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నష్ట పరిహారం పెంపు కోసం రైతులు ధర్నా



**ప్రజాపక్షం/యాచారం :** భూములు కోల్పోతున్నా రైతులకు నష్టపరిహారం పెంపుపై స్పష్టమైన నిర్ణయం చేయాలని డిమాండ్ చేస్తు శనివారం యాచారం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు మొండిగౌరెల్లీ రైతులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొలన్ రమాదేవి పాల్గోన్ని మాట్లాడుతూ మండల పరిధిలో మొండిగౌరెల్లీ గ్రామంలో సర్వే నెంబర్లు 19,68,137లో సుమారు 677 ఎకరాల భూములను ప్రభుత్వం తీసుకుంటున్నామని నోటిఫేకేషన్ జారీ చేసిందని అన్నారు. ప్రభుత్వం సేకరించే అసైన్డ్ భూములపై విచారణ చేసి మార్కెట్ విలువ చెల్లించాలని డిమాండ్ చేశారు.నకీలి కబ్జాదారులపై చర్యలు తీసుకోని భూ పరిహారం పెంపుపై ప్రభుత్వం స్పదించకుంటే రైతుల పక్షాన ఆందోళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో అంజయ్యయాదవ్,తాండ్ర రవి,బండ మీది కృష్ణ,రైతులు పాల్గోన్నారు.

## ఫిర్యాదుదారుల పట్ల మర్యాద



**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ప్రవర్తించాలని చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్ పోలీసు అధికారులకు సూచించారు. శంకర్ పల్లి మండలం మోకిల పోలీసు స్టేషనును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసర ప్రాంతాలను సందర్శించి విధులు నిర్వహిస్తున్న పోలీసుల పనితీరును సమీక్షించారు.పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి ఆన్లైన్ ప్రక్రియలో నమోదు చేస్తున్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల వివరాలను,శాంతి భద్రతల పరిస్థితులు వివిధ గ్రామాల పరిస్థితుల పై ఆరా తీశారు.ఈ సందర్భంగా డిసిపి యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని,పెండింగులో ఉన్న కేసుల్లో జాప్యం ఉండకూడదని,ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచనలు చేశారు. పోలీస్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి,సురేష్ గౌడ్,సాయికృష్ణ, పద్మ,పోలీస్ సిబ్బంది,తదితరులు,పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే అన్నదానం



**ప్రజాపక్షం/మియాపూర్:** ఆకలితో అలమటిస్తున్న బడుగు బలహీన వర్గాలకు పాదచారులకు,చందానగర్ గంగారం లోని వివిధ షోరూం పని చేస్తున్న ప్రజలకు ప్రతి శనివారం సుమారు 3000 మందికి అన్నదానం నిర్వహించడం హర్షణీయమని స్థానిక ప్రజలు అన్నారు. హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండ విజయ్ కుమార్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ నియమ నిబంధనలు పాటిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను స్థానిక ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్నె అపర్ణ, అన్నె సందీప్, విష్ణు మూర్తి, రవి, పీటర్, మారం ప్రసాద్, శంకర్, షర్ఫుద్దీన్, విజయ్, ప్రకాష్, దత్తు, సురేష్, హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

**ప్రజాపక్షం/కొత్తూరు:** ద్విచక్ర వాహనాన్ని ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువతి దుర్మరణం చెందిన సంఘటన మండల సరిధిలోని తిమ్మాపూర్ 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. కొత్తూరు సిఐ నర్సయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజేంద్రనగర్ శాస్త్రీపురానికి చెందిన ప్రైవేట్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న సానియాభేగం (20)కు ఫలక్‌నుమాకు చెందిన మెకానిక్ మహ్మద్ మునీర్ (24)తో రెండు నెలల క్రితం నిశ్చితార్థం జరిగిందని తెలిపారు. శనివారం ఉదయం వీరు ఇద్దరు ద్విచక్ర వాహనంపై కొత్తూరు మండల పరిధిలోని జెపి దర్గా దర్శనానికి వచ్చారు. బాబా దర్శనం ముగించుకొని తిరిగి వెళ్తుండగా మధ్నాహ్నం 12గంటల సమయంలో తిమ్మాపూర్ సమీపంలో 44వ జాతీయ రహదారి హిల్ కంపెనీ వద్దకు రాగానే ముందుకు వెళ్తున్న బైక్‌ను అతివేగంగా వచ్చిన ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో సానియాభేగంకు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా మునీర్ తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నర్సయ్య తెలిపారు.

# మోదీ ప్రభుత్వ అసమర్థతోనే పేపర్ లీక్‌లు

టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

యువతపై పోలీసులతో అణిచివేత, రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తనకు నిరసనగా వనస్థలిపురం నుంచి ఎల్‌బి నగర్ వరకు భారీ బైక్ ర్యాలీ



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో 152 సార్లు పేపర్ లీక్ సంఘటనలు జరిగినా.. ఒక్కరికి శిక్ష పడకపోకవడం సిగ్గుచేటని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థు లు, యువత ఆందోళనలకు మద్దతుగా నిరసన చేపట్టిన రాహుల్ గాంధీ పట్ల దురుసు ప్రవర్తన, అరెస్ట్‌ను నిరసిస్తూ, మధుయాష్కీ నేతృత్వంలో ఎల్‌బి నగర్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. వనస్థలిపులోని సుష్మ చౌరస్తా నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ అసమర్థతోనే పేపర్ లీక్‌లు జరుగుతున్నాయని విమర్శించారు. గతంలో పేపర్ లీక్ సంఘటనల్లో నిందితుల్లో ఉన్న వారికి క్లీన్ చిట్ ఇచ్చి వదిలేసారని తెలిపారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్న యువతపై మోడీ ప్రభుత్వం పోలీసులతో క్రూరంగా కొట్టించడమే కాకుండి.. విద్యార్థులపై అసభ్యకరంగా, అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. నీట్ పేపర్ లీక్‌తో 22 లక్షల మంది విద్యార్థుల వారి కుటుంబాలు ఆవేదనకు లోనయ్యారన్నారు. మనోవేదనతో పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆ కుటుంబాలకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థులకు అండగా నిలబడి కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, రాహుల్ గాంధీ విద్యార్థుల కోసం పార్లమెంటులోనూ, బయట ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. పార్లమెంటులో రాజ్యసభలో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని పట్టుబడుతున్నా.. మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన ఆగదన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే కాకుం డా.. చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల ని, విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకోవాల్సిందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, యాదవ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, జిహెచ్‌ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ ధర్పిల్లి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ జనరల్ సెక్రటరీ పృధ్వి చౌదరి, డివిజన్ అధ్యక్షులు శ్రీనాథ్, రమాకాంత్, కవిత, పి. గణేష్‌రెడ్డి, కేతావత్ రమేష్ నాయక్, చిరంజీవి గౌడ్, రజిని రావు, రవీందర్ గౌడ్, సునీల్ బాబు, రవికేశవ, మార్కెట్ డైరెక్టర్‌లు అశోక్ గౌడ్, రామారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండోజు శ్రీనివాస్, జిల్లా జనరల్ సెక్రటరీ స్వర్ణ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా శాఖ మంత్రి రాజీనామా యువత సాధించిన గొప్ప విజయం

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా యువత సాధించిన గొప్ప విజయం అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు.శనివారం రాత్రి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన టి పిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి,రంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి భీంభారత్‌తో కలిసి బాలాపూర్ మం డలం బడంగ్ పేట్ వినాయక మండపం నుండి అంబేద్కర్ విగ్రహం వర కు వందలాది మందితో భారీ ఎత్తున విజయోత్సవం ర్యాలీని నిర్వహించడం జరిగింది.మాజీ జడ్‌పిటిసి తీగల అనిత రెడ్డి,బడంగ్పేట్ డివిజన్ ప్రెసిడెంట్ బంగారి అశోక్, మీర్పేట్ ప్రెసిడెంట్ చల్లా బాల్ రెడ్డి,జిల్లెలగూడ సిద్దల శ్రీశైలం, ప్రశాంతి హిల్స్ ప్రెసిడెంట్ ఈ.సురేందర్ రెడ్డి,నాదర్గుల్ ప్రెసిడెంట్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, బాలాపూర్ ప్రెసిడెంట్ ఎన్ శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ యువతకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రత్యక్షంగా పాల్గొనడంతో పాటు యావత్ దేశ యువత,విద్యార్థి లోకం పోరాటం బిజెపి మెడలు ఉంచిందన్నారు. తప్పని పరిస్థితుల్లో నరేంద్ర ప్రధాని మోదీ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించారన్నారు.

## మిషన్ మోడ్‌లో 'మై భారత్' నమోదు

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో మై భారత్ నమోదు కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అడ్వైజరీ కమిటీ(డిఏసి),జిల్లా సమన్వయ కమిటీ (డిఎస్‌సి)సమావేశాల్లో జిల్లాకు నిర్దేశించిన 80,251 మంది యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు లక్ష్య సాధనపై సమగ్రంగా సమీక్షించి, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి సంస్థ మై భారత్ (మేరా యువ భారత్) చేపట్టిన ఇంటెన్సివ్ మై భారత్ రిజిస్ట్రేషన్ అవగాహన కార్యక్రమాన్ని జిల్లాలో మిషన్ మోడ్‌లో అమలు చేసి లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, పట్టణ స్థానిక సంస్థలు,గ్రామ పంచాయతీలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, యువజన సంఘాలు,స్వయం సహాయక సంఘాలు తదితర సంస్థల సహకారంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా లక్ష్యాన్ని సాధించడంలో అన్ని శాఖల సమిష్టి కృషి కీలకమని తెలిపారు. అనంతరం మై భారత్ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డైరెక్టర్,జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్య కార్యదర్శి బి.స్నేహాల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మాట్లాడుతూ,యువతలో స్వచ్ఛంద సేవా భావం, నాయకత్వ నైపుణ్యాలు,సామాజిక బాధ్య త, పౌర చైతన్యాన్ని పెంపొందించేందుకు మై భారత్ వేదికగా పని చేస్తోందని తెలిపారు. జిల్లాకు కేటాయించిన 80,251 మంది యువత నమోదు లక్ష్యాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో జడ్‌పిసిఇఒ కృష్ణారెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి వి. సురేష్ మోహన్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంక్య నాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకురాలు ఎస్.రాధాలలిత, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం మెడలు వంచిన విద్యార్థులు

సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** నీట్ పేపర్ లికేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ విద్యార్థులు చేసిన పోరాటంతో కేంద్రం మెడలు వంచారని ఇది విద్యార్థుల విజయం అని సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి కామ్రేడ్ అజ్మీరా హరిసింగ్ నాయక్ అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది ఆ పరీక్ష రాసిన విద్యార్థులు చనిపోవడం జరిగిందని అనేక మంది విద్యార్థులు నష్టపోయారని లికేజీకి కేంద్ర మంత్రి రాజీనామా చేయాలనీ సోనాం వాంగ్ చుంగ్ ఆమరణ నిరాహార దీక్ష, విద్యార్థుల పార్లమెంట్ ర్యాలీ మొత్తం దేశాన్ని కదిలించి. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చెపట్టడంతో ఎట్టకేలకు శనివారం నాడు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మంత్రి రాజీనామాతో దేశంలో నవశకం మొదలైందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి నూతన విద్య విధానం 2020ని రద్దు చేసి, విద్యారంగంలో అనేక సవరణలు చేసి మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఎస్‌సి మోర్చా జిల్లా రూరల్ అధ్యక్షుడిగా

## విత్యాల నర్సింహులు

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రంగారెడ్డి జిల్లా ఎస్‌సి మోర్చ రూరల్ అధ్యక్షుడిగా విత్యాల నర్సింహులును ఎన్నుకున్నారు. శనివారం ఎస్‌సిమోర్చ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విత్యాల నర్సింహులు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎస్‌సి మోర్చను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వివరించారు. ప్రభుత్వ పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎస్‌సిమోర్చ కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ నిబంధనలకు కట్టుబడి పని చేస్తానని పేర్కొన్నారు. ఎస్‌సి మోర్చ రాష్ట్ర నాయకుడు మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన విత్యాల నర్సింహులుకు ఎస్‌సిమోర్చ జిల్లా రూరల్ అధ్యక్ష పదవి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



## 'అభ్యాస్ విద్యాపీఠం' ప్రైవేట్ స్కూల్ గుర్తింపును రద్దు చేయండి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఫిట్నెస్ లేని బస్సులు నడిపించి విద్యార్థిని చావుకు కారణమైన అభ్యాస్ విద్యాపీఠం ప్రైవేట్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు, జిల్లేడు చౌదరిగూడ మండల ఇన్‌చార్జి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ అభ్యాస్ విధ్యాపీఠం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే పాఠశాలలో చదువుకుంటున్న ఎల్‌కెజీ విద్యార్థి నీపై నుంచి బస్సు వెళ్ళడంతోనే అక్కడికక్కడే మృతి చెందిందని వివరించారు. ఆర్‌టిఒ అధికారులు ఫిట్నేస్ లేని స్కూల్ బస్సులకు అనుమతి ఇవ్వడంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలు సక్రమంగా లేకపోవడమే కాకుండా శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆరోపించారు. దాంతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ స్కూల్ బస్సుల వైపు మొగ్గు చూపించడంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సౌకర్యాలు ఉండి విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదని పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యా వ్యవస్థపైన ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. అభ్యాస్ విద్యాపీఠం స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు పిట్నెస్ లేని స్కూల్ బస్సులను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పసిపాప ప్రాణం బలైందని, మరో ప్రాణం బలికాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ - పోచంపల్లి రోడ్‌ను పునరుద్ధరించండి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ పాత పోచంపల్లి రోడ్డును తిరిగి స్వాధీనం చేసుకుని,పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డిని కోరారు. ఎల్‌బినగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రధాన సమస్యల మీద మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసినారు .ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు ప్రజా సమస్యలపై చర్చించి, త్వరితగతిన చర్యలు చేపట్టలని కోరారు. మన్సూరాబాద్ డివిజన్ పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణ, మహావీర్ హరిణీ వనస్థలి ద్వారా ఆక్రమణకు గురైనట్లుగా భావిస్తున్న మన్సూరాబాద్ పాత పోచంపల్లి రోడ్డును తిరిగి స్వాధీనం చేసుకుని,పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ రోడ్డు దాదాపు 50 కాలనీలకు కీలక అనుసంధాన మార్గంగా ఉంది100 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పాత జిల్లా పరిషత్ గెజిట్‌లో కూడా నమోద్దై ఉంది కమిషనర్‌కు వివరించారు.పెండింగ్‌లో ఉన్న పలు పనులను త్వరితగతిన పరిష్కరించి పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయవలసిందిగా కోరారు .సమావేశ అనంతరం కమీషనర్ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో అధికారులచే సమావేశం ఏర్పాటు చేయించి త్వరితిగతిన పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ బారాస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద రెడ్డి,భాస్కర్ సాగర్,రవి ముదిరాజ్‌తదితరులు పాల్గొన్నారు.

## పేదలందరికీ సంక్షేమ పథకాలు: వీర్లపల్లి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన పేదలందరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 75మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాగ్ర అభివృద్ధియే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే నగదు జమచేయడం జరుగుతుందని వివరించారు. ఫరూఖ్‌నగర్ మండలంలో 29మందికి, షాద్‌నగర్ మున్సిపాలిటిలో 46మంది లబ్ధిదారులకు చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, తహాశీల్దార్ నాగయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ కోసం పోలీసుల గాలింపు

**ప్రజాపక్షం/కేశంపేట:** చైన్ స్నాచర్ ల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామానికి చెందిన బాలమ్మ అనే మహిళ వ్యవసాయ పోలానికి వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తు ద్విచక్ర వాహనంపై మాస్కులు వేసుకొని మ హిళల మెడ లో నుండి చైన్ లాక్కెళ్లినట్లు షాద్‌నగర్ ఏసిపి లక్ష్మి నారాయణ తెలిపారు. మ హిళ మెడలో నుండి చైన్ తీసుకొని వెళ్తున్న దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు కా వడంతో వీటి ఆధారంగానే కేశంపేట పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

# పట్నం మహేందర్‌రెడ్డి మాతృమూర్తి రుక్కమ్మకు అశ్రునివాళి

పరామర్శించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు





**ప్రజాపక్షం/రంగారెడ్డి / షాబాద్ :** శాసనమండలి చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిల మాతృమూర్తి పట్నం రుక్కమ్మ అంత్యక్రియలు భారీ జన సందోహం మధ్య శనివారం జరిగాయి. రుక్కమ్మను ఉదయం 10:30 వరకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని పట్నం మహేందర్ రెడ్డి గృహంలో బంధువుల సందర్శన కోసం ఉంచి అనంతరం తమ స్వగ్రామమైన రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోని మాజీ జడ్‌పిటిసి పట్నం అవినాష్ రెడ్డి గృహంలో కాసేపు షాబాద్ ప్రాంత ప్రజలకు సందర్శించే అవకాశం కల్పించి ఆ తరువాత స్వగ్రామం గొల్లూరి గూడలో అంత్యక్రియలు జరిగాయి. మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, యాలాల శ్రీరామ్ రెడ్డి, డిసిసిబి అధ్యక్షుడు పట్లోళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాడే మోశారు. మాతృ వియోగానికి గురైన పట్నం సోదరులను పలువురు పరామర్శించారు. మాజీ మంత్రి, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కోడంగల్ మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్ రెడ్డిల మాతృ మూర్తి పట్నం రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని మహేందర్ రెడ్డి నివాసంలో రుక్కమ్మ పార్థివ దేహానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిల్ల శ్రీధర బాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పార్టీలకు అతీతంగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీత రెడ్డిని, మహేందర్ రెడ్డి సోదరి పుల్ల నర్మదారెడ్డిని పరామర్శించారు. అలాగే మాజీ జెడ్పిటిసి అవినాష్ రెడ్డిని సైతం పలకరించారు. మహేందర్ రెడ్డి కుమారుడు రినీష్ రెడ్డి, నరేందర్ రెడ్డి కుమారుడు హితీష్ రెడ్డిలను సైతం ఆయన ఆప్యాయంగా పలకరించారు. అలాగే ఎంఎల్ఏలు మనోహర్ రెడ్డి,రామ్మోహన్ రెడ్డి,ప్రకాష్ గౌడ్,ఈర్లపల్లి శంకర్,చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపి గడ్డం రంజిత్ రెడ్డి,ఎంఎల్సీలు ఏవీఎన్ రెడ్డి,దామోదర్ రెడ్డి,మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్,మాజీ ఎంఎల్ఏలు కేఎస్ రత్నం, కేఎల్ ఆర్,జైపాల్ యాదవ్, రంగారెడ్డి,వికారాబాద్,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహా రెడ్డి, ధారాసింగ్, వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి,షాబాద్ లోని మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి గృహం నుండి అంత్యక్రియలు ప్రారంభమై స్వగ్రామం గొల్లూరు గూడ వరకు సాగాయి. మాజీ మంత్రులు సబీతా ఇంద్రా రెడ్డి, లక్ష్మారెడ్డి,శ్రీనివాస్ గౌడ్, ఏ. చంద్రశేఖర్, ఆయన కూతురు చంద్ర ప్రియాలతో పాటు, ఎపి మాజీ మంత్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్ రెడ్డి, మెతుకు ఆనంద్, సుధీర్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మలిపెద్ది సుధీర్ రెడ్డి, కొప్పుల మహేశ్వర్ రెడ్డి,మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వెంకటేశ్వర్ రెడ్డి ,నాగేందర్ గౌడ్,బైండ్ల విజయకుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి లు షరీఫ్,మైపాల్, కొండల్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి,చల్ల శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు. మాజీ జెడ్పీటీసీ లు సత్యనారాయణ రెడ్డి, కాలే శ్రీకాంత్,మహిపాల్, రవి గౌడ్ తదితరులు పట్నం సోదరులను పరామర్శించారు.

### శోక సంద్రంలో గొల్లూరుగూడ

అందరూ పెద్దమ్మగా పిలిచే రుక్కమ్మ మరణ వార్త తెలియడంతో చుట్టు పక్కల గ్రామాల్లో శోకసంద్రమైంది. గొల్లూరులతో పాటు చుట్టుపక్కల గ్రామాలు కొమర బండ, ముద్యం గూడ, బొబ్బిలి గామ తదితర గ్రామాల ప్రజలు ముఖము మరణ వార్త విని చెల్లించిపోయారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా లోని మేడ్చల్, వికారాబాద్ ,రంగారెడ్డి జిల్లాలతో పాటు పొరుగు మహబూబ్నగర్ జిల్లాకు చెందిన నేతలు కార్యకర్తలు,పార్టీలకతీతంగా పాల్గొన్నారు.





# ‘ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా’తో సంబరాలతో హోరెత్తిన జంతర్ మంతర్

**న్యూఢిల్లీ :** ‘నీట్’ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారన్న వార్త అందడంతో శనివారం దేశరాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ అంబరాన్ని అంటే సంబరాలతో హోరెత్తింది. నిరసనల వేదిక ప్రాంగణంలో వేలాదిమంది నిరసనకారులు పట్టలేని సంతోష, సంబరాల్లో మునిగిపోయారు. దేశభక్తిగీతాలు, డప్పుల మోతలు, వందేమాతరం నినాదాలు ఆకాశాన్ని అంటాయి. వారాలుగా కొనసాగుతోన్న తమ ఆందోళనలో ఇదే ‘తొలి ప్రధాన విజయం’అని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త విన్న వెంటనే అభిజీత్ దీప్కే ‘సాధించాం’ ,‘సాధించాం’అంటూ బిగ్గరగా నినదించారు.కేంద్రమంత్రులతో సమావేశంజరిగిన వెంటనే, తమ సంస్థ చేసిన అన్ని డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించడంతో ఆందోళన విరమించుకుంటున్నట్లు సిజెపి ప్రతినిధులు చెప్పినప్పటికీ సంబరాలు కొనసాగాయి. కొద్ది రోజుల క్రితమే ఘర్షణలు, టియర్‌గ్యాస్ ప్రయోగాలు, నెత్తురోడుతున్న తీవ్ర గాయాలు, లాఠీ దెబ్బలకు సాక్ష్యంగా నిలిచిన నిరసన ప్రదేశం ప్రజాస్వామ్యాన్ని, విద్యార్థి ఐక్యతను కీర్తిస్తూ నినాదాలు హోరెత్తించడం, నిరసనకారులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని, త్రివర్ణపతాకాన్ని ఊపుతూ


## ‘ఛక్ దే ఇండియా’ పాటకు నిరసనకారులు నృత్యాలు



‘ఛక్ దే ఇండియా’గీతానికి వలయాకారంగానృత్యాలు చేస్తూ, డప్పీలు వాయింపు దృశ్యాల వేదికగా జంతర్‌మంతర్ ప్రాంగణం రూపాంతరం చెందింది.నిరసనకారులు అనేకమంది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని పైకెత్తి పట్టుకోగా, మరికొందరు నిరసనకారులు తమ మొబైల్ ఫోన్ స్క్రీన్లపై ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా లేఖను జంతర్‌మంతర్ వద్ద గుమిగూడిన హర్షధ్వానాల జనసమూహం వైపునకు చూపించారు. ఒక ప్రసిద్ధ సోషల్ మీడియా సృష్టించిన మీమ్స్‌ను పున: సృష్టించి వీడియోలు రికార్డ్ చేశారు. వేదికమీద ఉన్న సభ్యులు, వాలంటీర్లు మొదలుకుని కిక్కిరిసిన జనసమూహంలో చివరి అంచున నిలబడిన వారి వరకూ నిరసనకారులు స్వచ్ఛందంగా జాతీయగీతాన్ని ఆలపించారు. అనంతరం మళ్లీ బిగ్గరగా నినాదాలు చేశారు. ‘ఈ రాజీనామా చాలా ముందే జరగాల్సి ఉండేది’ అని నిరసన స్థలం నుంచి ఇంటికి వెళుతున్న నిరసనకారుడు నితిన్ అన్నారు.సోనమ్ వాంగ్‌చుక్ 11కిలోల బరువు తగ్గి ఉండాల్సింది కాదు.ప్రజలు కూడా ఇంత రక్తం కోల్పోవాల్సిన అవసరం లేదు. ఘర్షణలు, క్రూరత్వం, హింసను నివారించి ఉండవచ్చు కానీ ధర్మేంద్ర ప్రధాన్ ఎట్టకేలకు రాజీనామా చేసినందుకు మేం సంతోషంగా ఉన్నాం’ అని ఆయన వ్యాఖ్యానించారు. ‘ఇది కేవలం మొదటి అడుగు మాత్రమేనని, మన పోరాటం మన వ్యవస్థతోనేనని, విద్యాశాఖ మంత్రి మొదలు జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టిఏ) వరకూ ప్రతీ ఒక్కరినీ జవాబుదారీగా చేయాలి’ అని మరొక నిరసనకారిణి నమ్రత అన్నారు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య నిరసన శక్తికి నిదర్శనంగా అభివర్ణించారు. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వ్యాఖ్యలను అభిజీత్ దీప్కే ప్రస్తావిస్తూ ‘మీరు మమ్మల్ని ‘బొద్దింకలు’ అని పిలువకపోయి ఉంటే, నేను భారతదేశానికి తిరిగివచ్చేవాడిని కాదు అని, మీరు మమ్మల్ని బొద్దింకలు అని పిలువకపోయి ఉంటే యువత దేశం వీధుల్లోకి వచ్చి ఉండేవారు కాదని, మీరు మమ్మల్ని పిలువకపోయి ఉంటే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ఉండేవారు కాదు’ అని వ్యాఖ్యానించారు.

## నా సలహా మేరకే సిజెపితో కేంద్రం చర్యలు?

### ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్



**పుణె :** యువ నిరసనకారులపై బలప్రయోగం చేయకుండా సిజెపి నాయకులతో చర్చలు జరపాలని తాను ప్రధాని నరేంద్ర మోదీని కోరానని, బహుశా ఆయన తన సలహాను పరిగణనలోకి తీసుకుని ఉండవచ్చని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం యువశక్తికి, భారతీయ ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని పవార్ శనివారం పుణెలో జరిగిన మీడియా సమావేశంలో అన్నారు. ప్రధాన్ రాజీనామా కోసం సిజెపి చేపట్టిన ఆందోళన సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను పవార్ కలిశారు, ఆ తర్వాత ప్రధాని మోదీని కూడా కలిశారు. ‘నేను స్వయంగా ప్రధానిని కలిసి, ప్రజాస్వామ్యంలో చర్చలు జరపడం చాలా అవసరమని చెప్పాను. ప్రభుత్వం చర్చలకు సుముఖత చూపిస్తే, తాము కూడా చర్చలకు సిద్ధంగా ఉండాలని అభిజీత్ దీప్కేకు, ఇతర యువ నిరసనకారులకు కూడా చెప్పాను’ అని ఆయన అన్నారు. ప్రధాన్ రాజీనామా నిర్ణయంలో కనిపించినట్లుగా ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవడం ప్రధానితో జరిపిన చర్చల ఫలితమేనా అని విలేకరి అడిగినప్పుడు, ‘చర్చలు ప్రారంభించాలని, విద్యార్థులపై పోలీసు చర్య తీసుకోకూడదని నేను ప్రధానిని గట్టిగా కోరాను. నేను చెప్పిన విషయాన్ని ఆయన పరిగణనలోకి తీసుకుని ఉండవచ్చు’ అని బదులిచ్చారు. యువత ఉద్యమానికి పార్లమెంటరీ, నైతిక మద్దతు అందించినందుకు ప్రతిపక్ష పార్టీలకు కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పవార్ అన్నారు, అలాగే దేశంలో ప్రజాస్వామ్యం పునరుజ్జీవం పొందుతోందని పేర్కొన్నారు. యువ నిరసనకారులను అభినందిస్తూనే, వారిపై లాఠీచార్జ్, బాష్పవాయువు ప్రయోగించడాన్ని ప్రభుత్వం నివారించి ఉండాల్సిందని ఆయన అన్నారు. ఢిల్లీ మెట్రోను నిలిపివేయడం వల్ల సామాన్య ప్రజలకు అసౌకర్యం కలిగిందని, అలాగే చాలా మంది యువ మహిళా నిరసనకారులపై తీసుకున్న చర్యలను కూడా నివారించి ఉండవచ్చు అని మాజీ కేంద్ర మంత్రి అన్నారు.

## నల్ల సముద్రంలో దాడి మరో భారత నావికుడు మృతి

### విదేశీమంత్రిత్వశాఖ ఖండన



**న్యూఢిల్లీ:** ఉక్రేన్ యుద్ధంలో పరస్పర దాడులవల్ల నల్ల సముద్రంలో ఒక భారతీయ నావికుడు మరణించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జులై 19వ తేదీన ఒక నౌకపై జరిగిన దాడిలో ముగ్గురు భారతీయులు మరణించడానికి ముందురోజునే 18వ తేదీన జరిగిన దాడిలో భారతీయ నావికుడు మరణించినట్లు ఆలస్యంగా తెలిసింది. ఈ ఘటనను భారత విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఎం.వి.ఓమోర్ఫ్ అనే నౌక రష్యా ప్రాదేశిక జలాల్లో ప్రవేశిస్తున్న సమయంలో దాడి జరగడంతో ఈనెల 18న భారతీయ నావికుడు మరణించాడన్న విషయం బయటపడింది. నౌకలో ఉన్న ముగ్గురు భారతీయులలో ఇద్దరు భారత నావికులు మాత్రం సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. హోర్ముజ్ జలసంధిలో యుద్ధం మొదలైన తర్వాత ఇప్పటివరకూ 14 మంది భారతీయులు మరణించగా, ఇప్పుడు కొత్తగా యూరప్ దేశాల ఆయుధబలం సహాయంతో ఉక్రేన్ నల్ల సముద్రంలో రష్యా నౌకలపై తన దాడులను ఉధృతం చేసిన తర్వాత మరో ముగ్గురు భారత నావికులు మరణించారు. సముద్ర రవాణా స్వేచ్ఛగా సాగాలని, యుద్ధంలో వైరివర్గాలు వాణిజ్య నౌకలపై దాడులు చేయకూడదని, అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని భారత విదేశీమంత్రిత్వశాఖ తన తాజా హెచ్చరికలో డిమాండ్ చేసింది.

## జంతర్‌మంతర్ వద్ద మళ్లీ ఘర్షణ

పోలీసులపై రాళ్లు రువ్విన కొందరు నిరసనకారులు
ఒక ప్రత్యేక పోలీసు, ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలు
నిరసనకారులపై లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం



**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, యువత సంబరాలు చేసుకున్నప్పటికీ కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద నిరసనకారులలో ఒక వర్గం భద్రతా సిబ్బందిపై రాళ్లు రువ్వినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఒక ప్రత్యేక పోలీస్ కమిషనర్‌తో పాటు మరో ఇద్దరు పోలీసు అధికారులకు గాయాలైనట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ ఘటనతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భద్రతా దళాలు బాష్పవాయువు ప్రయోగించి, స్వల్ప లాఠీచార్జికి పాల్పడ్డాయని వర్గాలు తెలిపాయి. నిరసన ప్రదేశంలో సీనియర్ పోలీసు అధికారులు జనసమూహ నియంత్రణను పర్యవేక్షిస్తుండగా, గుంపులోని ఒక వర్గం దూకుడుగా ప్రవర్తించడంతో ఈ హింస చెలరేగిందని వర్గాలు తెలిపాయి. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ప్రత్యేక పోలీస్ కమిషనర్, ఇతర సీనియర్, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి, జన సమూహాన్ని నియంత్రించి, భద్రతా ఏర్పాట్లకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరోధించే ప్రయత్నాలలో ముందుండి నడిపించారు. శాంతిభద్రతలను కాపాడటానికి అధికారులు నిరసనకారులకు దగ్గరగా వెళ్లగా, కొందరు నిరసనకారులు నినాదాలు చేశారు. మరో వర్గం ఎటువంటి రెచ్చగొట్టడం లేకుండా రాళ్లు రువ్వడం ప్రారంభించిందని ఆ వర్గాలు తెలిపాయి. రాళ్ల దాడిలో ప్రత్యేక కమిషనర్ గాయపడగా, చికిత్స కోసం పోలీసు బృందాలు వెంటనే ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించాయి. ఈ ఘటనలో మరో ఇద్దరు పోలీసు అధికారులు కూడా గాయపడ్డారని, వారిని ఆసుపత్రికి తరలించారని ఆయన తెలిపారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని ఆయన అన్నారు. నిరసన ప్రదేశంలో రాళ్ల దాడితో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. దీంతో, గుంపులోని హింసాత్మక వర్గాన్ని చెదరగొట్టి, పరిస్థితి మరింత ముదరకుండా నిరోధించడానికి భద్రతా సిబ్బంది బాష్పవాయువు ప్రయోగించి, స్వల్ప లాఠీచార్జి చేశారు. పోలీసు సిబ్బంది వెంటనే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, నిరసనకారులను వెనక్కి నెట్టివేసి, కొద్ది సమయంలోనే శాంతిభద్రతలను పునరుద్ధరించారని ఆ వర్గాలు తెలిపాయి. ‘పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది. శాంతిభద్రతలను కాపాడటానికి జంతర్ మంతర్ పరిసరాల్లో తగినంత పోలీసు బలగాలను మోహరించారు’ పేర్కొన్నారు. ఘర్షణలు ముగిసిన తర్వాత కూడా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తూనే ఉన్నారని, ముందుజాగ్రత్త చర్యగా కీలక ప్రదేశాల్లో అదనపు బలగాలను మోహరించారని ఆ వర్గాలు తెలిపాయి. రాళ్ల దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు, ఘటనా స్థలంలోని వీడియో ఫుటేజ్‌తో సహా అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు, న్యూఢిల్లీ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఢిల్లీ పోలీసులు 15 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. శాంతిభద్రతలను కాపాడటానికి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఘర్షణల్లో ఇప్పటివరకు 200 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారు. కొనసాగుతున్న నిరసనలో 65 మందికి పైగా నిరసనకారులు గాయపడ్డారని, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

## ‘జెన్‌జీ’ని చూస్తుంటే గర్వంగా ఉంది

### సినీనటి జ్యోతిక

**చెన్నై :** ప్రముఖ హీరో సూర్యా సతీమణి, సినీనటి జ్యోతిక నీట్ పరీక్షా పేపర్ లీక్ వ్యవహారంపై కొనసాగిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసనలకు తన గట్టి మద్దతు పలికారు.‘జెన్ జీ’ ని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం దేశంలో చర్చనీయాంశంగా మారిన పరిణామాలపై జ్యోతిక శనివారం ‘ఇన్‌స్టా’లో పోస్ట్ పెట్టారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలనే విద్యార్థుల డిమాండ్‌ను తాను సమర్థిస్తున్నట్లు తెలిపారు. ‘నేను విద్యార్థులు, మన దేశ భవిష్యత్ కోసం ఆలోచిస్తాను. జవాబుదారీతనానికి మద్దతు ఇస్తాను. ప్రజాస్వామ్య భారతదేశం కోసం, మంచి విద్యా వ్యవస్థ కోసం నిలబడతాను’ అని పేర్కొన్నారు. పర్యావరణ ఉద్యమకారుడు, హక్కుల కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, సౌరవ్‌దాస్ ఉద్యమంలో వారి పాత్రను జ్యోతిక ప్రశంసించారు. ‘ఒక తల్లిగా మా పిల్లలను మీలాగే పెంచాలని కోరుకుంటున్నాను. ఎలాంటి ముసుగులు లేకుండా పోరాడుతున్న జెన్ జీ యువతను చూసి గర్విస్తున్నాను. అందరూ కలిస్తేనే దేశం ముందుకు వెళుతుందని మీరు నిరూపించారు. ఒత్తిడిని అధిగమించినందుకు, మాలో భయాన్ని తొలగించినందుకు ధన్యవాదాలు’ అని జ్యోతిక తన పోస్ట్‌లో పదునైన పదాలతో రాసుకొచ్చారు. ఇటీవల ఆమె భర్త సూర్యా జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఫ్యాన్స్ క్లబ్ ఒక ప్రకటన చేసింది. సూర్యా తన బర్త్ డే వేడుకలను జరుపుకోవద్దని, అందుకు బదులుగా గత కొద్ది రోజులుగా విద్యార్థులు కొనసాగిస్తున్న నిరసనలు, ఆందోళనలపై దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారని తెలియజేసిన అనంతరం, జ్యోతిక ఇన్‌స్టా పోస్ట్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

## పాలకుల జవాబుదారీకి జనరేషన్-జెడ్ పునఃప్రతిష్ట


ప్రజాస్వామ్య మౌలిక హక్కులు తిరిగి సాధించిన ఉద్యమం
విదేశీకుట్రగా చిత్రీకరించే ప్రయత్నం బెడిసికొట్టింది
విద్యావ్యవస్థపై దృష్టిసారించాల్సిన సమయం ఆసన్నం
ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్



**న్యూఢిల్లీ:** కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో తొలి విజయం సాధించిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), ఆయన మద్దతుదారులు, దేశ విద్యార్థులు, యువకుల ఉద్యమానికి ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అభినందనలు తెలియజేశారు. అధికారం చలాయిస్తున్న పాలకులకు ఇన్నాళ్ళుగా మరచిపోయిన జవాబుదారీతనం చాలా ముఖ్యమైనదన్న అంశాన్ని జనరేషన్ –జెడ్ ఉద్యమం దేశంలో పునఃప్రతిష్ఠంపజేసిందని ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజ్, విద్యావ్యవస్థలో అవినీతికిగాను మంత్రి రాజీనామా చేయడం ద్వారా విద్యార్థి ఉద్యమం దేశంలో పాలకుల జవాబుదారీతనాన్ని పునఃప్రతిష్ఠింపజేసిందన్నారు. కుళ్ళిపోయిన దేశ విద్యావ్యవస్థను, కొత్త ప్రభుత్వం చేపట్టిన తిరోగమన విద్యావిధానాన్ని, వివిధ ప్రవేశపరీక్షల కోర్సుల పరీక్షల వ్యవస్థను, ఆ పరీక్షల ద్వారా జరుగుతున్న ఎంపికల వ్యవస్థ, దేశంలో అసాధారణంగా పెరిగిపోయిన నిరుద్యోగం వంటి అనేక అంశాలపై సమూలంగా దృష్టిసారించాల్సిన సమయం ఆసన్నమైందని అమర్‌జీత్ కౌర్ పిలుపు ఇచ్చారు. అదేవిధంగా భారతదేశ ప్రజాస్వామ్యానికి ఉన్న రాజ్యాంగ మౌలిక హక్కులను కూడా ఈ ఉద్యమం పునఃప్రతిష్ఠింపజేసిందని, విద్యార్థులు ఉద్యమం ద్వారా వాటిని తిరిగి సాధించారని పేర్కొన్నారు. దేశ ప్రజాస్వామ్యంలో ఉన్న భావప్రకటనాస్వేచ్ఛ, అసమ్మతిని తెలియజేసే హక్కు, మాట్లాడే హక్కు, శాంతియుతంగా నిరసన తెలియజేసేహక్కు, న్యాయబద్ధమైన డిమాండ్లకు పాలకులు జవాబుదారీ వహించాల్సిన హక్కు వంటవాటిని జనరేషన్– జెడ్ పునఃప్రతిష్ఠించిందని పేర్కొన్నారు. జనరేషన్–జెడ్ చేసిన ఉద్యమాన్ని జాతివ్యతిరేకమైనదని, అరాచకమైనదని, విదేశీశక్తులు చేసిన కుట్ర అనీ చిత్రీకరించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ పాలకులకే తిరిగి బెడిసికొట్టాయని విమర్శించారు. ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసు బలాన్ని ఆశ్రయించిందని, లాఠీ చార్జి, బాష్పవాయు ప్రయోగం, పెల్లెట్స్ బటన్స్, షాక్ బటన్స్ వంటివాటిని ఉపయోగించి క్రూరమైన అణచివేత చర్యలు అమలు చేసిందని, వారిపై క్రిమినల్ కేసులు బనాయించిందని ఇవన్నీ బెడిసికొట్టాయన్నారు. విద్యార్థులు, యువకులపై విచక్షణారహితంగా క్రిమినల్ కేసులు బనాయించారని, ప్రదర్శనలో పాల్గొంటున్న విద్యార్థులకు విశవిద్యాలయ అధికారులతో నోటీసులు జారీ చేయించారని, భయపెట్టే ప్రయత్నాలు చేశారని, ఐనప్పటికీ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు బెదిరిపోకుండా ధైర్యంగా నిలబడ్డారని, ప్రజాస్వామ్యంలో భయానికి తావులేదని రుజువు చేశారని అమర్ జీత్ కౌర్ తన ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు,యువకులపై బనాయించిన కేసులన్నింటిని ఉపసంహరించాలని కోరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థుల డిమాండ్లన్నింటికీ ఎఐటియుసి పూర్తి మద్దతు ఇస్తోందని, అదేవిధంగా నీట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ తర్వాత ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వమే భారతదేశానికి వెన్నుముక అని ఉద్ఘాటిస్తూ, విద్యార్థులు చేసిన ఈ ఆందోళన దేశంలోని కోట్లాదిమంది ప్రజలకు మరోసారి గొప్ప ఆశలు రేకెత్తించిందని పేర్కొన్నారు.

## అమెరికా ‘సెక్షన్ 301’ చర్యల కింద భారత్‌కు 10శాతం తక్కువ సుంకం

### ప్రభుత్వం వెల్లడి



**న్యూఢిల్లీ :** బలవంతపు కార్మిక విధానాల ఆరోపణల నేపథ్యంలో సెక్షన్ 301 చర్యల కింద భారత్‌ను 10శాతం తక్కువ సుంకం వర్గంలోనే ఉంచినట్లు ప్రభుత్వం శనివారం తెలిపింది. అమెరికా వాణిజ్య చట్టం–1974లోని సెక్షన్ 301 కింద తీసుకునే తుదిచర్యలను యునైటెడ్ స్టేట్స్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యుఎస్‌టిఆర్) జులై 23న ప్రకటించారు. బలవంతపు కార్మికులతో ఉత్పత్తి చేయబడిన వస్తువుల దిగుమతులపై నిషేధాలను విధించడం, అమలుచేయడానికి సంబంధించి, బారతదేశం సహా 60 ఆర్థిక వ్యవస్థల విధానాలు, పద్ధతులపై యుఎస్‌టిఆర్ జరిపిన దర్యాప్తు తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. యుఎస్‌టిఆర్ భారతదేశంపై అదనంగా 10శాతం సుంకాలను విధించింది. అమెరికా తొలుత 12.5 సుంకాలను ప్రతిపాదించింది. విచారణ కాలమంతా సమగ్రమైన, లిఖితపూర్వకమైన సమర్పణలు, ప్రత్యక్ష సంప్రదింపుల (పబ్లిక్ హియరింగ్‌లలో పాల్గొనడం సహా) ద్వారా భారతదేశం యుఎస్‌టిఆర్‌తో సన్నిహితంగా వ్యవహరించింది.‘ఈ నిరంతర ప్రయత్నాల ఫలితంగా, తుది చర్యల కింద భారతదేశంపై అదనపు సుంకాలు తక్కువ శ్రేణిలో విధించబడ్డాయి. ఇది కీలక రంగాలలో భారతీయ ఎగుమతులకు సాపేక్ష ప్రయోజనాన్ని అందిస్తుంది’ అని వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం అమెరికాకు భారతదేశం చేసే ఎగుమతులలో గణనీయమైన భాగంపై ఎలాంటి అదనపు సుంకాలు విధించబడవు. ఉదాహరణకు జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, స్మార్ట్‌ఫోన్‌లు, కొన్ని ఇతర నిర్దిష్ట ఉత్పత్తులు అదనపు 10శాతం సుంకం పరిధిలోకి వారు అని ఆ ప్రకటన పేర్కొంది. అంతేకాకుండా, స్టీల్,అల్యూమినియం, ఆటో విడిభాగాలు వంటి సెక్షన్ 232 కింద ఇప్పటికే చేర్చబడిన ఉత్పత్తులకు 10శాతం సుంకం వర్తించదు. సెక్షన్ 232 డ్యూటీలు అన్ని దేశాలకు విస్తృతంగా వర్తిస్తాయి. అయితే కొన్ని పరిమిత మినహాయింపులు ఉంటాయి. ‘ఈ మినహాయింపుల కారణంగా, అమెరికాకు భారతదేశం చేసే ఎగుమతులలో సుమారు 45శాతం అదనపు 10శాతపు సెక్షన్ 301 డ్యూటీ పరిధిలోకి రావు’ అని మంత్రిత్వ శాఖ తెలిపింది. మిగిలిన 55శాతం ఎగుమతులపై అదనంగా 10శాతం సుంకం విధించబడుతుందని తెలియజేసింది.ఈ విషయంలో దర్యాప్తు పరిధిలోకి వచ్చే చాలా ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే భారతదేశం సుంకం భారం తక్కువగా ఉంది.‘2026 ఫిబ్రవరి 2న ప్రకటించిన భారత్–అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని 2026 ఫిబ్రవరి 7న జారీ చేసిన సంయుక్త ప్రకటనకు అనుగుణంగా త్వరగా ముగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది’ అని వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## ఒడిశాలో మావోయిస్టుల డంప్ స్వాధీనం

**మల్కన్‌గిరి:** ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలో భద్రతా బలగాలు పెద్ద ఎత్తున మావోయిస్టు డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు శనివారం పోలీసులు తెలిపారు. 24న బిఎస్ఎఫ్ దళాలు, పోలీసులు జోడంబో పోలీస్ స్టేషన్ పరిధిలో సంయుక్తగా సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో అరపదర్ మరియు ఘుసుంపదర్ గ్రామాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో మావోయిస్టు ఆయుధ నిల్వలను గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. మొత్తం 32 జిలెటిన్‌స్టిక్స్, 11 డిటోనేటర్లు, 500 గ్రాముల గన్ పౌడర్, మూడు మీటర్ల కొడెక్స్ వైరు, ఒక సోలార్ బ్యాటరీ, రెడియో, ఎలక్ట్రిక్ వైరు స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మల్కన్‌గిరి జిల్లాలో శాశ్వత శాంతి నెలకొల్పేందుకు భద్రతా బలగాలు నిరంతరం సోదాలు నిర్వహిస్తాయని పోలీస్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని ఈ ప్రాంతంలో విధ్వంసక చర్యలకు పాల్పడేందుకే ఈ ఆయుధాలు దాచి ఉంచినట్లుగా అనుమానిస్తున్నామన్నారు.

Balaji Institute of Elementary Teacher Education
BIETE NARSAMPET
Approved by NCTE & Affiliated to SCERT, Hyd
Laknepally, NARSAMPET, Dist: Warangal - 506 331 (TG)
CONTACT: 9866078590, 7702076967
D.El.Ed.(E/M)-SPOT ADMISSIONS
PHASE-II NOTIFICATION-2026-27
The Students TG DEECET-2026 qualified and not taken admission anywhere are informed to attend spot admission Phase-II on 30-07-2026 before 2:00pm with all Original Certificates 1 set of Xerox copies, 4 photos and necessary fees. The vacancy Position On https://deecet.cdse.telangana.gov.in/TSDEECET-2026_HomePage.aspx. The vacant Seats will be filled as per guidelines prescribed by Convenor TG DEECET-2026 Eligibility and Qualification 50% in inter/Equivalent Exam & TG DEECET-2026 Qualified Candidates.
CHAIRMAN

IN THE COURT OF THE HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE, SANGA REDDY DISTRICT AT SANGA REDDY
O.S.No. 448 OF 2026
BETWEEN:
**Baby Nakka Netra Reddy,**
(Rep. by mother)
**Smt. Vemuri Anuradha,**
.....Plaintiff
AND
1. Smt. Nakka Rajitha Reddy,
2. The Tahasildar, Ameenpur mandal,
3. All Concerned.
...Defendants
NOTICE
To,
1. To whomsoever it may concern.
The plaintiff herein filed above **O.S. No. 448 of 2026** against above **Defendant No.1 to 3** to declare plaintiff and Defendant No.1 as Legal Heir of Deceased Late Nakka Mukesh Reddy. Hence, you are required to appear before Hon'ble Court through Legal counsel on **18.08.2026** at **10:30am.** Failing which the matter will be heard & decided in your absence.
Sd/-
**K. RAM MURTHY & K. UMA**
**Advocates,**
FCI Colony, Miyapur, Hyderabad-49,
**Mobile: 9440412810.**

## యెమెన్ ప్రజలతో జూదమాడుతున్న హౌతీలు

సనా:యెమెన్ ప్రజలతో హౌతీ తిరుగుబాటు సైన్యాలు జూదం ఆడుతున్నాయని యెమెన్ లీడర్‌షిప్ కౌన్సిల్ అధ్యక్షుడు రషద్ అల్–అలిమి విమర్శించారు. యెమెన్ భూభాగంలో ఉంటూ సౌదీ అరేబియాపై యుద్ధం ప్రకటించిన హౌతీలు ఇరాన్‌కు ప్రయోజనం కలిగిస్తున్నారని విమర్శించారు. ఇరాన్‌కు మద్ద తుగా హౌతీలు సౌదీ ఆరేబియాపై గతవారం యుద్ధ ప్రకటన చేశారు. ఆ తర్వాత గడచిన గురువారం ఎర్ర సముద్రంలో రెండు సౌదీ అరేబియా చమురు ట్యాంకర్లను కూడా ధ్వంసం చేశారు. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం మరో కొత్త ప్రాంతానికి విస్తరించింది. ఈ ప్రాంతంలో యుద్ధ ఉద్రిక్తతలు పెంచిన హౌతీలు ఇరాన్‌కు ప్రయోజనం చేస్తున్నారని అలిమి విమర్శించారు. ఎర్ర సముద్రంలో నౌకలను నిలిపివేసేందుకు సిద్ధంగా ఉండాలని ఇరాన్ పాలకులు ఆదేశించిన తర్వాత హౌతీలు యుద్ధ ప్రకటన చేశారు. యెమెన్‌లో చట్టబద్ధమైన నౌకా రవాణా వాణిజ్య మార్గాలను పునరుద్ధరించడానికి, జలమార్గాలను రక్షించడానికి సౌదీ అరేబియా కూటమితో కలిసి పనిచేస్తామని కూడా రషద్ అల్–అలిమి ప్రకటించారు.

## ఒప్పందం కుదిరింది ట్వీట్లు చెల్లవు

### అబ్రహం ఎకార్డ్‌పై సౌదీ వర్గం వెల్లడి

రియాద్:ఒప్పందం కుదిరిపోయిన తర్వాత ట్రం ప్ చేసే ట్వీట్లు చెల్లుబాటు కాబోవని సౌదీ అరేబియాకు చెందిన ఒకవర్గం పేర్కొంది. అమెరికా–సౌదీరేబియా మధ్య శాంతియుత అవసరాల ని మిత్తం అణుఒప్పందం గడచిన బుధ–గురువారా ల్లో జరిగింది. మొదటిరోజు ఒప్పందంపై సంతకా లు చేసిన తర్వాత మరునాడు ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ, సౌదీ అరేబియా తప్పనిసరిగా అబ్రహాం ఒ ప్పందాలలో చేరితేనే సౌదీ అరేబియాతో చేసుకు న్న ఒప్పందం చెల్లుబాటు అవుతుందని ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో సౌదీ అరేబియా సాధారణ సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, లేకపో తే ఆ దేశంలో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని ని ర్మించబోమని అన్నారు. ట్రంప్ తన 'ట్రూత్ సోషల్ మీడియా' ద్వారా ఎన్ని ట్వీట్లు చేసినా వాటికి విలువ ఉండదని పేర్కొంది.

## వైట్‌హౌస్ డిన్నర్‌లో పాత్రికేయులపై విరుచుకుపడిన ట్రంప్

- నిష్పక్షపాతాన్ని కోల్పోయారు
- నేను లేకపోతే వార్తా పరిశ్రమ దివాళా తీస్తుంది
- విమర్శలు చేసినవారికి అవార్డులిచ్చి సత్కారం



వాషింగ్టన్:అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గడచిన ఏప్రిల్‌లో వైట్‌హౌస్ పాత్రికేయులకు ఏర్పాటు చేసిన డిన్నర్ కార్యక్రమం ఆయనపై హత్యయత్నం ఘటనతో రసాభాసగా మారిన తర్వాత మరోసారి శుక్రవారం రాత్రి (అమెరికా కాలమానం ప్రకారం) డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ డిన్నర్ కార్యక్రమం హాస్యోక్తులు,పాత్రికేయులపై ప్రశంసలతో సాగినప్పటికీ కొంతమంది జర్నలిస్టులను ఉద్దేశించి అవమానకరమైన విమర్శలు చేశారు. చాలా కఠిన పదజాలం ఉపయోగించారు. రెండోసారి కలుసుకోవడం ఉత్తమంగా ఉంటుందన్నారు. చాలామంది జర్నలిస్టులను తాను గౌరవిస్తానన్నారు. తనకు వ్యతిరేకంగా నకిలీ వార్తలు రాస్తున్నారని విమర్శించారు. మీలో కొందరికి నేను నచ్చనన్నారు. తాను లేకపోతే వార్తలు ఉండవని, వార్తా పరిశ్రమ దివాళా తీస్తుందని చమత్కార బాణాలు విసిరారు. 2028లో రూపం మార్చి టోపీ పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తానన్నారు. పాత్రికేయులు నిష్పక్షపాతాన్ని కోల్పోయారని విమర్శించారు. కొందరు పాత్రికేయులను ఉద్దేశించి పరోక్షంగా ఆయన సూటి దూషణలు చేశారు. మనం తూటాలతో కాకుండా చర్చలతో పరిష్కరించుకుందామన్నారు. కొందరు పాత్రికేయులు తనకు వ్యతిరేకంగా నకిలీ వార్తలు రాస్తున్నారని, చాలామంది జర్నలిస్టులు ''ట్రంప్ డీరేంజ్‌మెంట్ సిండ్రోమ్'' తో (ట్రంప్ వ్యతిరేక ఉన్మాదం) బాధపడుతున్నారని విమర్శించారు. అంటే ఎలాంటి మనోవైకల్యం లేకపోయినా ఒక నాయకుణ్ణి లక్ష్యంగా చేసుకుని ఉద్దేశపూర్వకంగా విమర్శలు దాడులు చేస్తున్నారని విమర్శించారు. దీంతో అక్కడి వాతావరణం పూర్తిగా మారిపోయింది.జార్జి డబ్ల్యు. బుష్ అధికారంలో ఉన్నప్పుడు కన్జర్వేటివ్ కాలమిస్టు ఛార్లెస్ క్రౌతామర్ మొదటిసారి ఈ పద బంధాన్ని సృష్టించారు. తనను లక్ష్యంగా చేసుకుని ద్వేషంతో విమర్శల దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా తనకు వ్యతిరేకంగా వార్తలు రాసిన పాత్రికేయులకు కూడా ఆ యన చిరునవ్వుతో అవార్డులు అందజేశారు. జె ఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వార్తలు రాసిన వాల్‌స్ట్రీట్ జర్నల్ జర్నలిస్టుబృందం కూడా ట్రంప్ నుండి అవార్డులు తీకున్నవారిలో ఉంది. భావప్రకటనా స్వేచ్ఛ ను గౌరవించాలని కూడా ఆయన అమెరికన్లకు పిలుపు ఇచ్చారు.ఈ వేదికపై డబ్ల్యుహెచ్‌సిఎ అధ్యక్షురాలు వీజియా జియాంగ్ పాల్గొన్నారు. గత ఏప్రిల్‌లో వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ (డబ్ల్యుహెచ్‌సిఎ)కు డిన్నర్ ఏర్పాటు చేసినప్పుడు కోల్ టోమస్ అలె న్ (31) ట్రంప్‌పై హత్యాయత్నం చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు. ఆనాడు డిన్నర్‌కు 2000 మంది జర్నలిస్టులు హాజరుకాగా, ఈసారి బాగా ఆంక్షలు విధించి కేవలం 700 మంది జర్నలిస్టులను మాత్రమే డిన్నర్‌కు ఆహ్వానించారు. ఈ కార్యక్రమం జరిగిన హోటల్ చుట్టూ భారీబందోబస్తు ఏర్పాట్లు చేశారు. వైట్ హౌస్–మీడియా మధ్య వాతావరణం ఉద్రిక్తంగా ఉన్న పరిస్థితులమధ్య ఈ డిన్నర్ జరిగింది.

## సరోగసీపై వివాదం జర్మనీ మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణ



బాన్:జర్మనీ మంత్రివర్గాన్ని ఆ దేశ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ పునర్వ్యవస్థీకరించారు. సరోగసీ సమస్యపై దేశంలో తలెత్తిన వివాదం కారణంగా ఒక మంత్రి రాజీనామా చేసిన తర్వాత ఈ పరిస్థితులు తలెత్తాయి.రాబోయేరోజుల్లో మరోవిడత కూడా మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయని అందరూ భావిస్తున్నారు.మెర్జ్‌కు చెందిన సంప్రదాయవాద క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కార్‌స్టెన్ లిన్నెమన్ ఆరోగ్యశాఖామంత్రి పదవిలోకి వచ్చారు. ఇప్పటివరకూ నీనా వార్కెన్ ఆరోగ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.ఇప్పుడు వార్కెన్ ఛాన్సలర్ మెర్జ్ మొత్తం సిబ్బందికి ప్రధాన అధిపతి బాధ్యతల్లో నియమితులయ్యారు.జర్మన్ ఛాన్సలర్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ బాధ్యతలు తీసుకున్న మహిళానేతగా ఆమె రికార్డుల్లో నమోదయ్యారు.తమ ప్రభుత్వం సంస్కరణల ప్రభుత్వమనీ, ఎంతో ఉత్సాహంగా, వ్యక్తిగత వైవిధ్యంతో తమ ప్రభుత్వం బాధ్యతలు నిర్వహిస్తుందని మెర్జ్ చెప్పారు.జర్మనీలో 16 రాష్ట్రాలతో ఫెడరల్ ప్రభుత్వం సంబంధాలను కొనసాగించేందుకు నియమితులైన ఫిలిప్ ఆమ్థోర్ కూడా ఈ ప్రకటన చేయడానికి మెర్జ్ ఏర్పాటు చేసిన పత్రికాగోష్ఠిలో పాల్గొన్నారు.

## దర్యాప్తు పూర్తి (మొదటి పేజీ తరువాయి)

విధిస్తారు. ఛార్జిషీట్ దాఖలు చేసిన కొన్ని నెలల్లోనే విచారణను వేగంగా నిర్వహించి, పూర్తి చేసే ఫాస్ట్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించనున్నట్లు ఆ బిల్లులో పేర్కొన్నారు. విద్యారంగంలో జవాబుదారీతనాన్ని కోరుతూ జంతర్ మంతర్ వద్ద, దేశంలోని వివిధ రాష్ట్రాలలో కొనసాగుతోన్న విద్యార్థుల నిరసనల నేపథ్యంలో నీట్–యుజి పేపర్ లీక్ కేసులను పరిష్కరించడానికి ఒక చట్టాన్ని తీసుకువస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇలాంటి కేసుల్లో నిందితుల కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు తరలిస్తామని కూడా ప్రధానమంత్రి చెప్పారు. శుక్రవారం నాడు, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్ర మంత్రివర్గం ఆ బిల్లుకు ఆమోదం తెలిపింది. శుక్రవారం నాడు కేంద్ర మంత్రివర్గం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ఆ బిల్లుకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పరీక్షలలో అక్రమాలను నివారించడానికి, ఈ బిల్లు సవరించాలని ప్రతిపాదిస్తున్న ప్రభుత్వ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం 2024ను అమలుచేశారు.ఇటీవలి సంవత్సరాలలో ప్రభుత్వ పరీక్షా సంస్థలు నిర్వహించే పరీక్షలలో ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలకు సంబంధించిన అనేక సంఘటనలు జరిగాయని, ప్రభుత్వ పరీక్షల వ్యవస్థలో పారదర్శకత,నిష్పాక్షికతను ఇవి ప్రభావితం చేస్తాయిన ఈ బిల్లు పేర్కొంది. ప్రతిపాదిత చట్టం కింద నేరాలను విచారించడానికి, ఏదైనా సెషన్స్ కోర్టును ఒక ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుగా నియమించే అధికారాన్ని అన్ని రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనా యంత్రాంగాలకు కల్పించాలని ఈ సవరణ బిల్లు కోరుతోంది. అటువంటి కోర్టులలో విచారణలు రోజువారీ ప్రాతిపదికన కొనసాగుతాయని, ఛార్జిషీట్ దాఖలు చేసిన తేదీ నుంచి 3 నెలల్లోపు విచారణ పూర్తి చేయాలని కూడా ఈ బిల్లు నిర్దేశిస్తుంది.అవసరమైతే, ఏ నేరంపైనైనా దర్యాప్తు చేసేందుకు ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని కూడా ఇది కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తుంది.

## ఫ్రాన్స్–స్పెయిన్‌లో కార్చిచ్చు: 2.80 లక్షలమంది నిరాశ్రయులు

- మాడ్రిడ్‌లో విషమించిన పరిస్థితి
- రంగంలోకి సైన్యాలు,యూరోపియన్ బృందాలు



మాడ్రిడ్:ఫ్రాన్స్–స్పెయిన్ దేశాల్లో దావాన ల అగ్నికీలలు అడ్డూఅదుపూలేకుండా విస్తరిస్తున్నాయి. మాడ్రిడ్ నగరంలో దావానల జ్వాలలు అదుపుచేయడానికి సాధ్యంకాని విషమస్థితికి చేరకున్నాయి. దీంతో స్పెయిన్ దేశంలో జాతీయ ఎమర్జెన్సీ పరిస్థితి ప్రకటించారు. ఒక్క నైరుతీ ఫ్రాన్స్‌లోనే 2. 80 లక్షలమంది ప్రజలు దావానల భయ ంలో ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. మరికొ ందరు బోట్లు వేసుకుని సముద్రమార్గంలో వెళ్ళిపోయారు. చివరకు ప్రభుత్వాలు వా రికి సురక్షిత ప్రాంతంలో తలదాచుకునేందుకు అవకాశాలు కల్పించింది. దీంతో రెం డు దేశాల్లోనూ సైన్యం రంగంలోకి దిగి ంది. యూరోపియన్ యూనియన్ దేశాల కు చెందిన అగ్నిమాపక సహాయ బృం దాలు కూడా ఈ రెండు దేశాలలో దావాన లం జ్వాలలను అదుపు చేసేందుక స హాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో శాంఛెజ్ స హాయ బృందాలు మంటలు ఆర్పే కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉండగా ఫ్రాన్స్‌లో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని వాతావరణ అధికారులు ఆశతో ఉన్నారు. పిడుగుపాటువల్ల, పారేసిన సిగరెట్ల వల్ల, బార్బె క్యూ నుండి వచ్చే నిప్పురవ్వలు,తెగిపడిన విద్యుత్ తీగలవల్ల ఆకస్మిక కార్చిచ్చు ప్రా రంభమయ్యే అవకాశాలు ఉన్నాయని ప్రజ లు చెబుతున్నారు. కానీ ఐరోపాలో ఈసా రి అసాధారణమైన వేడి,వడగాలులవల్ల దావానం ఇంకా తీవ్రగా వ్యాపిస్తోంది. స్పెయిన్‌లో మూడు వారాలుగా దావానల జ్వాలలు అదుపులోకి రావడంలేదు. దీం తో 70,000 మంది ప్రజలు ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. కొందరు అగ్నిమాపకదళ సిబ్బంది తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఒక్క మాడ్రి డ్ నగరంలోనే పరిస్థితి పరాకాష్ఠకు చేరుకుంది. నగరంలో ప్రజలు పరారయ్యా రు. ఇక్కడ కార్చిచ్చు జ్వాలలు అదుపు చేయడానికి సాధ్యంకాని దశకు చేరుకున్నాయి. కార్చిచ్చును అదుపు చేయడానికి సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు.దిశ మా ర్చుకుని బోర్డోవైపు ప్రయాణిస్తున్న దావానలాన్ని అదుపు చేయడానికి ఫ్రాన్స్ సైన్యం రంగంలోకి దిగింది. ఒక్క మాడ్రిడ్‌లోనే 8000 మందికి పైగా ప్రజలు ఇళ్ళు వదలి సురక్షిత ప్రాంతాలు వెతుక్కుంటూ వెళ్ళిపోయారు. ''తమ ప్రాంత చరిత్రలోనే ఇది అత్యంత ఘోరమైన దావానల దహన జ్వాలలు'' అని స్పెయిన్ ప్రాంతీయ అధ్యక్షురాలు ఇసాబెల్ డియాజ్ అయూసో అన్నారు. స్పెయిన్‌లోని అండలూసియా అల్మెరియా రాష్ట్రంలో జులై 9వ తేదీన దావానలం రగులుకుని 16 రోజులుగా ఆగకుండా విస్తరిస్తోంది. పచ్చికబయళ్ళు,పొట్టిపొదలు,ఇళ్ళు,వాహనాలు,అడవులను ఈ దావానలం దహించివేస్తోంది. స్పెయిన్‌లో13మంది మరణించగా, 10 మంది గల్లంతయ్యారు.

## కష్టపడే ఉద్యోగికి ఎక్కడైనా గుర్తింపు

### స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి



ప్రజాపక్షం/హైదరాబాద్: నిబద్ధతతో, కష్టపడి పనిచేసే ఉద్యోగికి ఎక్కడైనా గుర్తింపు లభిస్తుందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి అన్నారు.తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో గత ఏడు సంవత్సరాలుగా డిప్యూటేషన్‌పై డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన సుజాత తన మాతృశాఖ అయిన సహకార శాఖకు బదిలీ అయిన సందర్భంగా శనివారం స్పోర్ట్స్ అథారిటీ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సోనీ బాలాదేవి మాట్లాడుతూ, కష్టపడి పనిచేసే ఉద్యోగులు ఎక్కడ పని చేసినా తమ పనితీరుతో అధికారుల, సహోద్యోగుల ప్ర శంసలు అందుకుంటారని పేర్కొన్నారు. తెలంగాణ స్పోరట్స్ అథారిటీలో కోచ్‌లు, అధికారులు, సిబ్బంది అంద రూ సమష్టిగా కృషి చేయడం వల్లనే అనేక క్రీడా టోర్నమెంట్లు, కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించగలిగామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనిత, ఇంజనీర్ శ్రీనివాస్, స్టేట్ డైరెక్టర్లు కె.ఆర్. బట్లర్, శాలిని, అశ్విని దడ్వే, పిఆర్‌ఓ కాలేరు సురేష్‌తో పాటు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ఉద్యోగులు, నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి రాజీనామాతో సరిపోదు.. విద్యా వ్యవస్థలో సంస్కరణలు తేవాలి : కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్ : నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో విద్యార్థుల ఆందోళనల ఫలితంగానే బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని తెలంగాణ రక్షణ సేన(టిఆర్‌ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కేవలం రాజీనామాతో సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన కవిత కేంద్ర ప్రభుత్వం రాజకీయ నష్టం నుంచి బయటపడేందుకే మంత్రి రాజీనామా చేయించిందని విమర్శించారు. విద్యార్థులకు నిజమైన న్యాయం జరగాలంటే మొత్తం పరీక్షల వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం అందించాలని కవిత డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 20న విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ, లాఠీచార్జ్కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కేవలం మంత్రి రాజీనామాతో కంటితుడుపు చర్యలకు పరిమితమైతే ప్రజలు, విద్యార్థులు అంగీకరించరని కవిత హెచ్చరించారు.

## అహంకారం ఓడింది (మొదటి పేజీ తరువాయి)

ఉద్ఘాటించింది. ప్రజాస్వామ్యబద్ధమైన విద్యావ్యవస్థ ఇంకా చాలా దూరంలో ఉందని పేర్కొంది. ఈ ఉద్యమాన్ని నిర్వహించిన దేశంలోని విద్యార్థులు,యువకులను సాహసోపేతమైన పోరాటంకోసం సమీకరించిన నిర్వాహకులకు, వారి ఐక్యతకు హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. ఈ విజయం విద్యార్థులు,యువకులకే దక్కుతుందని, వారిపక్షాన నిలబడి పోరాటానికి సంఘీభావం ప్రకటించిన అన్ని ప్రజాస్వామ్యశక్తులకు ఈ విజయం దక్కుతుందని పేర్కొంది. ''కేంద్ర విద్యాశాఖామంత్రిని ప్రజలకు జవాబుదారీ వహించకుండా దూరంగా కేంద్ర ప్రభుత్వం ఆయనను దాచిపెట్టే ప్రయత్నం చేసింది,శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రదర్శకుల అణచివేతకు పాల్పడింది, విద్యార్థులపై తీవ్ర లాఠీఛార్జీ జరిగింది, వారిపై బాష్పబాయుగోళాలు ప్రయోగించారు, వీలైనన్ని ఇతర అన్ని అణచివేత చర్యలకు పాల్పడ్డారు.వీటన్నింటినీ ఎంత మాత్రం లక్ష్యపెట్టకుండా విద్యార్థులు,యువకులు అసాధారణమైన ధైర్యసాహాలు ప్రదర్శించారు,పోలీసులు, ప్రభుత్వ బెదిరింపులకు లొంగకుండా దృఢసంకల్పంతో పోరాటం కొనసాగించారు. ఇక ఇప్పుడు విద్యార్థులపై బనాయించిన కేసులన్నింటినీ ఉపసంహరించుకోవాలి, అన్ని ఎఫ్‌ఐఆర్‌లను రద్దుచేయాలి, ఇతర కేసులను కూడా తొలగించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రదర్శన చేస్తున్నవారిపై దారుణ హింసను ఎత్తిపోసిన ప్రభుత్వం ప్రదర్శకులకు బేషరతుగా క్షమాపణలు తెలియజేయాలి. అనేక సంవత్సరాలుగా ప్రశ్నాపత్రాల లీకేజీలు,నిర్లక్ష్యపూరితమైన ప్రైవేటీకరణ,మితిమీరిన కేంద్రీకరణ,ప్రభుత్వ విద్యావ్యవస్థను ఒక పథకం ప్రకారం బలహీనపరచడం వంటి అనేక చరయల ద్వారా మనదేశ విద్యారంగం చాలా లోతైన అగాథంలో కూరుకుపోయింది.విద్యావ్యవస్థలో పదే పదే ప్రభుత్వ వైఫల్యాల కారణంగా దేశంలోని విద్యార్థులు,వారి కుటుంబాల ఆత్మవిశ్వాసం అడుగంటిపోయింది. వారు వ్యవస్థపై విశ్వాసం కోల్పోయారు. విద్యావ్యస్థలో వైఫల్యాల కారణంగా యువకుల ప్రాణాలు కోల్పోయి సంబంధిత కుటుంబాలు చాలా విషాదకరమైన పరిస్థితుల్లోకి జారుకున్నప్పటికీ ప్రభుత్వం నుండి కనీస బాధ్యతాయుతమైన ప్రతిస్పందన రాలేదు. ఈ పరిస్థితులన్నీ చిట్టచివరకు ఒక జవాబుదారీతనాన్ని సాధించడంకోసం జాతీయస్థాయీ నిరసన ఉద్యమానికి దారితీసింది. అందువల్ల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వల్ల,విద్యావ్యవస్థ వైఫల్యాల కారణంగా తమ బిడ్డలను కోల్పోయిన కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని భారత కమ్యూనిస్టుపార్టీ డిమాండ్ చేస్తోంది'' అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో స్పష్టం చేసింది.

## ప్రజాస్వామ్య విజయం (మొదటి పేజీ తరువాయి)

పట్టుదలల విజయం'గా పేర్కొంటూ, నీట్ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నందుకు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి), జెన్ జెడ, దేశవ్యాప్తంగా ఉన్న పౌరులను ఈ పర్యావరణవేత్త అభినందించారు. 'సిజెపికి, దేశంలోని జెన్ జెడ్‌కు అభినందనలు. భయాన్ని, భయం పట్ల భయాన్ని వీడి, దేశంలోని నలుమూలల నుండి ముందుకు వచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు' అని ఆయన అన్నారు. ఆసుపత్రిలో చేరడానికి ముందు నిరసనలో పాల్గొని, 26 రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేసిన వాంగ్‌చుక్, ఈ ఉద్యమం ఇప్పుడు జవాబుదారీతనం కోరడం వరకే పరిమితం కాకూడదని అన్నారు. ఇప్పుడు సంస్కరణల వైపు అని ఆయన అన్నారు.

## తలవంచాల్సిందే (మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. విద్యావ్యవస్థను పునర్నిర్మించే దిశగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక పెద్ద అడుగు అని పేర్కొన్నారు. 'అదొక సంకేతాత్మక అడుగు, ఎందుకంటే ఆయన ఒక ప్రతీకగా నిలిచారు, కానీ అది నిజంగానే ఒక పెద్ద అడుగు' అని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం కోసం, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి, ప్రతి యువకుడికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురవుతున్న రైతులు, కార్మికులు, పేదల వంటి ఇతర వర్గాలకు ప్రధాన్ రాజీనామా ఒక సంకేతం అని కూడా కాంగ్రెస్ నేత అన్నారు. ఎదిరించి నిలబడటంలోనే వివేకం, ధైర్యం ఉన్నాయని రాహుల్ ఉద్ఘాటించారు. విద్యార్థుల పట్ల, భారతదేశ భవిష్యత్తు పట్ల గౌరవంతో క్రూరమైన దాడులకు గురైన విద్యార్థులకు ప్రధాన మంత్రి క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. కాగా, ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడిని కొనసాగించిన విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక విజయమని అయితే ప్రధాన మంత్రి ఇంకా విద్యార్థులకు క్షమాపణ చెప్పలేదు కాబట్టి ఇది అంతం కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అన్యాయమైన, అవినీతిమయమైన వ్యవస్థలో పోరాడి విసిగిపోయిన తరానికి, అలాగే విద్యార్థులతో దృఢమైన ఐక్యతను, సంఘీభావాన్ని ప్రదర్శించిన ప్రతిపక్షానికి ఇది ఒక విజయమని ఆయన అభివర్ణించారు. ప్రధాన్ రాజీనామా 'సత్యం యొక్క విజయం', ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అహంకార వైఖరికి ఓటమి అని ఖర్గే అన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీలు, కర్రలు, పెల్లెట్ గన్‌లను ప్రయోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం, క్షమాపణ చెప్పడం ఇప్పుడు మోదీ వంతు అని కూడా ఆయన అన్నారు. 'భారతదేశ విద్యార్థుల గళం ఎట్టకేలకు అహంకారంతో కూడిన అధికార పీఠం వరకు చేరింది. విద్యా వ్యవస్థను సరిదిద్దడానికి దేశవ్యాప్తంగా వీధుల్లో గళమెత్తిన లక్షలాది మంది యువతకు ఇది విజయం... ఇది సత్యం యొక్క విజయం, మోదీ అహంకార వైఖరికి ఓటమి' అని ఆయన అన్నారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం పార్లమెంటు నుండి వీధుల వరకు గళమెత్తిన ఐక్య ప్రతిపక్షానికి ఇది విజయమన్నారు.

## ఆందోళన విరమిస్తున్నాం (మొదటి పేజీ తరువాయి)

అంగీకరించింది; నిరసన స్థలాల నుండి శాంతియుతంగా వెనుదిరగాలని అందరినీ కోరుతున్నాము' అని రంకా అన్నారు. నిరసనకారులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరించుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కేంద్రమంత్రి నడ్డా చెప్పారు. నీట్ ఆత్మహత్య బాధితుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం ఆర్థిక పరిహారం అందిస్తామని ఆయన తెలిపారు, అయితే ఎంత మొత్తమనేది నిర్దిష్టంగా చెప్పలేదు. విలేకరుల సమావేశానికి ముందు, తాను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి రాజీనామా లేఖను సమర్పించానని, ఇది తనకు 'వ్యక్తిగత ప్రతిష్ట'కు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆ రాజీనామాను ఆమోదించారో లేదో వెంటనే స్పష్టం కాలేదు.

**జంతర్‌మంతర్ వద్ద మిన్నంటిన హర్షధ్వానాలు**

ప్రభుత్వం దిగిరావడం, మంత్రి తప్పుకోవడం అనే వార్తలతో, స్వచ్ఛందంగా మొదలైన ఈ నిరసనలకు కేంద్ర బిందువైన జంతర్ మంతర్ వద్ద హర్షధ్వానాలు మిన్నంటాయి. జంతర్ మంతర్ వద్ద తమ విజయాన్ని పురస్కరించుకుని, నిరసనకారులు ఉత్సాహంతో నృత్యం చేస్తూ, జాతీయ జెండాను ఊపుతూ సంబరాలు చేసుకున్నారు. 'చక్ దే ఇండియా' వంటి పాటలు మారుమోగుతుండగా వారు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ కనిపించారు. మంత్రి రాజీనామాను తమ పోరాట విజయంగా భావించి సంబరాలు చేసుకుంటున్న ఆ సమూహంలో చాలా మంది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలు, పోస్టర్లను ప్రదర్శించారు. అదే సమయంలో, మిగిలిన రెండు డిమాండ్లకు కూడా అంగీకారం లభించాల్సి ఉందని సిజెపి అక్కడ గుమిగూడిన వారికి స్పష్టం చేసింది. అయితే, ఇది ముగింపు కాదని, దేశవ్యాప్తంగా విస్తరిం చిన ఈ ఉద్యమం కొనసాగవచ్చని సిజెపి స్పష్టం చేసిం ది. ప్రభుత్వం దిగివచ్చి మంత్రి రాజీనామా చేశారన్న వార్త వచ్చిన తర్వాత సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే మాట్లాడుతూ 'మాకు ఇంకా రెండు డిమాండ్లు ఉన్నాయి. మేము ఊరికే వెళ్ళిపోము. మేము కాక్రోచ్‌ల (బొద్దింకల) లాంటివాళ్ళం, ఒకసారి లోపలికి ప్రవేశించాక బయటకు వెళ్ళము' అని అన్నారు.

**సిజెఐకి కృతజ్ఞతలు:**

నిరుద్యోగ యువతను బొద్దింకలతో పోల్చుతూ ఈ సహజ ఉద్యమానికి బీజం వేసిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌కు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మీరు మమ్మల్ని 'బొద్దింకలు' అని పిలవకపోయి ఉంటే, నేను భారతదేశానికి తిరిగి వచ్చేవాడిని కాదు. మీరు మమ్మల్ని 'బొద్దింకలు' అని పిలవకపోయి ఉంటే, దేశ యువత వీధుల్లోకి వచ్చేది కాదు. మీరు మమ్మల్ని 'బొద్దింకలు' అని పిలవకపోయి ఉంటే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా జరిగి ఉండేది కాదు' అని అన్నారు. సిజెపికు చెందిన 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' ఎక్స్ ఖాతాలో 'డిమాండ్ల తాజా స్థితి' పోస్ట్ చేశారు. ఇందులో జాబితాలోని మొదటి అంశం— ప్రధాన్ రాజీనామా— పక్కన 'టిక్' గుర్తు పెట్టారు. మిగిలిన రెండు డిమాండ్లైన— ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం, నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం— అనే వాటిని 'పెండింగ్' (పరిశీలనలో ఉన్నవి)గా గుర్తించారు. నెలకొన్న ప్రతిష్టంభనకు సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనేందుకు సిజెపి ప్రతినిధులు కేంద్ర మంత్రులు జితేంద్ర సింగ్, జె.పి. నడ్డాలతో మరో విడత చర్చలు జరపడానికి కొద్దిసేపటి ముందే ప్రధాన్ రాజీనామా చేశారు. తటస్థ వేదిక ఉండాలన్న సిజెపి డిమాండ్ మేరకు, జంతర్ మంతర్ సమీపంలోని విఠల్ భాయ్ పటేల్ హౌస్‌లో ఈ చర్చలు జరిగాయి. నీట్ యుజి 2026 పరీక్షా పత్రం లీకేజీ, సిబిఎస్‌ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియలో అక్రమాలు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణల డిమాండ్‌తో ప్రధాన్ బాధ్యత వహించాలని కోరుతూ సిజెపి ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జూన్ 20న ప్రారంభమయ్యాయి. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, పలువురు విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడం, వేలాది మంది ప్రజలు అక్కడ గుమిగూడటంతో జంతర్ మంతర్ వైపే అందరి దృష్టి మళ్లింది. ఒక నెల తర్వాత, 'సంసద్ చలో' పిలుపు మేరకు వారు వీధుల్లోకి రాగా, పోలీసులు లాఠీఛార్జ్, బాష్పవాయువు ప్రయోగంతో వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పలువురు పోలీసులు కూడా గాయపడ్డారు. ఆ హింసాత్మక ఘటనకు సంబంధించిన వీడియోలు విస్తృతంగా ప్రచారం కావడం నిరసనలకు కొత్త ఊపిరి పోసి, దేశవ్యాప్తంగా ఇలాంటి నిరసనలే తలెత్తడానికి ఒక కీలక మలుపుగా నిలిచింది.

## ధర్మేంద్ర రాజీనామా (మొదటి పేజీ తరువాయి)

బాధ్యత వహించినప్పటికీ, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు అడ్డంకులు సృష్టించడానికి, విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించారని ప్రధాన్ వ్యాఖ్యానించారు. 'గత పది రోజులుగా జరిగిన పరిణామాలు నన్ను బాధించాయి. ఇది నాకు వ్యక్తిగత ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదు. దేశ యువత గందరగోళ వలయంలో చిక్కుకోకుండా చూడటమే నా సంకల్పం. జంతర్ మంతర్ వద్ద, దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని దేశ వ్యతిరేక శక్తులు దీనిని తమకు అనుకూలంగా మలుచుకోకుండా అడ్డుకోవడం, జాతీయ సమైక్యతను కాపాడటం, ఒక్క భారతీయ విద్యార్థి భవిష్యత్తు కూడా చట్టపరమైన చిక్కుల్లో పడకుండా చూడటం, మన పిల్లలు తమ సమయాన్ని చదువులకు, కెరీర్ నిర్మాణానికి కేటాయించేలా చేయడం వంటి లక్ష్యాలతో నేను ప్రధానమంత్రికి నా రాజీనామాను సమర్పించాను' అని ఆయన అన్నారు. దేశ యువత ఆశయాలు, భావోద్వేగాలు, న్యాయమైన ఆకాంక్షలను గౌరవిస్తానని ప్రధాన్ పేర్కొన్నారు. 'భారత యువతరం కలలను సాకారం చేయడం మా రాజకీయ, సామాజిక జీవితాల్లో ఒక నైతిక బాధ్యతగా ఉంది. మే 3న జరిగిన నీట్‌యుజి పరీక్షకు సంబంధించి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. దీనిని వెంటనే గుర్తించిన భారత ప్రభుత్వం, దర్యాప్తును సిబికి అప్పగించి, పరీక్షను రద్దు చేసి, తిరిగి పరీక్ష నిర్వహించే తేదీని ప్రకటించింది. 'అంతే కాకుండా, వచ్చే ఏడాది నుండి ఈ పరీక్షను సిబిటి (కంప్యూటర్ ఆధారిత పరీక్ష) విధానంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కాలమంతా, 20 లక్షల మందికి పైగా విద్యార్థులకు పరీక్ష సజావుగా జరిగేలా చూడటమే మా ప్రధాన ప్రాధాన్యతగా ఉంది. భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా జిల్లా యంత్రాంగాలను కలుపుకుని 'సమగ్ర ప్రభుత్వ' విధానం ద్వారా ఇది సాధ్యమైంది. విద్యార్థులు, తల్లిదండ్రుల సహకారంతో, జూన్ 21న పరీక్ష విజయవంతంగా ముగిసింది' అని ఆయన చెప్పారు. జులై 16న ప్రకటించిన నీట్‌యుజి ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, వెనుకబడిన వర్గాలకు చెందిన అనేకమంది ప్రతిభావంతులైన విద్యార్థులు విజయం సాధించారని ప్రధాన్ పేర్కొన్నారు. అయితే, ఆ సమయంలో కూడా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు అడ్డంకులు సృష్టించడానికి, విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నించడం నన్ను తీవ్రంగా బాధించిందన్నారు. 'మన ప్రజాస్వామ్య శక్తిపై నాకు ఎప్పుడూ అచంచలమైన విశ్వాసం ఉంది. యువత ఆశయాలు, కలలు, ఆకాంక్షలను నేను ఎంతో గౌరవిస్తాను. వారు కేవలం భారతదేశ భవిష్యత్తు మాత్రమే కాదు; వారు నవ, అభివృద్ధి చెందిన భారతదేశానికి దిక్సూచులు, సృష్టికర్తలు, రూపకర్తలు' అని ప్రధాన్ చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) దీనిని తమ 36 రోజుల పోరాటంలో మొదటి విజయంగా అభివర్ణించింది. ఈ ఆందోళనకు మద్దతునిస్తూ ప్రధాన్ రాజీనామా కోసం గళం కలిపిన ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థులు, యువత ప్రజాస్వామ్యానికి దక్కిన విజయంగా పేర్కొన్నాయి. ఈనెల 20న సిజెపి ఆధ్వర్యంలో పార్లమెంటు వైపు జరిగిన ర్యాలీలో హింస చెలరేగడంతో నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. ఈ హింసకు సంబంధించి పోలీసులు, నిరసనకారులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. శనివారం ప్రధాన్ రాజీనామా చేయడంతో జంతర్ మంతర్ వద్ద సంబరాలు మిన్నంటాయి. అక్కడ విద్యార్థులు, సిజెపి సభ్యులు జూన్ 20 నుండి నిరసన దీక్ష చేస్తున్నారు. నీట్ యుజి 2026 పేపర్ లీక్, సిబిఎస్ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ ప్రక్రియలో అక్రమాలపై ఆయన బాధ్యత వహించాలని, అలాగే ప్రభుత్వ పరీక్షల నిర్వహణలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# జింబాబ్వే చిత్తు... సిరీస్ భారత్ కైవసం

మెరిసిన ఇషాన్, అభిషేక్..



వరసగా రెండు వైట్‌వాష్‌లను నుంచి తేరుకున్న భారత జట్టు అదిరే ఆటతో టీ20 సిరీస్ పట్టేసింది. జింబాబ్వేను చిత్తుగా ఓడించి మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన అయ్యర్ సేన 90 పరుగుల తేడాతో గెలిచింది. 220 పరుగుల ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లను ప్రిన్స్ యాదవ్(2–10), అభిషేక్ శర్మ(3–17)లు బెంబేలెత్తించారు. సమిష్టి వైఫల్యంతో ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన ఆఫ్రికా జట్టు మరో ఓటమి చవిచూసింది. పొట్టి క్రికెట్‌లో మళ్లీ ఫామ్ అందుకున్న భారత జట్టు టీ20 సిరీస్‌ను కొల్లగొట్టింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో గెలిచిన టీమిండియా రెండో టీ20లోనూ జింబాబ్వేను వణికించింది. రికార్డు స్థాయిలో 52వ సారి రెండొందలకు పైగా కొట్టిన భారత్.. ప్రత్యర్థిని పరిమితం చేసింది. టాపార్డర్ విఫలమైనా బ్యాటుతో రెచ్చిపోయిన ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్)లు భారీ స్కోరొందించగా.. అనంతరం ప్రిన్స్ యాదవ్(2–10), అభిషేక్ శర్మ(3–17)లు వికెట్ల వేటతో చెలరేగారు. బ్యాటుతో విఫలమైన అభిషేక్.. మూడు వికెట్లు తీయడంతో జింబాబ్వే 129కే ఆలౌటైంది. 90 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఒడిసిపట్టింది. టీమిండియా నిర్దేశించిన 220 పరుగుల భారీ ఛేదనను జింబాబ్వే దూకుడుగా మొదలెట్టింది. ఓపెనర్లు బెన్నెట్(32), బెన్ కరన్(1)లు దూకుడుగా ఆడినా.. అరంగేట్ర పేసర్ యశ్ ఠాకూర్ తొలి దెబ్బ కొట్టాడు. దంచేస్తున్న బెన్నెట్‌ను ఔట్ చేసి బ్రేకివ్వగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కరన్‌ను ప్రిన్స్ యాదవ్(2–10) పెవిలియన్ పంపాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో డియాన్ మైర్స్(12) బౌల్డవ్వగా 58 వద్ద ఆతిథ్య జట్టు మూడో వికెట్ పడింది. కష్టాల్లో పడిన జట్టును ఆదుకోవాలనుకున్న కెప్టెన్ సికిందర్ రజా(0)ను ప్రిన్స్ డకౌట్‌గా వెనక్కి పంపి జింబాబ్వేను మరింత కష్టాల్లోకి నెట్టాడు. దూబే ఓవర్లో మద్వేరా(2) అయ్యర్ చేతికి చిక్కడంతో ప్రత్యర్థి ఓటమిని ఖాయమైంది. రియాన్ బర్ల్(20)ను తిలక్ ఔట్ చేయడంతో టీమిండియా విజయం మరింత తేలికైంది. బ్యాటుతో తేలిపోయిన అభిషేక్(3–17) బంతితో రాణించగా జింబాబ్వే 129 పరుగులకే కుప్పకూలింది.

### ఇషాన్, తిలక్ విధ్వంసం

హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో టాస్ ఓడిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ(8) ఈసారి కూడా నిరాశపరిచాడు. తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన అతడిని ముజరబని పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ(20) జింబాబ్వే బౌలర్లను భయపెట్టాడు. కానీ, అదే ఊపులో ఆడబోయి అతడు వికెట్ సమర్పించుకున్నాడు. 29కే రెండు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25), ఇషాన్ కిషన్(81)లు దూకుడుగా ఆడి స్కోర్‌బోర్డును ఉరికించారు. తిలక్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకోగా రింకూ సింగ్(12) విఫలమయ్యాడు. ఇషాన్, తిలక్ విధ్వంసంతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబని, నగవరా, ఎవాన్స్, న్యూమన్, బెన్నెట్‌లు తలా ఒక వికెట్ తీశారు.

## కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ బోణీ..



కామన్వెల్త్ గేమ్స్2026లో భారత్ బోణీ కొట్టింది. పారా పవర్‌లిఫ్టర్ జందు కుమార్ దేశానికి తొలి పతకాన్ని అందించాడు. శనివారం జరిగిన పురుషుల హెవీవెయిట్ కేటగిరీ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 72.4 కిలోల బరువున్న జందు కుమార్ తన రెండో ప్రయత్నంలో 190 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. మూడో ప్రయత్నంలో 196 కిలోలు ఎత్తడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. పోటీల్లో చాలాసేపు ఆధిక్యంలో ఉన్నప్పటికీ చివరికి మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. బీహార్‌లోని నలందా జిల్లా హర్నాత్ గ్రామానికి చెందిన జందు కుమార్ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు. ఓ సాధారణ కూరగాయల వ్యాపారి కుమారుడైన జందు.. పుట్టుకతోనే పోలియో బారినపడ్డాడు. అయినప్పటికీ ఎన్నో శారీరక, ఆర్థిక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ క్రీడా వేదికపై నిలిచాడు. ఆసక్తికరంగా జందు క్రీడా జీవితం పవర్‌లిఫ్టింగ్‌తో మొదలుకాలేదు. 2017లో షాట్‌పుట్, డిస్కస్ త్రో అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించి జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు కూడా సాధించాడు. జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్నప్పుడు పవర్‌లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకుని ఆ తర్వాత ఈ క్రీడలోకి మారాడు. అయితే అతని ప్రయాణం అంత సులువుగా సాగలేదు. ఉన్నతస్థాయి పోటీలకు అవసరమైన పోషకాహారం కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో జీవనోపాధి కోసం కూరగాయల వ్యాపారం నడిపారు. కనీసం వీల్‌చైర్ కూడా లేని స్థితిలో రోజూ 20 కిలోమీటర్లు ప్రయాణించి స్థానిక మార్కెట్లకు వెళ్లేవాడు. స్నేహితుల వద్ద అప్పు చేసి కొన్న ఈ రిక్షాతో చేసిన కూరగాయల వ్యాపారం కూడా అప్పట్లో కరోనా మహమ్మారి కారణంగా దెబ్బతిన్నది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ రహేలు.. జందులోని ప్రతిభను గుర్తించాడు. గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) సెంటర్‌లో శిక్షణకు ఆహ్వానించాడు. రాజిందర్ మార్గదర్శకత్వంలో జందు కుమార్ అద్భుతంగా రాటుదేలాడు. 2025 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 205 కిలోలు ఎత్తి జాతీయ రికార్డు సృష్టించాడు. కొద్ది నెలలకే ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి తన రికార్డును తానే బద్దలుకొట్టాడు. ఈ కామన్వెల్త్ పతకానికి ముందు బీజింగ్ ప్రపంచకప్ (2025), ఆసియా ఛాంపియన్‌షిప్ (2026) లలోనూ కాంస్య పతకాలు గెలుచుకుని తన సత్తా చాటుకున్నాడు

## బిజినెస్

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 78,151.54 పాయింట్లు. ముగింపు పాయింట్లు. నష్టం 2091.77 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,334.30 పాయింట్లు. ముగింపు పాయింట్లు. నష్టం 566.85 పాయింట్లు.



## లేఆఫ్స్‌కు సిద్ధమైన 'ఇంటెల్'

ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీలు ఉద్యోగాల తొలగింపులను కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ మరోసారి లే ఆఫ్స్‌కు సిద్ధమైంది. డేటా సెంటర్ గ్రూప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు తొలగింపు విషయాన్ని ఇప్పటికే తెలియజేసినట్లు సమాచారం. వ్యాపార పునర్వ్యవస్థీకరణలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంటెల్ వెల్లడించింది. అయితే ఎంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నదీ కంపెనీ వెల్లడించలేదు. ఇటీవల సంవత్సరాల్లో ఖర్చుల తగ్గింపు, సంస్థాగత మార్పులపై దృష్టి పెట్టిన ఇంటెల్, భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గిస్తోంది. 2023 నాటికి కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.25 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, 2025 నాటికి ఆ సంఖ్య 85 వేలకు తగ్గింది. డేటా సెంటర్ గ్రూప్ సర్వర్ ప్రాసెసర్లు, కొడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీలను అభివృద్ధి చేస్తోంది. ఈ విభాగాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నట్లు కంపెనీ తెలిపింది. కొత్త లే ఆఫ్స్ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తాయో ఇంకా స్పష్టం చేయలేదు.

## ప్రపంచ స్టాక్ మార్కెట్లపై యుద్ధ భయం



ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఈవారం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడం, ఎర్ర సముద్రం (రెడ్ సీ) ప్రాంతంలో నౌకాయాన భద్రతపై ఆందోళనలు తలెత్తడం, అంతర్జాతీయ ముడి చమురు (బ్రెంట్ క్రూడ్ ఆయిల్) ధర బ్యారెల్‌కు 100 డాలర్లను దాటడం పెట్టుబడిదారుల్లో ఆందోళన పెంచాయి. ఈ పరిణామాల ప్రభావంతో ప్రభుత్వ బాండ్లపై దిగుబడులు పెరిగాయి. సురక్షిత పెట్టుబడుల వైపు నిధులు మళ్లడంతో అమెరికా డాలర్ బలపడింది. మరోవైపు, ప్రపంచ టెక్నాలజీ దిగ్గజాల రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు కూడా మార్కెట్లకు ఆశించినంత ఉత్సాహాన్ని ఇవ్వలేకపోయాయి. ఆదాయంలో వృద్ధి నమోదైనప్పటికీ, కృత్రిమ మేధ (ఎఐ) అభివృద్ధి కోసం భారీ మూలధన వ్యయం ప్రకటించిన ఆల్ఫాబెట్ షేరు ఒత్తిడికి గురైంది. టెస్లా స్వేచ్ఛా నగదు ప్రవాహం (ఫ్రీ క్యాష్ ఫ్లో) నిరాశపరిచిన నేపథ్యంలో దాని షేరు కూడా గణనీయంగా పడిపోయింది. దీనివల్ల టెక్నాలజీ రంగంలో అధిక విలువలపై పెట్టుబడిదారులు మళ్లీ సందేహాలు వ్యక్తం చేశారు. ఈ పరిణామాలన్నింటి ప్రభావంతో అమెరికా, యూరప్ ప్రధాన స్టాక్ సూచీలు వారాంతానికి నష్టాలతో ముగిశాయి. భారత మార్కెట్ కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. ఇదే సమయంలో అమెరికా ప్రభుత్వం 60కిపైగా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై 10 నుంచి 12.5 శాతం వరకు కొత్త దిగుమతి సుంకాలు అమలు చేయడం ప్రపంచ వాణిజ్యంపై కొత్త అనిశ్చితికి దారితీసింది.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)

24 క్యారెట్లు: రూ. 1,44,930

22 క్యారెట్లు: రూ. 1,32,850

18 క్యారెట్లు: రూ. 1,08,700.

(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

## ఒడిదుడుకులు

వచ్చే వారం కూడా మార్కెట్లు ఒడిదుడుకులతో కొనసాగే అవకాశం కనిపిస్తోంది. మరిన్ని టెక్నాలజీ దిగ్గజాల ఆర్థిక ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎఐపై భారీ పెట్టుబడులు నిజంగా లాభదాయకమా అనే ప్రశ్నకు సమాధానం దొరికే అవకాశం ఉంది. మరోవైపు చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగితే ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయాలు స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేస్తాయి. కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధానాలపై కూడా పెట్టుబడిదారుల దృష్టి నిలుస్తుంది. ముఖ్యమైన దౌత్యపరమైన పరిణామాలు లేదా కంపెనీల నుంచి ఊరటనిచ్చే ఫలితాలు రాకపోతే, ప్రపంచ స్టాక్ మార్కెట్లు సమీప కాలంలో అప్రమత్త ధోరణితోనే పరిమిత పరిధిలో కదిలే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తం మీద రాబోయే వారంలో చమురు ధరలే కీలకంగా మారనున్నాయి. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం సాధారణంగా పెరుగుతుంది. ఇంధనం ఖరీదవడం వల్ల రవాణా, విద్యుత్, తయారీ, వ్యవసాయం వంటి రంగాల ఖర్చులు పెరిగి, ఆ ఖర్చులు చివరకు వినియోగదారులపై పడతాయి. అందుకే పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ఆహారం, నిత్యావసరాలు, సేవల ధరలను కూడా పైకి తోస్తుంది. ఇది ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించి, కేంద్ర బ్యాంకును వడ్డీ రేట్లు పెంచే లేదా కట్టుదిట్టమైన విధానం తీసుకునేలా చేయవచ్చు. భారత్‌లో కూడా చమురు ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం, రూపాయి విలువ పతనం, కరెంట్ అకౌంట్ లోటు వంటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి.

## ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా నూతన కమిటీ

**అధ్యక్షుడిగా బొడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా కమతం యాదగిరి ఎన్నిక**





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని ఎఐటియుసి నూతన అధ్యక్షుడు బొడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించడంతో పాటు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా కమతం యాదగిరి ఎన్నికైనట్లు ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పి. వెంకటయ్య, కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా హసీనా బేగం, ఉపాధ్యక్షులుగా కె. రమేష్, ఎం.లక్ష్మి బాయి, రాజమౌళి, ఎం.ఎస్.మూర్తి, కొమరెల్లి బాబు, ఉప ప్రధాన కార్యదర్శిగా చెట్టుకింది శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా జి.నరసయ్య, ఉమర్ ఖాన్, మల్లేష్ రావు, రవి కిషోర్, ఎన్.శ్రీకాంత్, ఎ.పార్వతి, కోశాధికారిగా పి.రేణుకతో పాటు 44 మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాలకు హెల్ప్‌లైన్

040-24603572 ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే లక్ష్యంతో ప్ర భుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, స మాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను మంత్రి శనివారం హౌ సింగ్ బోర్డు కార్యాలయంలో ప్రారంభించారు. ప్రజలు మధ్యవర్తులను నమ్మకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 04024603572 నెంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని మంత్రి సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ని ర్మాణాలు చేపడుతున్నందున ఆయా నియోజకవర్గాల ప్రజలు తమ ప్రాంతంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్ట ల్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. పథకానికి హైదరాబాద్ క్యూర్ పరిధిలో కనీసం ప దేళ్లుగా నివసిస్తున్న కుటుంబాలు అర్హులని, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారు లేదా కుటుంబ సభ్యుల పేరుపై క్యూర్ పరిధిలో ఇల్లు, ఫ్లాట్ లేదా ప్లాట్ ఉండరాదని, ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తామని చెప్పారు. నిర్మించే ఫ్లాట్ల కంటే అర్హుల సంఖ్య ఎక్కువైతే పారదర్శకంగా లాటరీ విధానంలో కేటాయింపులు చేపడతామన్నారు. రూ.10 వేల ఈఎండిని యుపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని, ఇల్లు కేటాయించకపోతే అదే బ్యాంకు ఖాతాకు మొ త్తం తిరిగి జమ అవుతుందన్నారు. దరఖాస్తు సంఖ్య, మీ సేవ రసీదు, చెల్లింపు రసీదు, మొబైల్ నెంబర్‌ను ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాల ని సూచించారు. లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉం టుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.పి. గౌతమ్, హౌసింగ్ బోర్డు సి.ఈ. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసించండి

☞ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/ జనగామ / రఘునాథపల్లి :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా పూర్తిగా మొండి వైఖరి ప్రదర్శిస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమై కేంద్ర ప్రభుత్వం తన అహంకారపూరిత నిర్ణయాలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తోందని, ప్రజల గొంతును అణచివేయాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జనగామ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న అధ్యక్షత జరుగుతన్నాయి. శనివారం తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా పాల్గొని జాతీయ రాజకీయ పరిస్థితులు వివరించారు. ఈ సందర్భంగా తక్కెళ్లపల్లి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దూరదృష్టిలేని విధానాలు, తప్పుడు ప్రాధాన్యతల వలనే నిరుద్యోగం, ధరల విపరీతంగా పెరిగాయని విమర్శించారు. డిల్లీలో విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా, శాంతియుత విద్యార్థి ఆందోళనపై క్రూరమైన అణచివేతకు నిరసనగా సిపిఐ దేశ వ్యాప్త ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా పత్రాల లీకేజీలతో యువ అభ్యర్థులు నిరాశలో కూరుకుపోయి ఆత్మహత్యలు పాల్పడడం, ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకమని, దీనికి బిజెపి నైతిక బాధ్యత వహించాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామ ఒక్కటే పరిష్కారం కాదని, ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తివేయాలని, పోలీసులు భేషరుతుగా క్షమాపన చెప్పాలని, ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. కేంద్రం తీరును ఎండగడుతూ ఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు చేస్తామని, ఈ పాదయాత్రల సందర్భంగా బిజెపి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 1న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఛలో డిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

### అంతరాలు లేని సమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయం : సిహెచ్ రాజారెడ్డి

అంతరాలు లేని సమసమాజ నిర్మాణమే సిపిఐ ధ్యేయమని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. ప్రస్తుత పెట్టుబడిదారి దోపిడి వ్యవస్థలో పేదలు, ధనికుల మధ్య తారతమ్యం విపరీతంగా పెరిగిపోతుందని, అయినప్పటికీ పాలకులు పేదల అభివృద్ధిని విస్మరించి కార్పొరేట్, పెట్టుబడిదారీ శక్తుల కోసమే పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఒకే దేశంలో ఒకేసారి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజల మధ్య రోజువారి ఆదాయ వ్యత్యాసం వేల రెట్లు ఎక్కువగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు వేల రెట్లు ఎక్కువగా ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు. ఈ క్రమంలో దేశంలోని భూర్జువా రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను విభజించి పాలిస్తూ దోపిడిపై తిరుగుబాటు చేయకుండా అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వామపక్షాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, నాయకలు రావుల సాదనందం, చొప్పరి సోమయ్య, సిహెచ్ మల్లేశం, తోట రమేష్, ఎండి నూర్‌మిష, వడ్లకొండ సుధాకర్, కందుకూరి పాల్గొన్నారు.

## పాదయాత్రల పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల అమలు, పంటలకు గిట్టుబాటు ధర తదితర డిమాండ్లతో ఆగస్టు ఆరు నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. శనివారం పాదయాత్రల పోస్టర్లను సిపిఐ నాయకులతో కలిసి స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ధరల పెరుగుదలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ధరల పెరుగుదలపై ప్రభుత్వం నియంత్రణ ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. దేశంలో మునుపెన్నడులేని రీతిలో నిరుద్యోగం పెరిగిపోయిందని ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలు వట్టిపోతున్నాయని వాటిని పునరుద్ధరించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి దొరికేవిధంగా చర్యలు చేపట్టాలని విద్య, వైద్యం వ్యాపారంగా మారిన తరుణంలో ఉచితంగా ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ కోరుతుందని సురేష్ తెలిపారు. డిలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, కార్మిక హక్కులను పరిరక్షించాలని, దళిత, ఆదివాసీలపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్ధరించాలని ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సురేష్ తెలిపారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్ కెజానిమియా, ఏపూరి లతాదేవి, మహ్మద్ సలాం, బిజి క్లెమెం ట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా సమితి సభ్యులు జ్వాలా నర్సింహారావు పాల్గొన్నారు.

## రాజ్యాధికారంలో మహిళలదే పైచేయి కావాలి

తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/కోదాడ:** మహిళలపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల్లో మహిళ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. శనివారం చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో నిర్వహించిన మహిళ సమాఖ్య మండల మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలు, రాజ్యాధికారంలో వెనుకబడి ఉన్నారని అన్నారు. మహిళ రిజర్వేషన్ల కోసం జాతీయ మహిళ సమాఖ్య అనేక సంవత్సరాల నుండి కృషి చేస్తుందన్నారు. ఈనెల 27న హుజూర్‌నగర్ పట్టణంలో నిర్వహించే మహిళ సమాఖ్య జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా మహాసభల అనంతరం సూర్యాపేటలో జరిగే రాష్ట్ర మహిళ సమాఖ్య మహాసభలకు తరలిరావాలన్నారు. రెమిడా లజయసుధ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటమ్మ, దేవరం మల్లేశ్వరి, మండవ జయమ్మ, వెంకటేశ్వర్లు, లలిత, రమేష్ పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటిని ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
ఆదివారం
26-07-2026
www.prajapaksham.in
జనరల్
STATE & REGIONAL NEWS

# లక్ష్యాలకు తగ్గట్లుగా ఆదాయం రాబట్టాలి

- రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్ : బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. లక్ష్యాలకు తగ్గట్లుగా ఆదాయం రాబట్టేలా ప్రణాళిక రూపకల్పన చేసుకోవాలని సూచించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో డిప్యూటీ సిఎం అధ్యక్షతన 'ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం' (రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ) ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు, ఐటిపరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై అధికారులతో లోతుగా మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ 2026–27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలన్నారు. ముందుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ (టైమ్ లైన్) ప్రకారం అన్ని శాఖల అధికారులు ఆదాయ పెంపు కోసం శ్రమించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిపుష్టి కోసం అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పరిశ్రమలు, ఎక్సైజ్, మైనింగ్, రెవెన్యూ, రవాణా, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, కమర్షియల్ తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతిపై సమీక్షించారు. నగర పరిధిలో 'ఉప్పల్ భాగాయత్' తరహాలోనే పారదర్శక విధానాలను అవలంబిస్తూ, మరిన్ని ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ చేపట్టేందుకు ఉన్న అవకాశాలను తక్షణమే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాల వారీగా ఉన్న ప్రభుత్వ భూసంపదను గుర్తించి, ల్యాండ్ పూలింగ్ చేయదగిన సాధ్యాసాధ్యాలను అన్వేషించాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, పారిశుద్ధ్య రంగాలకు పెద్దపీట

- రూ.2,586.67 కోట్ల బడ్జెట్ అంచనాలకు ఆమోదం



ప్రజాపక్షం/హైదరాబాద్: మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా నిర్వహించిన 6వ సాధారణ స్థాయీసంఘం సమావేశం శనివారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఎంఏయుడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎంఎంసి స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 32 కీలక అజెండా అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి ఆమోదం తెలిపారు. రూ.2,586.67 కోట్ల బడ్జెట్: 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను ఎంఎంసి పరిధిలో మౌలిక వసతుల పెంపునకు రూ.2,586.67 కోట్ల బడ్జెట్ అంచనాలను సిద్ధం చేశారు. ఆనంద్ నగర్ జంక్షన్ వద్ద 4లేన్ ఫ్లైఓవర్, హస్తినాపురం, బిఎన్‌రెడ్డి నగర్ సాగర్ కాంప్లెక్స్ జంక్షన్‌ల మీదుగా 6లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణానికి ఆమోదముద్ర వేశారు. రోజుకు 500 టన్నుల సామర్థ్యంతో సి అండ్ డి వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్, 9 ఎలక్ట్రిక్ రోడ్ స్వీపింగ్ యంత్రాలు, 15 మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్‌ఎఫ్) కేంద్రాలు, 7 సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, పీర్జాదిగూడలో సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఎంఎంసి పరిధిలోని 3 జోన్‌లలో గుర్తించిన 6 పార్కుల నిర్వహణ బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జి) అప్పగించాలని నిర్ణయించారు. యాప్రాల్ నాగిరెడ్డి చెరువు కాప్రా చెరువుల అనుసంధాన డ్రెయిన్, కౌకూర్ బాక్స్ డ్రెయిన్ పనులతో పాటు పెద్ద అంబర్‌పేట్, మచ్చబొల్లారం, కుంట్లూర్ తదితర ప్రాంతాల్లో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి ఆమోదం లభించింది.

## అక్రమ నిర్మాణాలకు భారీ జరిమానాలే పరిష్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్‌లో అడ్డగోలుగా పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. నిర్మాణాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని వ్యాఖ్యానించింది. అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరణ పేరుతో ప్రోత్సహిస్తే భవిష్యత్తులో హక్కులేని స్థలాలను ఆక్రమించి భవనాలు నిర్మించే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. ఇలాంటి నిర్మాణాలపై భారీ జరిమానాలు విధించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. రంగారెడ్డి జిల్లా నెక్నాంపూర్‌కు చెందిన అరుణా అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. క్రమబద్ధీకరణ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో కోర్టుల నుంచి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకుని అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. 100 నుంచి 200 చదరపు గజాల స్థలాల్లో పరిమిత నిర్మాణాలకే క్రమబద్ధీకరణ అవకాశం ఉంటుందని, బహుళ అంతస్తుల భవనాలకు అది వర్తించదని స్పష్టం చేశారు. ఈ కేసులో పిటిషనర్ రూ.2 లక్షలను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు, మరో రూ.లక్షను హైకోర్టు న్యాయవాదుల సంక్షేమ సంఘానికి చెల్లించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగించారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పిజి ప్రవేశాలు ప్రారంభం

- ఆగస్టు 7 వరకు ట్యూషన్ ఫీజు చెల్లింపునకు అవకాశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి అండర్ గ్రాడ్యుయేట్ (యుజి), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) కోర్సుల ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైనట్లు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రవేశాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ డిగ్రీ (బిఏ, బికాం, బిఎస్‌సి), పిజి కోర్సులు, ఎంబిఏ, ఎంబిఏ (హెచ్‌హెచ్‌సిఎం), ఎంఎల్‌ఐఎస్‌సితో పాటు పలు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పిజి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, అర్థశాస్త్రం, చరిత్ర, ప్రభు త్వ పాలనా శాస్త్రం, రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్రం, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్లో ఎంఏ, ఎంకాం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, పర్యావరణ శాస్త్రం, గణితశాస్త్రం, అనువర్తిత గణితశాస్త్రంలో ఎంఎస్‌సి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగిన వారితో పాటు పదో తరగతి అనంతరం రెండేళ్ల డిప్లొమా, ఐటిఐ, పాలిటెక్నిక్, ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. కోర్సుల అర్హతలు, ఫీజు వివరాలు, ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని యూనివర్సిటీ వెబ్‌సైట్‌లను www.braouonline.in లేదా, www.braou.ac.in లో తెలుసుకోవచ్చన్నారు. సందేహాల నివృత్తి కోసం సమీప అధ్యయన కేంద్రాన్ని సంప్రదించవచ్చని, అలాగే యూనివర్సిటీ హెల్ప్ డెస్క్ నెంబర్లు 04023680333, 04023680555 లేదా టోల్‌ఫ్రీ నెంబర్ 18005990101ను సంప్రదించాలని సూచించారు. ప్రవేశ రుసుమును నెట్‌బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు లేదా టిఎస్ ఆన్‌లైన్ ద్వారా చెల్లించే సౌకర్యం ఉందని తెలిపారు. ట్యూషన్ ఫీజు చెల్లించడానికి చివరి తేదీ ఆగస్టు 7 అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. విజయకృష్ణారెడ్డి, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వై. వెంకటేశ్వర్లు, వి.సి. ఓఎస్‌డి ప్రొఫెసర్ రవీంద్రనాథ్ సోలమన్, ఎస్‌డి అండ్ విటిసి డైరెక్టర్ ప్రొఫెసర్ పల్లవి కాబ్డే పాల్గొన్నారు.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సిద్ధం

- ఏర్పాట్లపై ఉన్నతస్థాయి సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలను ముమ్మరం చేసింది. పోటీల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (క్రీడలు) జయేశ్ రంజన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పోటీల నిర్వహణ, క్రీడా మౌలిక సదుపాయాల సంసిద్ధత, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, క్రీడాకారుల రవాణా, వసతి, లాజిస్టిక్స్, భద్రత తదితర కీలక అంశాలపై అధికారులతో ఆయన విస్తృతంగా చర్చించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను దేశానికి ఆదర్శంగా నిలిచేలా నిర్వహించేందుకు ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మయాంక్ శ్రీవాస్తవ మాట్లాడుతూ దేశంలో క్రీడా సంస్కృతిని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేయడం, అన్ని క్రీడలకు పటిష్ఠమైన వ్యవస్థను రూపొందించడం, భారతదేశాన్ని ప్రపంచ క్రీడా శక్తిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోని బాలా దేవి మాట్లాడుతూ ఖేలో ఇండియా మార్గదర్శకాలు, ప్రమాణాలకు అనుగుణంగా యూత్ గేమ్స్–2026ను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అన్ని విధాలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఏఐ అధికారులు అమర్ జ్యోతి, మధు హర్ష, గోపాల్ కంద్‌పాల్, మోహిత్‌తో పాటు స్పోర్టర్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు డాక్టర్ రవి తేజ, రవీందర్, శ్రీనివాస్, సురేష్ కాలేరు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్– 2026 విజయవంతమైన నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

## బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ వ్యవస్థాపక దినోత్సవం

- పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయానికి ఆర్వో వాటర్ ప్లాంట్ అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ నార్త్ రీజినల్ కార్యాలయం పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, ఎయిర్ ఫోర్స్ స్టేషన్ (ఎఎఫ్ఎస్) బేగంపేట్‌కు ఆర్వో తాగునీటి శుద్ధి ప్లాంట్‌ను అందజేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా 119వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ నార్త్ రీజియన్ రీజినల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ సనిల్ కుమార్ బి, డిప్యూటీ రీజినల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అభిషేక్ భారతి, వివిధ శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఆర్. వెంకటేశ్వర్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, బ్యాంక్ ఆఫ్ బరోడా అందించిన ఆర్వో వాటర్ ప్లాంట్ విద్యార్థులకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంది. సమాజ సంక్షేమం కోసం బ్యాంక్ చేపడుతున్న సామాజిక బాధ్యత కార్యక్రమాలను అభినందించింది. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ 'వన్ టీమ్ – వన్ గోల్ – వన్ బ్యాంక్' అనే నినాదంతో దేశ నిర్మాణంలో భాగస్వామిగా నిలుస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.

## కాలేయ వ్యాధులపై అవగాహన లక్ష్యంతో... 'లాస్ట్ వార్నింగ్', 'ఆఖరి హెచ్చరిక' పుస్తకాల ఆవిష్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలో వేగంగా పెరుగుతున్న కాలేయ వ్యాధులను నివారించాలంటే ప్రజల్లో ముందస్తు అవగాహన అత్యంత అవసరమని ప్రముఖులు పేర్కొన్నారు. కాలేయ వ్యాధుల లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా ప్రాణాంతక పరిస్థితులను నివారించవచ్చని సూచించారు. ఈ లక్ష్యంతో ప్రముఖ హెపటాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్. సోమశేఖర్ రావు రచించిన 'లాస్ట్ వార్నింగ్' (ఆంగ్లం), 'ఆఖరి హెచ్చరిక' (తెలుగు) పుస్తకాలను శనివారం యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీలో ఘనంగా ఆవిష్కరించారు. భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ శభరి బైరెడ్డి, యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు సంయుక్తంగా ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య రంగ ప్రముఖులు, ఆరోగ్య నిపుణులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారతదేశంలో ఫ్యాటీ లివర్, వైరల్ హెపటైటిస్, మద్యపాన సంబంధిత కాలేయ వ్యాధులు, లివర్ సిర్రోసిస్ వంటి సమస్యలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని తెలిపారు. అయితే సరైన అవగాహన, సమయానికి వైద్య పరీక్షలు, ఆరోగ్యకరమైన జీవనశైలి ద్వారా ఈ వ్యాధులను చాలా వరకు నివారించవచ్చని వివరించారు. డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్ రావు రచించిన ఈ రెండు పుస్తకాలు సాధారణ ప్రజలు కూడా సులభంగా అర్థం చేసుకునే భాషలో రూపొందించబడ్డాయి. ఈ సందర్భంగా డాక్టర్ కె.ఎస్.సోమశేఖర్ రావు మాట్లాడుతూ, 'కాలేయం నిశ్శబ్దంగా పనిచేసే అవయవం. చాలా కాలేయ వ్యాధులు తీవ్ర దశకు చేరుకునే వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. డాక్టర్ కె.ఎస్. సోమశేఖర్ రావు హైదరాబాద్‌కు చెందిన సీనియర్ హెపటాలజిస్ట్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్. ఆయన స్థాపించిన 'సేవ్ ది లివర్ ఫౌండేషన్' ద్వారా కాలేయ వ్యాధుల నివారణ, ఉచిత ఆరోగ్య శిబిరాలు, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నారు.

## ఎస్‌సి వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లుల కమిటీల్లో మంత్రి అడ్లూరి

ప్రజాపక్షం/హైదరాబాద్ : సామాజిక న్యాయం, సమాన అవకాశాల దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్‌సి వర్గీకరణ అంశంపై సిఫారసులు చేసే ఉన్నతస్థాయి కమిటీతో పాటు రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు–2026 పై అధ్యయనం చేసే కేబినెట్ సబ్ కమిటీలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను సభ్యునిగా నియమించింది. ఈమేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎస్‌సి వర్గీకరణపై అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయబద్ధమైన సిఫారసులు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఉన్నత విద్యా సంస్థల్లో వివక్షకు తావులేకుండా విద్యార్థులకు రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ రెండు కమిటీల్లో సభ్యత్వం ద్వారా సామాజిక సంక్షేమ విధానాల రూపకల్పనలో తన బాధ్యత మరింత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు.

## కెటిఆర్ జన్మదినం సందర్భంగా.. రెండు డాక్యుమెంటరీలు, పాట విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.టి.రామారావు 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రెండు డాక్యుమెంటరీలు, ఒక ప్రత్యేక పాటను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గాదరి కిషోర్, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు, బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, గాదరి బాలమల్లు, బిఆర్‌ఎస్‌వి అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కిషోర్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వేలాది మంది యువత ఆందోళన చేస్తున్నారని, యువత ఆందోళనలకు మద్దతుగా కెటిఆర్ తన పుట్టిన రోజు వేడుకలను రద్దు చేసుకుని నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. దేశంలో వ్యవస్థలు విఫలమయ్యాయని, కెసిఆర్ మార్గదర్శకంలోనే తామంతా ముందుకు సాగుతున్నామన్నారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని, వారిని అవమానించే వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. యువతను 'కాక్రోచ్‌లుగా' పోల్చిన వ్యాఖ్యలను ఖండి స్తూ, అదే యువత తమ పోరాట స్ఫూర్తిని చాటుతోందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని చెప్పే సిఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీలో జరిగిన పరిణామాలపై స్పందించకపోవడం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా నీట్ పేపర్ లీక్ అంశంపై కనీసం హైదరాబాద్‌లో నిరసన తెలియజేయలేదన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మరో రూ.99.40 కోట్లు

45 శాతం పనులు పూర్తి.. మొత్తం రూ.249 కోట్లకు చేరిన నిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్ల నిధులు మంజూరు చేస్తూ శనివారం అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో 2023–24 బడ్జెట్‌లో రూ.50 కోట్లు, 2024–25 బడ్జెట్‌లో రూ.100 కోట్లు చొప్పున నిధులు విడుదల కాగా, తాజాగా మంజూరైన మొత్తంతో కలిపి రాజన్న ఆలయ అభివృద్ధి కోసం ఇప్పటివరకు మొత్తం రూ.249 కోట్లు విడుదలయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఇప్పటికే రూ.150 కోట్లతో సుమారు 45 శాతం నిర్మాణ పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. తాజాగా మరో రూ.99 కోట్లు అందుబాటులోకి రావడంతో మిగిలిన పనులు మరింత వేగవంతం కానున్నాయి. నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## సైబరాబాద్ లోగో డిజైన్ పోటీలకు ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయుఎం) భాగస్వామ్యంతో అధికారిక లోగో రూపకల్పన పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పోటీలో విద్యార్థులు, ఆర్కిటెక్టులు, గ్రాఫిక్ డిజైనర్లు, విజువల్ ఆర్టిస్టులు పాల్గొనవచ్చు. సుపరిపాలన, ఆవిష్కరణ, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి ప్రతిబింబించేలా లోగో డిజైన్ ఉండాలి. డిజైన్‌తో పాటు 250 పదాలకు మించకుండా దాని ప్రాధాన్యతను వివరించాల్సి ఉంటుంది. ప్రథమ బహుమతిగా రూ.20,000, ద్వితీయ రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.10,000 అందజేస్తారు. ఎంట్రీల సమర్పణకు చివరి తేదీ వచ్చేనెల 5గా నిర్ణయించారు. ఆసక్తి గలవారు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సిఎంసి అధికారులు తెలిపారు.

## 'వాక్ ఫ్రీ' డ్రైవ్... సిఎంసిలో 347 ఆక్రమణలు తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : పాదచారుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) చేపట్టిన 'వాక్ ఫ్రీ' కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. సిఎంసి పరిధిలోని 14 ప్రధాన ప్రాంతాల్లో మొత్తం 18.8 కిలోమీటర్ల మేర సాగిన ఈ డ్రైవ్‌లో 347 ఆక్రమణలను తొలగించారు. జోన్‌ల వారీగా శేరిలింగంపల్లిలో 123, కూకట్‌పల్లిలో 93, కుత్బుల్లాపూర్ జోన్‌లో 167 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజా స్థలాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రతి శనివారం ఈ డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగుతుందని సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన తెలిపారు.



## 57.70 శాతానికి మించని ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ

- స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)కు ఇక మిగిలింది పది రోజులే..!
- ఎన్యూమరేషన్ ఫారాలను బిఎల్‌ఒలకు అందజేయని వారి ఓటు గల్లంతే
- విధిగా ఫారాలను అందజేయాలి : కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) (ఎస్ఐఆర్)ప్రక్రియకు మరో పది రోజులు గడువు మాత్రమే మిగిలి వుంది. అయినప్పటికీ ఎక్కువ మంది ఓటర్లుకు ఇప్పటికీ ఎన్యూమరేషన్ ఫారాలు చేరకపోవడం, తీసుకున్న వారు సైతం తిరిగి బూత్ లెవల్ ఆఫీసర్(బిఎల్‌ఒ)లకు అందజేయక పోవడం సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. దీంతో జిల్లాలో ఇప్పటివరకు ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియ 57.70 శాతం మించలేదు. ఆశించిన దానికంటే అతి తక్కువ మ్యాపింగ్ నమోదవుతుండటంపై ఇటు ఎన్నికల అధికారుల్లోనే కాదు అటు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల్లోనూ అలజడి మొదలైంది. మెజార్టీ ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే వచ్చే ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థుల భవితవ్వం ప్రశ్నార్థకంగా మారనుంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాల్సిందిగా ఆయా పార్టీల పోలింగ్ ఏజెంట్లకు రాష్ట్ర,జిల్లా ఎన్నికల కమిషన్ పదేపదే సూచిస్తుంది. ఈ మేరకు వారికి శిక్షణ సైతం ఇచ్చింది. బిజెపి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని.. తమ పార్టీ ఓటు బ్యాంకు అనుకున్న ప్రతి ఒక్క ఓటను డిజిటలైజేషన్ చేయిస్తుంది. అధికార పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలన్నీ కొంత వరకు ఓటర్లను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి. పదిరోజులపాటు అన్ని పనులు మానుకుని సర్‌ను సక్సెస్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ఆ పార్టీ ఎంపి, ఎంఎల్‌ఎలను, ఎమ్మెల్సీలతోపాటు పార్టీ క్యాడర్ ను ఆదేశించారు.

**అర్బన్‌లో భారీగా తగ్గనున్న ఓట్లు**

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 36,99,743 మంది ఓటర్లు ఉండగా, వీరిలో ఇప్పటి వరకు 21,34,632 మంది ఓట్లు మాత్రమే డిజిటలైజేషన్ పూర్తి అయ్యాయి. మరో 13,34,277 ఓట్ల డిజిటలైజేషన్ ప్రక్రియ ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. 2,30,834 మంది ఓటర్లు ఇప్పటి వరకు తమ ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి బిఎల్‌ఒలకు తిరిగి ఇవ్వలేదు. ఎల్‌బి నగర్‌లో అత్యల్పంగా 45.95 శాతం మాత్రమే నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ ఉన్న మెజార్టీ ఓటర్లు సొంతూళ్లపై మక్కువ చూపుతుండటమే ఇందుకు కారణమని తెలిసింది. గతంతో రెండు చోట్ల ఓటు వేశారు. ప్రస్తుతం ఏదో ఒక చోట మాత్రమే ఓటు హక్కును పొందే అవకాశం ఉండటంతో మెజార్టీ ఓటర్లు సొంతూళ్లను ఎంచుకుంటున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా 83.84 శాతం పూర్తిగా, శేరిలింగంపల్లితోపాటు ఎల్‌బినగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్ వంటి అర్బన్ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉంది. మహేశ్వరం అత్యధికంగా 45,821 మంది, రాజేంద్రనగర్‌లో 30,676 మంది, శేరిలింగంపల్లిలో 32,083 మంది, చేవెళ్లలో 31,466 మంది, ఇబ్రహీంపట్నంలో 27,150, ఎల్‌బినగర్‌లో 31,764 మంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉంది.

**ఓటు హక్కు మాత్రమే కాదు.. బాధ్యత కూడా**
**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**

ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఓటు. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే అత్యంత కీలకమైన ప్రక్రియ ఎన్నికలు. అలాంటి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలంటే, అర్హుడైన ప్రతి పౌరుడు తన పేరును ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ)కు అందజేయాలి. నిర్దేశించిన గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని పక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సంబంధిత ఓటరు జాబితా నుండి ఓటరు పేరు తొలగించే ప్రమాదం ఉంది. ఒక్కసారి పేరు తొలగించబడితే, తరువాత మళ్లీ నమోదు చేసుకోవడానికి అధనపు ప్రక్రియను అనుసరించాల్సి రావచ్చు. అప్పటివరకు జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చు. విలువైన హక్కును నిర్లక్ష్యం చేయ్యొద్దు. ఎన్యూమరేషన్ ఫారం కేవలం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదు, కుటుంబ బాధ్యత కూడా. ప్రతి ఒక్కరూ స్పందిస్తేనే జిల్లాలో వందశాతం లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుంది.

**రంగారెడ్డి జిల్లాలో ఎన్యూమరేషన్ ఇలా**

| నియోజకవర్గం | డిజిటలైజేషన్ |
|---|---|
| ఎల్ బి నగర్ | 45.95 శాతం |
| మహేశ్వరం | 50.18 శాతం |
| శేరిలింగంపల్లి | 50.88 శాతం |
| రాజేంద్రనగర్ | 51.94 శాతం |
| ఇబ్రహీంపట్నం | 66.31 శాతం |
| చేవెళ్ల | 76.37శాతం |
| షాద్‌నగర్ | 81.82 శాతం |
| కల్వకుర్తి | 83.84 శాతం |



## నూతన ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు సిపిఐ నాయకుల సన్మానం

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను శనివారం సిపిఐ స్థానిక నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జీవించేలా పోలీసులు, ప్రజా సంఘాలు పరస్పర సహకారంతో పనిచేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ఎఐటియుసికార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, లెనిన్ నగర్ కమిటీ కార్యదర్శి సాయిలు, కోశాధికారి సదానంద్, యువజన సంఘం నాయకులు ప్రవీణ్, వంశీ, కీర్తి, శాఖ కార్యదర్శులు సహదేవ్‌రెడ్డి, వెంకటేష్, మల్లేష్, రమేష్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



## సార్ పై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/దుండిగల్:** 045కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో, జీడిమెట్ల సర్కల్ 55 లో బాగంగా ఓటర్లు లో చైతన్యం తీసుకొని రావడానికి, పారిశుధ్యం తడి చెత్త పొడి చెత్త పై కళా బృందాల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 25.07.2026 (శనివారం) ఉదయం. 7:30 గం.లకు చింతల్ లోని యల్లమ్మ టెంపల్ దగ్గర మరియు సాయంత్రం 6:00 గంటలకు పద్మ నగర్ రింగ్ రోడ్ వద్ద కళా బృందాల ద్వారా ఓటర్లు ను మరియు ప్రజలను చైతన్యపరిచారు.



## డంపింగ్ యార్డు సదస్సుకు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం (26వ తేదీ) స్వర్ణాంధ్ర, డి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆరోగ్య భద్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు హాజరు కావాల్సిందిగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఆయన తనయుడు మహేందర్ రెడ్డి లను బిఆర్ఎస్ నాయకులు బాషవోని కొండల్ ముదిరాజ్, మాజీ మేయర్ మేకల కావ్య, పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక మీథేన్ వాయువును విడుదల చేస్తున్న 4వ అతిపెద్ద కేంద్రంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు తొలగింపు పోరాటానికి తమ పూర్తి మద్దతుఉంటుందని ప్రకటిస్తూ, సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. గతంలో ఈ సమస్యపై అసెంబ్లీలో మాట్లాడటంతో పాటు, సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డి గుర్తు చేశారు.



## ఎస్‌జిఎఫ్ మేడ్చల్ జిల్లా సెక్రటరీగా అరుణజ్యోతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా అరుణజ్యోతిని నియమిస్తు జిల్లా విద్యాధికారి రేణుకా దేవి నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. జడ్పిహెచ్ఎస్ జీడిమెట్ల ఫిజికల్ డైరక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న అరుణజ్యోతి ఎస్‌జిఎఫ్ మేడ్చల్ జిల్లా సెక్రటరీగా నియామకం కావడం పట్ల పలువురు డైరక్టర్లు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన జిల్లా విధ్యాధికారికి, డైరక్టర్లకు ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎం ప్రభాకర్, మాజి కార్యదర్శి కిష్టయ్య, ఫిజికల్ డైరక్టర్‌లు గొనె కవితారాణి, గొనె మదన్‌మోహన్‌రెడ్డి, గుర్రం సత్తిరెడ్డి, నాగరాజు, వివిధ పాఠశాలల ఫిజికల్ డైరక్టర్లు, పిఇటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సర్కారు వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

### స్పీకర్ ప్రసాద్‌కుమార్




**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ, చేవెళ్ల ఎంపి కొండవిశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి స్పీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఒక్కో మెడికల్ విద్యార్థి విద్య కోసం రాష్ట ప్రభుత్వం డెబ్బై లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వ నియామకాల వల్ల ప్రభుత్వ ఉద్యోగం కల్పించడం జరిగిందన్నారు. ఇంత చేసినా ప్రభుత్వానికి మంచిపేరు రావాలంటే వైద్య అధికారులు అంకితభావంతో పనిచేయాలని సభాపతి తెలిపారు. విభాగాల అధిపతులు, హైదరాబాద్ నుండి రోజూ వచ్చి పోవడం కాకుండా స్థానికంగా ఉంటే ఎక్కువ సమయం వైద్య సేవలు అందించవచ్చని అన్నారు. మెడికల్ కాలేజీ అందుబాటులో ఉందని కాలేజీ అధ్యాపకులతో పాటుగా హాస్పిటల్ హెచ్‌ఓడిలు కూడా తమ అనుభవాలను విద్యార్థులకు నేర్పించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అధికంగా వచ్చేది పేదలు మాత్రమేనని దీన్ని దృష్టిలో ఉంచుకొని వైద్యాధికారులు పనిచేయాలని అన్నారు. వికారాబాద్ చుట్టూ గ్రామాలు ఎక్కువ, ఇక్కడ వైద్యం అందకపోతే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందనీ తెలిపారు. పెద్ద పెద్ద జబ్బులకు పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే ఖర్చులు తట్టుకోలేక ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితిలు ఉంటాయని అన్నారు. ప్రభుత్వం పేదలకోసం ప్రభుత్వాసుపత్రులలో అన్ని రకాల టెస్టులు, చికిత్సలు, ఆపరేషన్లు చేయడానికి అవసరమైన పరికరాలు, వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని సభాపతి అన్నారు. ప్రభుత్వం వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి బిల్డింగ్‌లు, పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది నాణ్యమైన వైద్యం చేసి రోగులకు వ్యాధి నయం అయితేనే సర్కారు వైద్యంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు.

మౌలిక వసతులు కల్పించడం మా బాధ్యత అయితే మంచి చికిత్స అందించడం వైద్యుల బాధ్యత అన్నారు. వికారాబాద్ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న వంద పడకల వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ హాస్పిటల్‌ను 30కోట్ల రూపాయలతో 330 పడకలు పెంచి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. 50బెడ్ల క్రిటికల్ కేర్ యూనిట్ కూడా త్వరలో అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. వైద్య విద్యార్థులు అందుబాటులో ఉంటారు కావున మెరుగైనవైద్య సేవలు అందించవచ్చని తెలిపారు. ముఖ్యంగా యాక్సిడెంట్లు అయినప్పుడు మొదటి గంట చాలా ముఖ్యమని గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తే బతికించే అవకాశం ఉంటుందని.. కాబట్టి డాక్టర్లు, సిబ్బందిఅప్రమత్తంగా ఉండాలని ఇందుకు 24గంటలు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. అంబులెన్స్ ఎప్పుడు కూడా వర్కింగ్ కండిషన్‌లో ఉంచాలని, సమాచారం రాగానే నిమిషంలో బయలుదేరే విధంగా చూసుకోవాలని తెలిపారు. హాస్పిటల్ కు అవసరమైన నిధులను మంజూరు చేయిస్తామని, రోగులు హాస్పిటల్ నుంచి తిరిగివెళ్ళేటప్పుడు నవ్వుతూ వేళ్లే విధంగా అందరూ సేవలను అందించాలని ఆకాంక్షించారు.

చేవెళ్లపార్లమెంట్ సభ్యులుకొండ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రజలకు విశ్వాసం కలిగే విధంగా వైద సేవలు అందించాలన్నారు. ప్రజలు పైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో మంచి ఫలితాలు సాధించే దిశగా వైద్యాధికారులు, అంకితభావంతో పనిచేయాలని ఎంపీ సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలంది స్తూ గౌరవాన్ని సంపాదించుకోవాలని, వైద్యాధికారులకు సూచించారు.

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగాకొడంగల్, వికారాబాద్‌లోని జిల్లా ఆసుపత్రులు ఉన్నాయి. కాబట్టి ప్రజలకు మెరుగైన వైద్య సేవ లు అందించే అవకాశం ఉందని అయన పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఏమైనా అవసరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అదే విధంగా సిబ్బంది కొరత ఉంటే కారుణ్య నియామకాల ద్వారా ఖాళీగా ఉన్న పోస్టులను నియమించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ సంకల్ప్ కార్యక్రమంలో భాగంగా మాతా శిశు సంరక్షణ సేవలు అందిస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో 100శాతం ప్రసవాలు చేపడుతూ, నవజాత శిశువుల మరణాలు తగ్గే విధంగా చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభోద్ కుమార్, ఆనంద్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నా రు.

**రాజీనామా అంటే తప్పుకాదు**

రాజీనామా అంటే తప్పు ఒప్పు అని కాదు, విద్యార్థుల ఒత్తిడికి, ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ రాజీనామాచేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రిపై ఎంపీ కొండవిశ్వేశ్వర్‌రెడ్డి స్పందించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా అంటే ఒక మెట్టు దిగినట్టు కాదు రెండు మెట్లు పైకి ఎక్కిన ట్లు అని ఎంపి అన్నారు. శుక్రవారం బిజెపి, కాంగ్రెస్ ఎన్‌టిఆర్ చౌరస్తాలో కొట్టుకోవడంతో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎసిపి ఆదేశాల మేరకు ధర్నా కార్యక్రమం విరమించడం జరిగిందన్నారు. బిజెపి వారిపై దాడిచేసిన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపిని కలిశారు. ఈ కార్యక్రమంలో ప్రహ్లాద్, మాధవ రెడ్డి, వడ్లనందు, పరమేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర విద్యామంత్రి రాజీనామా ఉద్యమం ఆగదు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసినప్పటికీ పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు స్పష్టం చేశారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇర్ఫాన్ అలీ సూచనలతో ఘట్‌కేసర్ మైనార్టీ నాయకులు శనివారం నెక్లెస్ రోడ్‌లో నిర్వహించనున్న కొవ్వొత్తుల ప్రదర్శనకు బయలుదేరారు. సాయంత్రం 6:30 గంటలకు నెక్లెస్ రోడ్‌లో జరగనున్న కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొని, కేంద్ర ప్రభుత్వంపై తమ నిరసనను తెలియజేయనున్నట్లు నాయకులు తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసినా తమ మిగిలిన డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ కాజా మోయినుద్దీన్, మాజీ టిపిసిసి సామాజిక మాధ్యమాల సమన్వయకర్త మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడు ఫారుక్, మహమ్మద్ రఫీఅద్దీన్, రహమాన్, ముక్తార్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను కలిసిన శంకర్ నాయక్



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలోనీ తాండ 2లో ఆగిపోయిన అభివృద్ధి పనులను వెంటనే చెప్పటాలని డ్రైనేజి వ్యవస్థ మెరుగుపడిందనీ, రోడ్లు పెండింగ్ ఉందని, అలాగే తాండ నుండి ఎక్కడికి వెళ్లినా ఒక్కటే రోడ్డు ఉండటంతో తాండ ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ తాండ 2నుండి హెచ్ఎంటీ సొసైటీ మీదుగా తాండ 1 వరకు ఉన్న సర్వీస్ రోడ్డు వరకు రోడ్డు శాంక్షన్ చేయాలనీ జోనల్ కమీషనర్ పింకేష్ కుమార్ ను కోరారు. కౌన్సిలర్ గా ఉన్న సమయంలో 1 కోటి 80 లక్షలు వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ తీర్మానం పొందిన పను లు ప్రభుత్వం మారిన తరువాత అవి రద్దు చేసారని డ్రైనేజీ పూర్తి చేసుకున్న వెంటనే రోడ్డు వేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జోనల్ కమీషనర్ రాతపూర్వకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రవీందర్ నాయక్, అమర్ సింగ్ నాయక్, హెచ్ఎంటీ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్వాసన డివైస్ కలెక్షన్ పేరిట ఎంఎంసి వినూత్న ప్రక్రియ ప్రారంభం

- వినియోగంలో లేని దేవతా సంబంధిత వస్తువుల సేకరణకు ఆలయాల ఎంపిక
- ఉప్పల్‌లో ప్రారంభించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి





**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో వినియోగంలో లేని దేవతల ఫొటోలు, చిత్రపటాలు, ఫ్రేమ్‌ల లాంటి పవిత్ర వస్తువులను తీసుకొని వెళ్లి సనాతన, సంప్రదాయపద్ధతిలో రీసైక్లింగ్ చేసేందుకు గాను ప్రాజెక్టు ఉద్వాసన డివైస్ కలెక్షన్ పేరిట వినూత్న ప్రక్రియకు మల్కాజిగిరి నగర పాలక సంస్థ (ఎంఎంసి) శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్‌బినగర్ జోన్లలో ఒక్కో ఆలయాన్ని ఎంఎంసి అధికారులు ఎంపిక చేసి ఆయా ప్రాంతాల్లో ఉండే ప్రజలు తమ ఇళ్లల్లో వినియోగం లేనటువంటి ఫొటోలు చెత్తాచెదారాల మధ్య, చెరువులు, నాలాలు చెట్ల పక్కన వంటి బహిరంగ ప్రాంతాల్లో పడేయకుండా ఆలయాల్లో ఇచ్చే విధంగా ఏర్పాటు చేసారు. ఈ విధంగా ఆయా ప్రాంతవాసులు ఎంపిక చేసిన ఆలయానికి తీసుకొని వచ్చిన పాత దేవతా ఫొటోలన్నిటిని ఎంఎంసి సిబ్బంది నిత్యం చెత్తను తీసుకొని వెళ్ళే గార్బేజి వాహనాల్లో కాకుండా ప్రత్యేక వాహనాల్లో సేకరించి రీసైక్లింగ్‌కు తీసుకెళతారు. మల్కాజిగిరి నగర పాలక సంస్థ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఈ వినూత్న ఉద్వాసన డివైస్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఉప్పల్ జోన్‌కు గాను ఎంపిక చేసిన స్వరూప్‌నగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ కరిగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాతో కల్సి ప్రత్యేక పూజలు నిర్వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కమిషరేట్ పరిధిలోని ఎల్‌బి నగర్ జోన్‌లో కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం, మల్కాజిగిరి జోన్‌లో నేరేడ్‌మెట్ పాత పోలీస్ స్టేషన్ సమీపంలోని మూడుగుళ్ల ఆలయాన్ని వినియోగంలో లేని దేవతా విగ్రహాలు, చిత్రపటాలు సేకరించేందుకు ఎంపిక చేసామన్నారు. ఇక నుండి ఎవరూ తమ ఇళ్లల్లో ఉండే వినియోగంలో లేని దేవతలకు సంబంధించిన వస్తువులను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ఎంపిక చేసిన ఆలయాలకు తీసుకొని వచ్చి ఇవ్వటం ద్వారా పర్యావరణ, జలవనరుల పరిరక్షణలో భాగస్వాములు అవుతూ నగర పరిశుభ్రతకు తోడ్పడాలని కోరారు.



## సర్ ఫారాలను బిఎల్‌ఒలకు అందజేయాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సర్ ఫారాలను సక్రమంగా పూర్తిచేసి బిఎల్‌ఒలకు అందజేయాలని ఎఇఆర్‌ఒ మధుసూధన్‌రెడ్డి అన్నారు. శనివారం తూంకుంటలో ఎఇఆర్‌ఒ మధుసూధన్‌రెడ్డి శామీర్‌పేట మండల అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ గడువు ముగుస్తున్నందున ఎస్ఐఆర్ ఫారాలను తప్పులు లేకుండా సక్రమంగా నింపి బిఎల్‌ఒలకు అప్పగించాలని సూచించారు. ఈ ఫారాలను పూర్తి చేయడానికి అన్ని పార్టీల నాయకులు, బిఎల్ఎలు సహకారం అందించాలని కోరారు. ఇప్పటికి 75 శాతం పూర్తైందని ఇంకా 25 శాతం ఫారాలు రావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నక్క సందీప్‌గౌడ్, శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి నరేందర్‌ప్రసాద్, టిఆర్ రవీందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## పట్నం రుక్కమ్మకు కన్నీటి వీడ్కోలు

**ప్రజాపక్షం/తాండూరు:** మాజీ మంత్రి, ప్రభుత్వ చీఫ్‌విఫ్ పట్నం మహేందర్ రెడ్డి సోదరుడు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిల మాతృమూర్తి పట్నం రుక్కమ్మ అంత్యక్రియలు శనివారం షాబాద్ మండల పరిధి గొల్లుగూడలో నిర్వహించారు. అంత్యక్రియలకు పట్నం కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, అభిమానులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి భారీ ఎతున్న అభిమానులు, నాయకులు తరలివచ్చి అంతిమ విడ్కోలు పలికారు. అంత్యక్రియలకు ఉమ్మరంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, మాజీ ఎంఎల్ఎలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున్న తరలివచ్చారు. తాండూరు ప్రాంతానికి చెందిన నాయకులు పార్టీలకు అతీతంగా అంత్యక్రియలకు పాల్గొని నివాళులు అర్పించడంతో పాటు పట్నం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## రహదారి భద్రతపై విద్యార్థి నాయకులు సమాజంలో అవగాహన కల్పించాలి

### పల్లవి ఇంటర్నేషనల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా తిరుమలగిరి డివిజన్ ఏసిపి శంకర్‌రాజు




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శంకర్‌రాజు అన్నారు. శనివారం శామీర్‌పేట డివిజన్ తూంకుంటలోని పల్లవి ఇంటర్నెషనల్ స్కూల్ వ్యవస్థాపక దినోత్సవం (ఫౌండర్స్ డే) ఇన్వెస్టిచర్ సెరిమనీ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి భారత వాయుసేనా రిటైర్డ్ గ్రూప్ క్యాప్టెన్ డి.వి.ఎన్‌రావు, శామీర్‌పేట ఎస్ఐ సోమిరెడ్డిలు ముఖ్య అతిదిగా విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మరియు పాఠశాల యాజమాన్యాన్ని ఉద్దేశించి రహదారి భద్రత, ట్రాఫిక్ క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన రహదారి వినియోగంపై అవగాహన కల్పించారు. పిల్లల్లో ట్రాఫిక్ క్రమశిక్షణ




పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని వివరించారు. పిల్లలు తమ తల్లిదండ్రుల ప్రవర్తనను అనుసరిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నళ్లను పాటించాలని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వాడకూడదని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ట్రాఫిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తు ట్రాపిక్ సేఫ్టీ అంబాసిడర్‌గా వ్యవహరించాలని కోరారు. పాదచారు ల భద్రత, జీబ్రా క్రాస్టింగ్ వినియోగం, లేన్ క్రమశిక్షణ, వేగ నియంత్రణతో పాటు బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ డైరక్టర్ డాక్టర్ కార్తిక్ సంకూరి, హెచ్ఎం సుచరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో మరో స్నాచింగ్ యత్నం... నిందితుడి పరారీ

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో స్నాచింగ్ చేసేందుకు యత్నించిన ఉదంతం చోటు చేసుకొంది. శనివారం తెల్లవారు జామున సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు ప్రాంతానికి చెందిన కర్ర చోక్లీ అనే మహిళ తన కుమారుడు ధీరజ్‌తో కల్సి ఉప్పల్ రింగ్‌రోడ్ మీదుగా వెళుతున్నారు. ఉప్పల్ మెట్రో స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుండి వచ్చి మెడలో ఉన్న బంగారు మంగళసూత్రం లాక్కొనేందుకు యత్నించటంతో స్థానికులు కొంత మంది వెంటపడటంతో దుండగుడు పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని సిసిటివి ఫుటేజి ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. శుక్రవారం ఇదే పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామంతాపూర్ సమీపంలోని గోఖలేనగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో మహిళ మెడలోంచి బంగారు మంగళసూత్రం లాక్కొనే యత్నంలో స్థానికులచే పట్టుబడి జైలు పాలయ్యాడు. వరుస స్నాచింగ్ ఉదంతాలతో స్థానికులు బెంబేలెత్తుతున్నా రు.

## రంగనాథుని సన్నిధిలో కర్రె రాజేష్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా యంనంపేట్‌లోని శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైష్ణవ సంప్రదాయంలో పవిత్రమైన ఈ పర్వదినం సందర్భంగా స్వామివారి దర్శనం, నామస్మరణతో దైవానుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం ఈ సందర్భంగా పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె రాజేష్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాలపై నిర్వాహకులతో చర్చించారు.

## విద్యార్థులను ఉన్నత స్థాయిలో ఉంచే బాధ్యత ఉపాధ్యాయులదే

### మండల విద్యాధికారి అంజయ్య

**ప్రజాపక్షం/పరిగి :** మౌలికభాష, గణిత సామర్థ్యాల నైపుణ్యాలను సాధించడంలో వెనుకబడిన విద్యార్థులను ఆదుకోవడానికి ప్రత్యేకంగా కేటాయించిన సమయమే రెమిడియేషన్ అని పరిగి విద్యాధికారి అజయ్య అన్నారు. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్, ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ కొరకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం జరిగే కార్యక్రమంలో మొదటి స్పెల్ గురువారం నుండి శనివారం వరకు 50శాతం మంది ఉపాధ్యాయులకు మిగిలిన 50శాతంమంది రెండవ స్పెల్‌యందు హాజరు కావాల న్నా రు. విద్యార్థులను ఉన్నతస్థాయిలో ఉండే విధంగా చేసే బాధ్యత ఉపాధ్యాయుల పైననే ఉందని ఎంఇఒ తెలిపారు.

మైండ్ బెండింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 'లూసీ' సినిమా షూటింగ్ పూర్తయింది. సస్పెన్స్, థ్రిల్, ఊహించని మలుపులతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సైన్మా స్టూడియోస్ బ్యానర్‌పై రాఘవేంద్ర పూజారి, నాగ్ పూజారి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అండాలమ్మ పిక్చర్స్ సమర్పిస్తోంది.






## 'విశ్వనాథ్ అండ్ సన్స్' నుంచి వెడ్డింగ్ సాంగ్ విడుదల

తమిళ నటుడు సూర్య హీరోగా రూపొందుతున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్. లక్కీ భాస్కర్ చిత్ర దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో పెళ్లి సందర్భంగా వచ్చే వెడ్డింగ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో సూర్య సరసన మమిత బైజు హీరోయిన్ గా నటిస్తోంది. జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో బిజీగా ఉంది. రాధికా, రవీనా తాండన్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి ఆగస్టు 14న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. లక్కీ భాస్కర్ లాగానే విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమా కూడా ఒక వైవిధ్యమైన కథతో తీసుకువచ్చానని వెంకీ అట్లూరి తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్ నవీన్ నూలి, కొరియోగ్రఫీ శేఖర్ మాస్టర్, నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

## విలన్‌గా మోహన్ బాబు స్టిల్స్



'శ్రీనివాస మంగాపురం' సినిమాలో విలన్‌గా మంచు మోహన్ బాబు నటిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న దివంగత రమేష్ బాబు తనయుడు జై కృష్ణ హీరోగా అపరిచయమవుతున్న సినిమా శ్రీనివాస మంగాపురం. ఆర్‌ఎక్స్ 100, మంగళవారం వంటి హిట్ సినిమాలు తీసిన అజయ్ భూపతి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కించారు. చాలా రోజుల తరువాత మోహన్ బాబు ఈ సినిమాలో విలన్ గా నటిస్తున్నారు. మోహన్ బాబుకు సంబధించిన వర్కింగ్ స్టిల్స్‌ను విడుదల చేశారు. రషా తాడని హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఈ చిత్రాన్ని అశ్వని దత్ సమర్పణలో జెమిని కిరణ్ నిర్మిస్తున్నారు. జివి ప్రకాష్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఈ నెల 30న విడుదల చేస్తున్నారు.

## జీవితాంతం గుర్తుండిపోయే పాత్ర చేయాలనుంది

తెలుగు సినిమా కళామతల్లిని నమ్ముకుని ఉన్న వాళ్లకు ఎదో ఒక రోజు ఖచ్చితంగా హిట్ వస్తుంది అని అంటుంటారు పెద్దలు. ఒక్క హిట్ వచ్చిందా ...వెనక్కి తిరిగి చూడాల్సిన పనుండదు. ఆ ఒక్క హిట్టు కోసమే నటీనటులు, సాంకేతిక నిపుణు ప్రతి ఒక్కరూ కష్టపడుతుంటారు. అలాంటి ఒకటి కాదు వరుసగా రెండు హిట్లు వచ్చాయి. ఆ రెండు హిట్ సినిమాలతో ఇండస్ట్రీలో ఫుల్ బిజీ అయిపోయారు నటుడు ఐరేని మురళీధర్ గౌడ్. బలగం, డిజె టిల్లు సినిమాలు ఇచ్చిన సక్సెస్ తో ఆయన వెనక్కి తిరిగి చూసుకోలేదు. టాలీవుడ్ ఫిలిం ఇండస్ట్రీలో అత్యంత బిజీగా ఉన్న క్యారెక్టర్ యాక్టర్ మురళీధర్ గౌడ్ 'బలగం' సినిమాలో మటన్ బొక్క కోసం పెద్ద గొడవ చేశాడీ బావ. బలగం సినిమాలో ఈ సన్నివేశం అత్యంత కీలకమైంది. బలగం సినిమా చూసిన ప్రతి ఒక్కరు మురళీధర్ గౌడ్ ను మరచిపోలేరంటే అతిశయోక్తి కాదు. అన్నపూర్ణ స్టూడియోలో డబ్బింగ్ చెప్తున్న మురళీధర్ గౌడ్ 'ప్రజాపక్షం'కు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. మురళీధర్ గౌడ్‌తో చేసిన మాట ముచ్చట ఇది.

- ఫస్ట్ టైం డిజె టిల్లులో చూసి ఫ్యామిలీ ఆశర్య పోయారు
- డిజె టిల్లు, బలగం సినిమాలతో మంచి గుర్తింపు
- 'ప్రజాపక్షం' ప్రత్యేక ఇంటర్వ్యూలో నటుడు ఐరేని మురళీధర్ గౌడ్

**ప్రశ్న : మీ నేపథ్యం గురించి చెప్పండి ?**

**మురళీధర్ గౌడ్:** మాది మెదక్ జిల్లా రామాయన్ పేట గ్రామం. తండ్రి గౌరయ్య గౌడ్ తల్లి రాజమనెమ్మ. నాలుగో తరగతి వరకు ఊర్లోనే చదువా. హెచ్ ఎస్‌సి వరకు గజ్వేల్‌లో చదివిన. పియుసి నుంచి డిగ్రీ వరకు సిద్దిపేటలో చదువుకున్న. 1974లో బిఏ పూర్తి చేశా. కొద్ది రోజులు వ్యవసాయం చేసిన, వ్యాపారం చేశాను. ఇలా చేస్తున్న క్రమంలో విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. 1984లో ఎపి ఎస్ఇబిలో ఇఆర్‌ఒగా మహబూబ్ నగర్ జిల్లా వనపర్తిలో ఉద్యోగంలో జాయిన్ అయ్యాను. 2012లో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో పదవీ విరమణ పొందాను.

**ప్రశ్న: యాక్టింగ్ వైపు ఇంట్రెస్ట్ ఎలా పుట్టింది ?**

**మురళీధర్ గౌడ్ :** నేను స్కూల్‌కు వెళ్లే సమయంలోనే సినిమా పోస్టర్లు చూసి అనుకునేవాన్ని యాక్టర్ కావాలని. అవుతానని అప్పుడే నాకు అనిపించేది. పోస్టర్లు సినిమాలు చూస్తుటే ఇది మనకు పరిచయం ఉన్న ఫీల్డ్ లాగా ఫీలింగ్ వచ్చేది. ఇది మనకు తెలిసిన వ్యవహారమే అనిపించేది. ఒకసారి నేను స్కూల్‌లో ఒక ప్రోగామ్ చేస్తే నాకు బహుమతి కూడా ఇచ్చారు. ఫ్యాషన్ షో లాంటిది చేసిన. అది చూసి అందరూ మెచ్చుకున్నారు. చాలాబాగా చేశావని అప్పటి ఆ సమితి ప్రెసిడెంట్ ఆయన జేబులో నుంచి పది రూపాయలు తీసి ఇచ్చారు నాకు. అప్పట్లో సమితి ప్రెసిడెంట్ అంటే చాలా గొప్ప వ్యక్తి. అంత పెద్ద మనిషి ఆ రోజుల్లో పది రూపాయలు బహుమతిగా ఇచ్చాడంటే నాకు చాలా హ్యాపీగా అనిపించేది.

**ప్రశ్న : సినిమాల్లో అవకాశాలు ఎలా వచ్చాయి ?**

**మురళీధర్ గౌడ్:** రిటైర్మెంట్ తరువాత కొన్ని సీరియల్స్ చేశాను. సీరియల్స్ చేస్తున్నప్పుడు ఆ డైరెక్టర్స్ చెప్పేవారు మీరు సినిమాలో కూడా ట్రై చేయండి అని. ఒకటి రెండు సినిమాలకు గ్రూపుల్లో కూడా నిలబడి చేసిన. అలా వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకున్న. డిజె టిల్లు సినిమా నాకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. బలగం సినిమా నాకు మంచి నటుడిగా పేరు తెచ్చి పెట్టింది. పరేషాన్ అనే సినిమాలో ఫుల్ లెన్త్ క్యారెక్టర్ చేసిన. అనిల్ రావిపూడి నాకు భగవంత్ కేసరి సినిమాలో ఛాన్స్ ఇచ్చాడు. ఆ సినిమాతో నాకు మరింత మంచి పేరు వచ్చిది. అలాగే అనిల్ రావిపూడి తీసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో కూడా చేశాను. తెలంగాణ యాసలో బాగా మాట్లాడిన గలిగిన నాతో అనిల్ రావి పూడి 'సంక్రాంతికి వస్తున్నాం'లో పశ్చిమ గోదావరి యాసలో మాట్లాడించాడు. గోదావరి స్లాంగ్ మాట్లాడం కొత్తగా ఉన్నప్పటికీ చాలా మంచి గుర్తింపు వచ్చింది.

**ప్రశ్న : ఇప్పుడు మీరు చేస్తున్న సినిమాలు, క్యారెక్టర్స్‌తో సంతృప్తిగానే ఉన్నారా ?**


**మురళీధర్ గౌడ్:** ఫుల్ సంతృప్తిగానే ఉన్న. డిజె టిల్లు, బలగం, భగవంత్ కేసరి, సంక్రాంతికి వస్తున్నాం ఇలా వరుసగా అన్ని హిట్ సినిమాలే చేశాను. అన్ని సినిమాల్లో నాకు ఇచ్చిన క్యారెక్టర్‌కు న్యాయం చేస్తాను. డిజె టిల్లు , బలగం తరువాత నాకు మంచి గుర్తింపు తెచ్చిన మరో మంచి సినిమా 'వెంకట్రామయ్య గారి తాలూకా' ఈ సినిమాలో ఫుల్ లెన్త్ క్యారెక్టర్ టైటిల్ రోల్ చేసిన. చాలా మంచి సినిమా. నా కెరీర్‌లో చెప్పుకోదగ్గ సినిమా.

**ప్రశ్న : రిటైర్మెంట్ తరువాత ఇంకేం పని చేస్తావు ? ఇంట్లో కూర్చోవచ్చు కూడా అని ఫ్యామిలీ అనలేదా?**

**మురళీధర్ గౌడ్:** ఎటన్న పొమ్మన్నారు... నాది పని చేసే మనస్తత్వం. ఖాళీగా ఉండబుద్ది కాదు టైం వేస్ట్ చెయ్యకూడదు అనేది నా సిద్ధాంతం. ఎప్పుడూ బిజీగా ఉండాలని ఆలోచిస్తుంటాను. అందుకే నేను ఎక్కువగా టైం వేస్ట్ చెయ్యను. కష్టపడి పని చేయాలి అనేది నా తత్వం.

**ప్రశ్న : మీ ఫ్యామిలీ అందరూ కలసి చూసిన సినిమా ఏది ?**

**మురళీధర్ గౌడ్ :** మా ఫ్యామిలీ అందరం కలసి చూసిన సినిమా డిజెటిల్లు. సినిమాలో నన్ను చూసి ఆశ్యర్యపోయారు. యాక్టర్ కావాలనే నా కోరిక ఇంట్లో ఎవరికీ తెలియదు. నేను ఎవరికీ చెప్పలేదు. ఫస్ట్ టైం నన్ను స్క్రీన్ మీద చూసి మావాళ్లంతా ఆశ్యర్యపోయారు.



**ప్రశ్న : మీ మీద ఎవరి ప్రభావం అయినా ఉందా ?**

**మురళీధర్ గౌడ్ :** లేదు... ఎందుకంటే ఒకరి ప్రభావం ఉంటే ఆయన లాగే చేశారు అంటారు లేదా ఆయనను కాపీ కొట్టి చేశారు అంటారు. నాకు అలా ఇష్టం ఉండదు. ఏ క్యారెక్టర్ అయినా నా పద్ధతిలో నేను చెయ్యాలనుకుంటాను. ''సివరపల్లి'' అనే వెబ్ సిరీస్ చేసిన. ''పంచాయతీ' అనే హిందీ సిరీ స్‌ను తెలుగులో రీమేక్ చేశారు. ఇందులో స ర్పంచ్ క్యారెక్టర్ నాది. పల్లెటూర్లో సర్పంచ్ ఎలా ఉంటారో అలాగే చెయాలి. అయితే నేను ఒరిజినల్ హిందీ పంచాయతీ చూడలేదు. ఇంప్రువైజ్ చేసి సర్పంచ్ క్యారెక్టర్ చేసిన. తరువాత పంచాయతీలో ఉన్నట్టే చాలా పర్ఫెక్ట్‌గా వచ్చింది అన్నారు చూసిన వాళ్లంతా. ఉదాహరణకు కొబ్బరిమట్ట డైరెక్టర్ నాకు ఫోన్ చేసి ఒక సీన్ చెప్పారు. ఇది కరోనా టైం లో జరిగింది. సింగరేణి ఉద్యోగం చేసే తండ్రి , పని పాటలేని కొడుకు. కొడుక్కి ఎదో పని చెప్పి డ్యూటీకి వెళ్లిన తండ్రి తిరిగి వచ్చేవరకు కొడుకు చెప్పిన పని పూర్తి చేయకుండా టివి ముందు కూర్చుని ఉన్నప్పుడు కొడుకుని కోప్పడే సీన్ అది. ఈ సన్నివేశాన్ని వీడియో తీసి పంపండి అని చెప్పారు. నేను మా ఫ్రెండ్‌కు మొబైల్ ఇచ్చి యాజిటీజ్‌గా సింగరేణి ఉద్యోగిలా తయారై ఓ సైకిల్ మీద ఇంటికి వచ్చి, టివి ముం దు కూర్చున్న కొడుకుని కోప్పడే సీన్ చేసి డైరెక్టర్‌కు పంపించాను. యాజిటీజ్‌గా ఇదే సీన్ ప్లాన్ చేసిన అని తరువాత డైరెక్టర్ చెప్పాడు.

**ప్రశ్న : డ్రీమ్ క్యారెక్టర్ ఏమైనా ఉందా ?**

**మురళీధర్ గౌడ్ :** ప్రత్యేకంగా డ్రీమ్ క్యారెక్టర్ ఏమి లేదు కానీ జీవితాంతం గుర్తుండిపోయే పాత్ర ఒకటి చెయ్యాలని ఉంది. ప్రతి క్యారెక్టర్‌ను చాలా ఇష్టంగా చేస్తా. ప్రతి షూటింగ్‌ను ఒక డ్యూటీగా భావించి చేస్తా. ఇప్పటివరకు చేసినవి మంచి క్యారెక్టర్స్ చేశారు. హీరో తండ్రిగా, హీరోయిన్ తండ్రిగా ఇలా రకరకాల పాత్రలు చేస్తున్న. కానీ ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్ర చేయాలని ఉంది.

## 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కమల్ కామరాజు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యుఆర్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేవీఎస్‌ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు.ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో లీడ్ యాక్టర్స్ ఇంటెన్స్ లుక్స్ లో కనిపిస్తుండగా, వారి బ్యాక్ డ్రాప్‌లో ఒక మహానగరాన్ని చూపించారు. లీడ్ యాక్టర్స్ అంతా బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో ఉండటం ఆసక్తి కలిగిస్తోంది. న్యూ ఏజ్ కమర్షియల్ థ్రిల్లర్ మూవీని చూడబోతున్నామనే ఇంప్రెషన్ 'ది మేజ్' ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఏర్పడుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ మాట్లాడారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ రాజు అద్దాల, ఎడిటర్ సత్య గిడుతూరి, డిఒపి శివ కృష్ణ, మ్యూజిక్ శ్రావణ్ భరద్వాజ్, కో– ప్రొడ్యూసర్స్ డాక్టర్ విక్రమ్ సింగిరికొండ, బండ సురేందర్ రెడ్డి, ఎన్. విజయ్ ఎస్ రెడ్డి, కరెడ్డి రఘువంశీ రెడ్డి.

## తలొగ్గిన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

సంఘీభావంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లా జా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో తెలంగాణ ముఖ్యమంత్రి నుముల రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో వి ద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీని ఉద్దేశించి ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వి ద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను సోమవారం నా టికి ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరారు.

ప్రధానమంత్రి మృతుల కుటుంబాలను కలిసి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ నలుమూలల నుంచి వేలాది మంది యువత స్వచ్ఛందంగా ఈ సభకు హాజరయ్యారని, వారు కాంగ్రెస్ కార్యకర్తలు కాదని, దేశ భవిష్యత్తు కోసం పోరాడుతున్న యువత అన్నారు. 'రాజకీయ పార్టీలు కేవలం విద్యార్థులు, యువత పోరాటానికి మద్దతు ఇచ్చాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయించింది మీ పట్టుదల, మీ ఉద్యమమే' అని సిఎం పేర్కొన్నారు. 'రాజకీయ ప్రత్యర్థులను ఈడి, సిబిఐ, ఆదాయపు పన్ను కేసులతో భయపెట్టవచ్చు. కానీ యువత సంకల్పాన్ని ఎవరూ అణచలేరు. లాఠీచార్జీలు, బాష్పవాయు గోళాలు కూడా మీ పోరాటాన్ని ఆపలేకపోయాయి' అని అన్నారు.





**చట్టసభల్లోనూ జెన్‌జీ గళం ప్రతిధ్వనించాలి**

జెన్‌జీ యువత సాధించిన ఈ విజయాన్ని దేశవ్యాప్తంగా విస్తరించి, వీధుల్లో వినిపించిన గళం చట్టసభల్లోనూ ప్రతిధ్వనించేలా పోరాటాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో 543 మంది లోక్‌సభ సభ్యుల్లో జెన్‌జీ ప్రాతినిధ్యం ఒక్క శాతం కూడా లేదని, కానీ దేశ జనాభాలో జెన్‌జీ యువత వాటా సుమారు 30 శాతం ఉందని ఆయన అన్నారు. యువతకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. విద్యాశాఖ, ఐటి వంటి కీలక శాఖలను యువత నడిపితేనే దేశం ప్రపంచంతో పోటీ పడగలదని అభిప్రాయపడ్డారు. దేశంలో యువతకు రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. రాజీవ్ గాంధీ 61వ రాజ్యాంగ సవరణ ద్వారా 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో యువతకు అవకాశాలు విస్తరించాయని చెప్పారు. ప్రస్తుతం 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సివిల్ సర్వీసులకు అర్హత లభిస్తోందని, కానీ ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేయడానికి మాత్రం 25 ఏళ్ల వయస్సు నిబంధన కొనసాగుతోందని పేర్కొన్నారు. జర్మనీ, గ్రేట్ బ్రిటన్ వంటి దేశాల్లో 18 ఏళ్లకే చట్టసభలకు ఎన్నికయ్యే అవకాశం ఉందని, సింగపూర్లో 21 ఏళ్లకే ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉందని ఉదాహరణలు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు తొలి వారంలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే, ఎంపిగా పోటీ చేసే కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేస్తామని ప్రకటించారు. అనంతరం పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేలా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని తెలిపారు.

**ఐక్యత చాటిన విద్యార్థులు : మహేష్ కుమార్**

మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొని తమ ఐక్యతను చాటారని పేర్కొన్నారు. దేశంలో ఏకఛత్రాధిపత్య పాలనకు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావత్ విద్యార్థి లోకం ఏకమైందని అన్నారు. నీట్ వంటి కీలక పరీక్షను కూడా పారదర్శకంగా నిర్వహించలేని దుస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే జెన్‌జీ తరం నుంచి ఒకరిని కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచే యువత పెద్దఎత్తున ప్రజాప్రతినిధులుగా ఎదిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు. నీట్ పేపర్ లీక్ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమ ఫలితం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా 27 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువతపై నమోదైన కేసులను ఎత్తివేయాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. విద్యామంత్రి రాజీనామా చేసే వరకు సభను సజావుగా నడవనివ్వబోమని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి, వామపక్ష పార్టీలు స్పష్టం చేశాయని అన్నారు. చివరకు విద్యామంత్రి రాజీనామా చేయడం ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన విజయమన్నారు. దేశంలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి, వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు, విద్యార్థియువజన సంఘాలు ఐక్యంగా పోరాడితే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన అన్నారు.

## ప్రైవేటు కంపెనీలపై విచారణకు హక్కుల కమిషన్‌కు అధికారం లేదు

### హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైవేటు కంపెనీలు, వాటి ఉద్యోగుల మధ్య తలెత్తే వివాదాలను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ విచారించే అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మానవ హక్కుల కమిషన్ చట్టం1993 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలపైనే కమిషన్ విచారణ జరపాలని పేర్కొంది. వెల్స్ ఫర్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇద్దరు మహిళా ఉద్యోగులు చేసిన ఫిర్యాదులపై హక్కుల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు రద్దు చేసింది.

## బిహార్‌లో నిరసనాగ్ని

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. బంద్ సందర్భంగా శనివారం పాట్నాలోని ప్రైవేట్ పాఠశాలలను మూసివేయాలని పట్నా జిల్లా యంత్రాంగం ఆదేశించింది. జనశక్తి జనతాదళ్ (జెజెడి) చీఫ్ తేజ్ ప్రతాప్ యాదవ్ మద్దతు తెలిపేందుకు పట్నాలోని రామ్ గులాంచౌక్‌ను సందర్శించారు. అయితే, అనంతరం ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సివాన్ జిల్లాలోని జెపి చౌక్ వద్ద ఏఐఎస్ఏ, ఆర్‌వైఏ, ఇతర వామపక్ష సంస్థలు నిరసనలు చేపట్టాయి. మాజీ ఎంఎల్ఏ , సిపిఐ(ఎంఎల్) నాయకుడు అమర్‌జీత్ కుష్వాహా, నిరసన సమయంలో ఎవరైతే అక్కడ ఉన్నారో ఆయన ఈ విషయమై స్పందిస్తూ 'గత 26రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన కొనసాగుతోంది. బుధవారం పట్నా వీధుల్లోకి కూ డా విద్యార్థులు వచ్చారు. అయితే, ఢిల్లీ, పట్నా రెం డింటిలోనూ విద్యార్థులు క్రూరమైన పోలీస్ చర్యను ఎదుర్కొన్నారు. మహిళలు, బాలికలను కూడా వదల్లేదు. నిరసనలను అణచివేసే విషయంలో ప్ర భుత్వం నియంతృత్వ వైఖరిని అవలంభించిందని ఆయన ఆరోపించారు. జిల్లాలో నిరసనకారుల వేర్వే రు గ్రూప్‌ల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దుండగులపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి కఠిన చర్య లు తీసుకుంటామని ఎస్ పురన్ చంద్ర ఝా విలేక రులకు తెలిపారు. సారన్ జిల్లాలోని చాప్రాలో నిరసనలు హింసాత్మకంగా మారాయి. అక్కడ విద్యార్థు లు పోలీసు సిబ్బందిపై రాళ్లు రువ్వారు. జిల్లా పరిపాలనా వాహనానికి నిప్పుపెట్టారు. అనేక ఇతర వా హనాలను ధ్వంసంచేసి బారికేడ్లతో పారిపోయారు. ఔరంగాబాద్ జిల్లాలో నిరసనకారులు రాళ్లురువ్వడంతో ఇద్దరు పోలీస్ అధికారులు, ఒక జర్నలిస్ట్ గా యపడ్డారని అధికారులు చెప్పారు. భాగల్పూర్‌లో స్టేషన్ చౌక్ నుంచి శాంతియుత నిరసన ప్రదర్శన ప్రారంభం కాగా, రద్దీగా ఉండే తిలకమాంఝీ క్రాసింగ్ వద్దకు చేరుకుంటుండగా కొందరు విద్యార్థులు రహదారిని దిగ్బంధించి, పోలీసులపై రాళ్లు రువ్వారు. నిరసన ప్రదేశం సమీపంలో నిరసనకారులు ఒక పోలీస్ వాహనాన్ని తలకిందులు చేశారు. పరిస్థితి ఇప్పుడు అదుపులో ఉందని భాగల్పూర్ డిఎం అంకృత పాండే చెప్పారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ), రెవల్యూషనరీ యూత్ అసోసియేషన్ (ఆర్‌వైఏ) బ్యానర్లను పట్టుకున్న నిరసనకారులు టైర్లను తగులబెట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సమస్తిపూర్–పట్నా రహదారిని దిగ్బంధించారు.

## మళ్లీ ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

పలు విషయాల్లో కోర్టు మెట్లు ఎక్కి అనేకసార్లు ఎదురుదెబ్బలు తిన్నారు. మళ్ళీ మరోసారి ఆయనకు శరాఘాతం తగిలింది. భారీగా దరఖాస్తు రుసుము వసూలు చేసే కొత్త విధానం అమలు చేసే అధికారం లేదని 2026 జూన్ 8వ తేదీన ఫెడరల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి లియో టి.సోరోకిన్ మొదటిసారి తీర్పు చెప్పాక కూడా ట్రంప్ వెనక్కు తగ్గలేదు. ఫెడరల్ విధానంలో మార్పులు చేసి అటువంటి భారీ రుసుము వ సూలు చేసేందుకు చట్టబద్ధ అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. అమెరికాలో దేశాధ్యక్షుడు ఏం చేయాలన్నా పూర్తిగా చట్టసభ కాంగ్రెస్‌నే మొదట ఆశ్రయించాలి. తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చినాగానీ పూర్తిస్థాయిలో అది అమలులోకి రావాలంటే అనివార్యంగా కాంగ్రెస్ ఆమోదం పొందాల్సిందే. కానీ కాంగ్రెస్‌ను పక్కదారి పట్టించి భారీగా ఈ దరఖాస్తు రుసుము వసూళ్ళకు ట్రంప్ సిద్ధపడ్డా రు. ఈ కోర్టు తీర్పువల్ల భారతీయులకే ఎక్కువగా మేలు జరుగుతుంది. గత ఏడాది డిసెంబరులో ఈ ప్రతిపాదన వచ్చిన వెంటనే డెమోక్రాట్స్ అటార్నీ జనరల్స్ కూటమి కోర్టును ఆశ్రయించింది. బరాక్ ఒబామా అధ్యక్షుడుగా ఉండగా న్యాయమూర్తిగా నియమితులైన సోరోకిన్ తన 42 పేజీల తీర్పులో జూన్‌లో ఒక తీర్పు చెప్పగా, ఇప్పుడు రెండోసారి స్టే ఉత్తర్వులను కూడా మరో న్యాయస్థానం తిరస్కరించింది.

**హెచ్1 బి వీసా నిర్మూలనకు సెనేట్‌లో రిపబ్లికన్ బిల్లు**

అపార నైపుణ్యంగల విదేశీయులను అమెరికాలోకి అనుమతించకుండా, దేశీయ అమెరికన్ నిపుణులకు పూర్తి ప్రోత్సాహం ఇచ్చేవిధంగా హెచ్1 బి వీసాను మూడేళ్ళపాటు రద్దు చేయాలని కోరుతూ రిపబ్లికన్‌పార్టీకి చెందిన సెనేటర్ టిమ్ షీహీ ఒక బిల్లు ప్రతిపాదించారు.విదేశీయులను దేశంలోకి రానీయకుండా అడ్డుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం, ఆయన ఎంపీలు గరిష్ఠస్థాయిలో బలమైన ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలలో భాగంగా టిమ్ షీహీ జులై 23వ తేదీన ఈ బిల్లు తీసుకువచ్చారు. ఈ బిల్లులో స్థానిక అమెరికన్లకు కొన్ని రక్షణలు కూడా ఉండాలని ప్రతిపాదించారు. ''హెచ్1 బి దుర్వినియోగ చట్టం–2026'' పేరుతో సెనేట్‌లో ఆయన ఈ బిల్లు ప్రతిపాదించారు. మన అమెరికన్లు చేయలేని, అత్యంత సంక్లిష్టమైన బాధ్యతలు నిర్వహించడానికి విదేశీ నిపుణులను తెచ్చుకోండి, కానీ అమెరికన్లు చేయగలిగిన పనులకు కూడా అతి తక్కువ జీతాలు చెల్లించేందుకు విదేశాల నుండి నిపుణుల పేరుతో ఉద్యోగులను దిగుమతి చేసుకోవడం స్థానిక అమెకన్లకు అన్యాయం చేయడం, వారిని నిరుద్యోగులుగా మార్చడమే అవుతుందని టిమ్ షీహీ వాదిస్తున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com